

లోగ్రేడ్.. నోబిడ్

సగటున 28శాతానికిపైగా పొగాకు బేళ్ల తిరస్కరణ

- కొన్నిచోట్ల 35శాతంపైనే
- కనిష్ఠ ధరలు తగ్గించినా స్పందన నిల్
- మీడియం గ్రేడ్‌లకూ తగ్గింపు
- మేలురకం కోసం కంపెనీల పోటీ
- అయినా గరిష్ఠ ధరపై నియంత్రణ
- ఆందోళన వ్యక్తంచేస్తున్న రైతులు
- టంగుటూరులో రోడ్డెక్కి నిరసన



ఒంగోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వ్యాపారుల తీరులో ఏమాత్రం మార్పులేదు. వేలానికి వస్తున్న అన్నిరకాల బేళ్లను కొనుగోలు చేయాలని, నోబిడ్‌లు లేకుండా చూడాలని మంత్రులు ప్రత్యేక సమావేశం పెట్టి మరీ చెప్పినా వారిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. నోబిడ్‌లు మరింత పెరుగుతున్నాయి. ప్రత్యే కించి లోగ్రేడ్ తిరస్కరణల సంఖ్య అధికంగా ఉంటోంది. కనిష్ఠ ధరలు తగ్గించి మరీ కొనుగోలు జరిగేలా బోర్డు అధికారులు ప్రయత్నించినా లాభం లేకుండాపోయింది. మంగళవారం

మిగతా 6వ పేజీలో


టంగుటూరు వేలం కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు


కొండపి నుంచి విజయం సాధించిన స్వామి ఆనందం (ఫైల్)


ఒంగోలులో విజయం సాధించిన అనంతరం విక్టరీ సింబల్ చూపుతున్న జనార్దన్ (ఫైల్)

ప్రజా విజయానికి ఏడాది


ఎంపీగా మాగుంట విజయ దరహాసం (ఫైల్)

దగాల్లేవు.. దౌర్జన్యాలు లేవు..

- అక్రమ కేసులకు ఫుల్‌స్టాప్
- నెలకొన్న రాజకీయ సుస్థిరత
- భూ ఆక్రమణలకు అడ్డుకట్ట
- నామినేటెడ్ పదవుల్లోనూ జిల్లాకు పెద్దపీట

కూటమికి ప్రజలిచ్చిన విజయానికి బుధవారంతో ఏడాది పూర్తవుతుంది. 'వైనాట్ 175' అంటూ నాడు అధికారంలో ఉన్న వైసీపీ నినాదాన్ని ప్రజలు తిప్పికొట్టారు. కూటమికి లభించిన విజయంలో ఉమ్మడి జిల్లా ప్రజల పాత్ర గణనీయమైంది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడింది ఇదే రోజు. ఆ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు, జిల్లాతో సంబంధం ఉన్న రెండు పార్లమెంట్ స్థానాల్లో టీడీపీకి విజయం లభించింది. దీంతో ఆ గెలుపును, తదనంతరం రాజకీయ పోకడలను ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

ఒంగోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని దర్శి, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వల్ప ఆధిక్యంతో వైసీపీ అభ్యర్థులు గెలుపొందగా మిగిలిన అన్ని స్థానాలనూ టీడీపీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. తదనంతరం ఉమ్మడి జిల్లాకు కూటమి ప్రభుత్వం కూడా ప్రాధాన్యమిచ్చి రెండు మంత్రి పదవులతోపాటు కొన్ని కార్పొరేషన్ పదవులను, కిందిస్థాయిలో పలువురికి నామినేటెడ్ పోస్టులను ఇచ్చి రాజకీయంగా సముచిత గౌరవాన్ని అందించింది.

ఇటు సఫలం.. అటు విఫలం..

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల వరకూ తెలుగుదేశం పార్టీ అనుసరించిన విధానం విజయవంతమైంది. వైసీపీ అనుసరించిన

మిగతా 6వ పేజీలో


జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కొవిడ్ వార్డు

కొవిడ్‌పై అప్రమత్తం

జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లు

ప్రత్యేక వార్డు, వైద్య పరికరాలు సిద్ధం

ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కొవిడ్ వైరస్ మరోసారి విస్తరిస్తున్న నేపథ్యంలో నియంత్రణపై ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లాలో మూడు కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా జీజీహెచ్‌లోని అమెరికన్ షెడ్స్‌లో పడకలను ఏర్పాటు చేశారు. అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక ఓపీ వార్డును ఏర్పాటు చేశారు. అక్కడ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఆక్సిజన్ అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వై.ఏడుకొండలు మాట్లాడుతూ రోజురోజుకూ కొవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైరస్ వ్యాప్తిని అరికట్టే దిశగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చేవారికి తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలా అని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఎలాంటి అనుమానిత లక్షణాలు కనిపించినా జీజీహెచ్ వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కొవిడ్ వార్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

పీఎస్ హెచ్‌ఎంల బదిలీల్లో గందరగోళం

- 404 మంది ఎస్‌ఏలకు ఉద్యోగోన్నతి
- ఒకస్థానం ఇద్దరికి కేటాయింపు
- సాంకేతిక సమస్యలతో సతమతం



ఒంగోలు విద్య, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా (పీఎస్ హెచ్‌ఎం) స్కూలు అసిస్టెంట్ల నియామకంలో గందరగోళం చోటుచేసుకుంది. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అందరూ తలలు పట్టుకుంటున్నారు. ఒకే స్థానాన్ని ఇద్దరు హెచ్‌ఎంలకు కేటాయించడంతో వారు లబోదిబోమంటున్నారు. 509 మంది స్కూలు అసిస్టెంట్లను పీఎస్ హెచ్‌ఎంలుగా నియమించాల్సి ఉండగా 404మందిని మాత్రమే నియమించారు. కొందరు టీచర్లకు తప్పనిసరి బదిలీ లేనప్పటికీ ఆ స్థానాలు ఖాళీలుగా చూపిస్తుండటంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. పీఎస్ హెచ్‌ఎంలుగా 509మంది స్కూలు అసిస్టెంట్లను నియమించాల్సి ఉండగా 404 మందిని మాత్రమే నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో 105 పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో మిగులుగా తేలిన 509 మంది స్కూలు అసిస్టెంట్లను ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా నియమించాలని నిర్ణయించింది. మిగులు టీచర్ల సంఖ్య ప్రామాణికంగా సబ్జెక్టు వారీగా స్కూలు అసిస్టెంట్ మిగులు తెలుగు 115 మంది, గణితం 134 మంది, ఇంగ్లీషు 139 మంది, హిందీ 23 మంది, సోషల్ 90 మంది, బయోలాజికల్ సైన్స్ ముగ్గురు, సంస్కృతం ముగ్గురు పీఎస్‌హెచ్‌ఎంలుగా నియమితులు కావాల్సి ఉంది. అయితే స్కూలు అసిస్టెంట్ తెలుగు 87మంది, హిందీ 28 మంది, ఇంగ్లీషు 120మంది, గణితం 133మంది, బయాలాజికల్ సైన్స్ ముగ్గురు, సోషల్ 38మంది కలిపి

మిగతా 6వ పేజీలో


ఎస్సైని బయటకు నెడుతున్న కొండలరావు కుటుంబ సభ్యురాళ్లు

ఎస్‌ఐపై దౌర్జన్యం

- ఫుటేజీ కోసం వెళ్లగా అడ్డుకున్న రౌడీషీటర్ కుటుంబం
- ఆపై తమపైనే దాడి అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- అనుకూలంగా మార్చుకున్న వైసీపీ మీడియా
- రౌడీషీటర్ కొండలరావుపై కేసు నమోదు

కొండపి, జూన్ 3, (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కల్పించడంతోపాటు దౌర్జన్యానికి దిగిన మండలంలోని జాళ్లపాలెం గ్రామానికి చెందిన మారంరెడ్డి కొండలరావు, ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది. మర్రిపూడి ఎస్‌ఐ రమేష్ ఫిర్యాదు మేరకు కొండపి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం కొండలరావుపై ఇప్పటికే రౌడీషీట్ ఉంది. అతనిపై ఎనిమిది కేసులు ఉన్నాయి. విధి నిర్వహణను అడ్డుకోవడంతోపాటు విలువైన సమాచారాన్ని నాశనం

మిగతా 6వ పేజీలో



అరాచకాల అనకొండలరావు

వివరాలు 7వ పేజీలో

- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న రౌడీషీటర్ దురాగతాలు
- వైసీపీ హయాంలో రెచ్చిపోయిన వైనం
- క్షేత్రస్థాయి సిబ్బందికి బెదిరింపులు
- తనిఖీకి వెళ్లిన విద్యుత్ అధికారులపై తిరగబడి వారి వాహనం స్వాధీనం
- అధికారులను బ్లాక్‌మెయిల్
- జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో అనేక కేసులు
- కొండపి స్టేషన్‌లోనూ గతంలో పలు ఫిర్యాదులు

ఎస్‌ఐపై దౌర్జన్యం దారుణం

- రౌడీషీటర్ కుటుంబసభ్యుల చర్య సరికాదు : మంత్రి స్వామి
- వైసీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు

7

ప్రయాసగా నీటి కుంటల నిర్మాణం

అవగాహన లేక నిరాకరిస్తున్న రైతులు

6


మార్కాపురంలోని టిడ్కో గృహాల సముదాయం

ఆరేళ్లుగా ఎదురుచూపులు

- టిడ్కో ఇళ్లకు రూ.25వేలు చెల్లించిన లబ్ధిదారులు
- అటు ప్లాట్లు ఇవ్వరు.. ఇటు డబ్బులు చెల్లించరు
- గతంలో పట్టించుకోని వైసీపీ పాలకులు
- ప్రస్తుత ప్రభుత్వంపైనే పేదల ఆశలు

మార్కాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అప్పట్లో టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి వర్గాల వారికోసం టిడ్కో ఇళ్ల పథకాన్ని చేపట్టింది. సొంతింటి కలను నిజం చేసేందుకు ఎక్కడికక్కడ స్థలాలను సేకరించి అపార్ట్‌మెంట్ తరహాలో గృహాల నిర్మాణాన్ని చేపట్టింది. మూడు రకాల విస్తీర్ణాల్లో అప్పట్లో టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. వాటిల్లో 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు

మిగతా 6వ పేజీలో



ఉపయోగాలెన్నో..

యోగాంధ్రలో భాగంగా త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో మంగళవారం సాధన ఏర్పాటు చేశారు. జేసీ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్, టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుతోపాటు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. దీని వలన ఆరోగ్యానికి ఎన్నో ఉపయోగాలుంటాయని చెప్పారు.

వివరాలు 7వ పేజీలో

ప్రజా విజయానికి ఏడాది

(5వ పేజీ తరువాయి)

వ్యూహం విఫలమైంది. జిల్లాలో ఒక ట్రెండు మినహా మిగిలిన అన్ని స్థానాల్లో అప్పటికే ప్రజలతో మమేకమై పనిచేస్తున్న అభ్యర్థులను టీడీపీ రంగంలోకి దింపింది. ఆ పార్టీ యంత్రాగాన్ని సమష్టిగా ముందుకు నడపడంలో సఫలీకృతమైంది. వైసీపీ అధినేత జగన్ విధానాలతో ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన మాగుంట శ్రీనివాసులరెడ్డిలాంటి వారిని కూడా అక్కున చేర్చుకుంది. ప్రజా సంబంధాలు ఉన్నా నాయకులను దూరం చేసుకోవడంతోపాటు అభ్యర్థుల ఎంపికలో వైసీపీ అనుసరించిన బదిలీల బంతాట కూడా ఆ పార్టీకి శాపంగా మారింది. వీటికి తోడు గత వైసీపీ ప్రభుత్వంలో కొనసాగిన ప్రజా వ్యతిరేక విధానాలు, ఇతర అంశాలపై ప్రజల్లో పెల్లుబికిన అసంతృప్తి టీడీపీ విజయానికి భారీగా దోహదపడ్డాయి.

రాజకీయ ప్రశాంతత

ఎన్నికల ఫలితాల అనంతరం పరిస్థితులను సమీక్షిస్తే రాజకీయంగా జిల్లాలో ప్రశాంత వాతావరణానికి ప్రస్తుత అధికార తెలుగుదేశం పార్టీ నాంది పలికిందని చెప్పవచ్చు. గత ప్రభుత్వంలో అనుసరించిన కక్షసాధింపు చర్యలకు టీడీపీ పాలకులు దాదాపుగా దూరంగా ఉన్నారు. ఉదాహరణకు మొత్తం వ్యాపారవర్గాల వారిని గత ప్రభుత్వం ఇబ్బందుల పాల్జేసిన విషయం తెలిసిందే. టీడీపీలో ఉన్న నాయకుల వ్యాపారాలు మూత వేయించడంతోపాటు కింది స్థాయి వరకు పరిశ్రమ అనుబంధ వ్యాపారులను భారీగా ఇబ్బందులకు గురిచేశారు. వీటితో పాటు కిందిస్థాయిలో ప్రత్యర్థి పక్షంలో ఉన్న నాయకుల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే ప్రయత్నం ముమ్మరంగా జరిగాయి. జిల్లా,నియోజక వర్గ, గ్రామ, స్థాయి వరకు రాజకీయాన్ని దౌర్జన్యంగా శాసించే చర్యలు ముమ్మరంగా జరిగాయి. అక్రమ కేసులు మితిమీరిన విషయం తెలిసిందే. ఇంకో వైపు భూఆక్రమణలు విచ్చలవిడిగా సాగాయి. మార్కాపురం డివిజన్‌లో భూ ఆక్రమణల విషయంలో 14మందికిపైగా ఉద్యోగులు సస్పెండ్ కావడం, ఒంగోలులో జరిగిన భూఆక్రమణపై దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి రావడం అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇలాంటి అన్ని వ్యవహారాలు అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో జరిగిన విషయం జగమెరిగిన సత్యం. అయితే గత ఏడాదిలో ప్రస్తుత టీడీపీ పాలకుల పరిస్థితి పరిశీలిస్తే అలాంటి అరాచకాలకు ఫుల్‌స్టాప్ పడింది. గతంలో సామాన్యుడు ఇసుక కూడా దొరక్క విలవిల్లాడితే ప్రస్తుతం ఆ మాటే లేకుండా పాలన సాగుతుంది.

రాజకీయ సుస్థిరత

జిల్లాలో రాజకీయంగా స్థిరత్వ పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా టీడీపీ జిల్లాలోనే ఆ పార్టీ నాయకత్వాన్ని ఐక్యంగా ముందుకు తీసుకువెళ్లడంలో సఫలీకృతమైంది. అధినాయకుల సూచనలకనుగుణంగా జిల్లా నాయకులు కూడా నడుచుకో గలుగుతున్నారు. ఫలితంగానే పదవుల కేటాయింపుల్లో అలకలు, లుకలుకలు కనిపించలేదు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో ఇద్దరికి మంత్రి పదవుల దక్కాయి, కూటమిలోని మూడు పార్టీల నుంచి ఆగురుగురికి కార్పొరేషన్ పదవులు దక్కాయి. ఇక డైరెక్టర్ పదవులైతే కోకొల్లలు. ఈ పదవులు పంపిణీలో చిన్నపాటి అసంతృప్తులు గానీ, అలకలు గానీ బయటపడలేదంటే కూటమిలో రాజకీయ సుస్థిరత ఎలా బలపడిందో అర్థం చేసుకోసుకోవచ్చు. అలాగే ఫిరాయింపులకు కూడా పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం విశేషం. వైసీపీలోని కొందరు మాజీలు కూటమి వైపు చూసిన ప్రధానంగా టీడీపీ చాలామందికి అవకాశం ఇవ్వలేదు. మాజీ మంత్రి బాలినేనిని మాత్రం జనసేన చేర్చుకోగా, పరిస్థితి అయితే ఇంకా కుదుటపడలేదు. కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో అభివృద్ధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ పాగా వేసింది.

కొన్ని విషయాల్లో...

కాగా అక్రమ కేసులు, దౌర్జన్యాలు, ఆక్రమణలు లాంటి చర్యలకు ఫులిస్టాప్ పెట్టిన కొన్ని అంశాల్లో టీడీపీ ప్రజాప్రతినిధుల్లో ఎక్కువమంది విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్దిష్ట విధానాలతో ముందుకు సాగడం వలన ఇసుక విధానంలో ప్రజా ప్రతినిధుల జోక్యం తగ్గిందని చెప్పవచ్చు. అయితే గ్రావెల్, రేషన్ బియ్యంలాంటి విషయాల్లో కొందరిపై విమర్శలు వచ్చాయి. లిక్కర్ విధానాన్ని మార్చిన ప్రభుత్వం చర్యలకు మద్యం ప్రియులు జేజేలు పలుకుతున్నారు. అయితే వ్యాపారంలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.


ప్రయాసగా మారిన ఫాం పాండ్ల నిర్మాణం

అవగాహన లేక నిరాకరిస్తున్న రైతులు

లక్ష్యసాధనలో చీమకుర్తి మండలం వెనుకబాటు

రాష్ట్ర అధికారి ఆగ్రహం వ్యక్తం చేసినా ముందుకు కదలని అధికారులు


బూదవాడలో అర్థంతరంగా నిలిచిన ఫాం ఫాండ్


పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

చీమకుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉదాత్త ఆశయంతో తలపెట్టిన ఫాం పాండ్ల నిర్మాణపనులు చీమకుర్తి మండలంలో మందకొడిగా సాగుతున్నాయి. రైతుల్లో అవగాహన లేమి, వారికి అవగాహన కల్పించటంలో అధికారుల వైఫల్యం వెరసి లక్ష్యసాధనలో వెనుకబాటుతనం వెంటాడుతోంది. రాష్ట్ర స్థాయి అధికారి ప్రత్యేకంగా మండలాన్ని విజిట్ చేసి పొలాల్లో నీటికుంటల నిర్మాణం నత్తనడకన సాగుతుండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవటం గమనార్హం.

చీమకుర్తి మండలానికి 314 ఫారం పాండ్లను మంజూరయ్యాయి. వాటిల్లో ఇప్పటివరకు కేవలం 36 మాత్రమే పూర్తయ్యాయి. మరో 61 నిర్మాణదశలో ఉన్నాయి. మిగతా వాటి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వాటిని నిర్ణీత కాలంలోపు పూర్తిచేయటం దుర్లభంగా మారింది. నిర్మాణాలలో వెనుకబాటుతనానికి ప్రధాన కారణం రైతులు నిరాసక్తత ప్రదర్శించటమే కనిపిస్తోంది. ఐదెకరాలలోపు పొలం ఉన్న రైతుల పొలాల్లో మాత్రమే కుంటల నిర్మాణం చేపట్టాలని నిబంధన ఉండటం, తమకున్న కొద్దిపాటి పొలంలో కుంటలు నిర్మిస్తే ఎలా అంటూ వారు వెనకడుగు వేస్తున్నారు. రైతుల ఇష్టం లేకుండా నిర్మాణం చేపట్టలేని పరిస్థితి. ఫాం పాండ్స్ నిర్మాణం వలన కలిగే ప్రయోజనాలతో పోలిస్తే పంట సాగు విస్తీర్ణం తగ్గినా నష్టం లేదన్న విషయాన్ని రైతులకు కూలంకుషంగా అవగాహన కల్పించి నిర్మాణాల లక్ష్యసాధన వైపు అధికారులు అడుగులు వేయాల్సి ఉంది.

మండలంలోని బూదవాడ తదితర ప్రాంతాల్లో కొంతమేర తవ్వకాలు చేశాక రాయి తగిలి నిర్ధేశించిన లోతు కూలీలు తవ్వలేకపోతుండలేకపోవటం కూడా సమస్యగా మారింది. దీంతో నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. ఉపాధి కూలీలు కూడా కుంటల తవ్వకాలకు పెద్దగా ఆసక్తి చూపకపోవటం కూడా మరో కారణం. ఇటీవల రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీనాథ్, డ్వామా పీడీ, ఏపీడీ, మండల అధికారులతో కలిసి మండలంలోని మంచికలపాడు, మువ్వావారిపాలెం గ్రామాల్లో ఫారం పాండ్ల నిర్మాణాలను పరిశీలించారు. లక్ష్యసాధనలో బాగా వెనుకబడి ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్ణీత సమయంలో లక్ష్యం విధించిన నిర్మాణాలను పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో కుంటల నిర్మాణాల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి లక్ష్యసాధనవైపు అడుగులు వేగంగా వేయాల్సిన అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పూర్తిస్థాయిలో కార్యాచరణ రూపొందించి, గ్రామాల్లో రైతులకు నచ్చచెప్పి, కుంటల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అవరోధాలను అధిగమిస్తున్నాం

రాఘవ, ఏపీవో, చీమకుర్తి

మండలంలో ఫాం పాండ్ల నిర్మాణంలో నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తిచేయటంలో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. చాలా గ్రామాల్లో రాయి పడి తవ్వకాలు ముందుకుపోక అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి. ఉన్నతాధికారుల మార్గ నిర్ధేశకత్వంలో నిర్మాణాలను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఆరేళ్లుగా ఎదురుచూపులు

(5వ పేజీ తరువాయి)

అడుగుల విస్తీర్ణంలో అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు నిర్మాణం చేయాలని యోచించారు. కానీ ఎక్కువ శాతం 300 చదరపు అడుగుల ప్లాట్లకే ఎక్కువ మంది మొగ్గు చూపారు. లబ్ధిదారుల నుంచి రూ.500 చొప్పున కనీస మొత్తాన్ని సేకరించారు. బ్యాంకర్ల ద్వారా రుణం ఇప్పించి మిగిలిన మొత్తం ప్రభుత్వమే చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అంతేకాక 430 చదరపు అడుగుల విస్తీర్ణం ప్లాట్లకు కూడా మార్కాపురంలో 240 మంది రూ.25వేల చొప్పున మునిసిపల్ కమిషనర్ పేరున చెల్లించారు. అప్పట్లో కేవలం రూ.500 చెల్లించిన వారికి మాత్రమే అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 430 చదరపు అడుగుల ప్లాట్ల కోసం రూ.25వేలు చెల్లించిన వారికి మొండిచేయి చూపారు. 2019లో వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్లపై పగపట్టింది. దీంతో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అంతేకాక రూ.25వేల చొప్పున మునిసిపాలిటీకి చెల్లించిన నగదును కూడా స్థానిక సంస్థలే వాడేసుకున్నాయి. దీంతో ఆరేళ్లుగా ప్లాట్ల కేటాయింపు జరగక, ఇటు డబ్బులు తిరిగి ఇవ్వక 240 మంది ఎదురుచూపులు చూస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంపై వారంతా ఆశలు పెట్టుకున్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అవస్థలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లో టిడ్కో గృహ నిర్మాణ పథకం అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలు చేసింది. చాలాచోట్ల నిర్మాణాలను దాదాపు పూర్తి చేసింది. 2018లో అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ మార్కాపురంలో పనులు ప్రారంభించారు. సుమారు 65 శాతం మేర పూర్తయ్యాయి. కానీ వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో పథకాన్ని నిర్వీర్యం చేసింది. కనీస పనులు కూడా ముందుకు సాగలేదు. దీంతో సొంతింటి కల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు ఏళ్లపాటు ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగం పుంజుకున్నాయి. మార్కాపురంలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ప్లాట్లకు సంబంధించి 19 బ్లాకుల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. మొత్తం 912 మంది లబ్ధిదారులకు పాట్లను కేటాయించనున్నారు. వారిలో ఇప్పటి వరకు 295 మంది రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసుకున్నారు. ఇంకా 617 మందికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంది. కొద్ది నెలల్లో అవి కూడా పూర్తికానున్నట్లు అధికార వర్గాలు చెప్తున్నాయి.

రూ.25 వేలు చెల్లించిన వారికి మొండిచేయి

2018లో అందరితోపాటు టిడ్కో సంస్థ చెప్పిన విధంగా 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాట్లు కావాల్సిన వాళ్లు 240 మంది డీడీలు తీశారు. స్థానిక మునిసిపాలిటీకి చెందిన కమిషనర్ పేరునే 240 మంది సుమారు రూ.60 లక్షల మేర డీడీల రూపంలో చెల్లించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలోనే స్థలాభావం వలన 430 చదరపు అడుగుల ప్లాట్లు నిర్మించలేమని టిడ్కో సంస్థ తేల్చిచెప్పింది. ప్లాట్ల కేటాయింపు ఎలాగూ చేయలేదు కనీసం చెల్లించిన నగదునైనా తిరిగి ఇవ్వాలని గత ఆరు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. గత వైసీపీ పాలకులు అసలు వారిని పట్టించుకున్న పాపానపోలేదు. ఈ ప్రభుత్వమైనా నగదును చెల్లించి న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. ప్లాట్ల కేటాయింపును ఎలాగూ చేయలేదు కాబట్టి టిడ్కో సంస్థ నుంచి డబ్బులు రప్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ఇప్పటికే పలుమార్లు టిడ్కో ఉన్నతాధికారులకు తెలిపాం

డీవీఎస్ నారాయణరావు, మునిసిపల్ కమిషనర్, మార్కాపురం

మార్కాపురంలో 2018లో 240 మంది రూ.25 వేలచొప్పున 430 చదరపు అడుగుల విస్తీర్ణం ప్లాట్ల కోసం డీడీలు తీశారు. అప్పట్లో వారికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక బ్లాకులు కేటాయించలేదు. కేవలం 300 చదరపు అడుగుల ప్లాట్ల నిర్మాణమే జరిగింది. ప్రస్తుతం 19 బ్లాకుల్లో 912 ప్లాట్లు పూర్తయ్యాయి. రూ.25 వేలు చెల్లించిన వారికి తిరిగి డబ్బులు చెల్లించాల్సి ఉందని ఇప్పటికే పలుమార్లు టిడ్కో ఉన్నతాధికారులకు తెలియజేశాం. వాళ్లు తీసుకునే నిర్ణయాన్నిబట్టి వారికి నగదు చెల్లించేందుకు అవకాశం ఉంటుంది.

పీఎస్ హెచ్‌ఎంల బదిలీల్లో గందరగోళం

(5వ పేజీ తరువాయి)

మొత్తం 404 మంది మాత్రమే నియమితులయ్యారు. బదిలీల సాఫ్ట్‌వేర్‌లో తలెత్తుతున్న లోపాలతో టీచర్లకు తిప్పలు తప్పడం లేదు. పీఎస్ హెచ్‌ఎం పోస్టు భర్తీ అయినా అది ఖాళీగానే కనిపిస్తుండటంతో టీచర్లు అయోమయానికి గురవుతున్నారు. ఉదాహరణకు కందుకూరులోని ఇస్కాల వారి వీధిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై ఒక ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం కోరుకొని చేరిపోయారు. అయినప్పటికీ బదిలీల జాబితాలో ఆ స్థానం ఖాళీగా కనిపించడంతో గుడ్లూరు మండలానికి చెందిన ఒక గణితం స్కూలు అసిస్టెంట్ కోరుకోవడంతో దానిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తీరా విచారిస్తే ఆ స్థానం ఖాళీ లేదని తేలింది. దీంతో ఆ టీచర్ డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఇలాగే మరికొందరి స్థానాలు కూడా భర్తీ అయినవి ఖాళీలుగా రిపీట్ కావడంతో ఐటీసెల్ సిబ్బంది గుర్తించి వాటిని తొలగించారు.

తప్పనిసరి బదిలీ కాకపోయినా స్థానం ఖాళీ

తప్పనిసరి బదిలీలో లేకపోయినా తన స్థానాన్ని ఖాళీగా చూపిస్తుండటంతో ఒక టీచర్ ఆందోళన చెందుతూ ఒంగోలుకు పరుగులు తీశారు. కురిచేడు మండలం దేకనకొండ హైస్కూల్ తెలుగు స్కూలు అసిస్టెంట్ స్థానం ఖాళీగా చూపిస్తుండటంతో ఆ పోస్టులో పనిచేస్తున్న టీచర్ ఆందోళన చెందుతున్నారు. ఆ పాఠశాలలో ఎస్‌ఏ తెలుగు ఒక పోస్టు మాత్రమే ఉంది. ఆ టీచర్ బదిలీకి దరఖాస్తు చేయలేదు. మిగులుగా గుర్తించినట్లు చెప్పలేదు. అయితే బదిలీకి దరఖాస్తు చేసుకోలేదు. అయినా ఆస్థానం ఖాళీగా చూపించడంతో ఆమె ఆందోళన చెందుతున్నారు. బదిలీ సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలు వస్తుండటంతో టీచర్లు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పుడే చేరొద్దు : కమిషనర్

ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమితులైన స్కూలు అసిస్టెంట్లు ప్రస్తుతం వెంటనే విధుల్లో చేరవద్దని కమిషనర్ ఆదేశించారు. స్కూలు అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎం/ఎస్‌ఏలకు భవిష్యత్‌లో బదిలీల సీనియారిటీ వివాదం రాకుండా ఈ ఇద్దరికీ ఒకే జాయినింగ్ తేదీ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. తదుపరి తాము ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే విధుల్లో చేరాలని కమిషనర్ ఆదేశించారు.

లోగ్రేడ్.. నోబిడ్!

(5వ పేజీ తరువాయి)

ఇప్పటివరకూ ఉన్న కిలో రూ.200 కనిష్ఠ ధరను రూ.190కి తగ్గించినా నోబిడ్‌లు భారీగానే ఉన్నాయి. మంగళవారం నాటి మార్కెట్‌ను పరిశీలిస్తే మేలు రకం బేళ్లను పోటీపడి కొనుగోలు చేస్తున్న బయ్యర్లు ధరలు మాత్రం కిలో రూ.280 వద్ద నియంత్రించి ఇక పెరగకుండా కూటమి కట్టారు. మీడియం గ్రేడ్‌ల ధరలను తగ్గించివేశారు.

మూడొంతులు తిరస్కరణే

నెలక్రితం వరకు కిలోకు రూ.250 ఇచ్చిన మీడియం గ్రేడ్‌లను ప్రస్తుతం కిలో రూ.200 నుంచి రూ.220లోపు మాత్రమే వ్యాపారులు కొంటున్నారు. వాటిలోనూ పలు బేళ్లు నోబిడ్ అవుతున్నాయి. ఇక లోగ్రేడ్ బేళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ రకం బేళ్లలో మూడొంతులు తిరస్కరణ జరుగుతున్నాయి. లోగ్రేడ్‌లో కాస్తంత నాణ్యమైనవిగా భావించే బ్రౌన్ రకం పొగాకు ధర గత ఏడాదిలో రూ.300పైగా పలుకగా ఈ ఏడాది రూ.200 కూడా లభించడం లేదు. అసలు కొనేవారు లేక నోబిడ్‌లు అవుతున్నాయి. కీలకమైన ఎక్స్‌పోర్టు కంపెనీలు కొనుగోళ్లను భారీగా తగ్గించి వేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

పొదిలి కేంద్రంలో అధికం

మంగళవారం నాటి మార్కెట్‌ను చూస్తే దక్షిణాదిలోని 11వేలం కేంద్రాలలో దాదాపు 21.50శాతం బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. రెండు రీజియన్లలోని 11 వేలం కేంద్రాల్లో 7,611 బేళ్లు అమ్మకానికి రాగా 5,446 బేళ్లు మాత్రమే కొనుగోలు జరిగింది. దాదాపు 28శాతానికిపైగా తిరస్కరణలు జరగ్గా అందులో 21.50శాతం బోర్డు అధికారులు ప్రకటించిన ధరలను వ్యాపారులు ఇవ్వక నోబిడ్‌లు పెట్టారు. కాగా నోబిడ్ బేళ్లు కొన్ని కేంద్రాలలో ఇంకా ఎక్కువగా ఉంటున్నాయి. పొదిలిలో 34.31శాతం నోబిడ్‌లు ఉండగా కనిగిరిలో 34.75, వెల్లంపల్లిలో 33.76శాతం, ఒంగోలు-1లో 26.55శాతం ఉన్నాయి. వ్యాపారుల తీరుపై టంగుటూరు కేంద్రంలో రైతులు వేలం ఆపి నిరసన తెలిపారు. సీపీఐ (ఎంఎల్) నాయకులు డీవీఎన్ స్వామి, పరిటాల కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు సింగయ్య సంఘీభావం తెలిపారు. కొంతసేపు అనంతరం తిరిగి వేలం నిర్వహించారు.

భగత్‌సింగ్ కాలనీలో గృహాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

మార్కాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ కాలనీలో అభ్యంతరంలేని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారి గృహాలను సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం పరిశీలించారు. ముందుగా గృహాల పరిస్థితిని గమనించారు. ఆయా గృహాల్లో వాస్తవంగా దరఖాస్తు చేసుకున్న వాళ్లే ఉంటున్నారా, లేదా విచారించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ అభ్యంతరంలేని ప్రభుత్వ భూమిని ఆక్రమించి గృహ నిర్మాణం చేసుకున్న వాళ్లు అర్హులైవుంటే తప్పక ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఇప్పటికే భగత్‌సింగ్ కాలనీకి చెందిన 145 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాస్తవ పరిస్థితిని తనిఖీ చేసి వారికి పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ కె.చిరంజీవి, సర్వేయర్ సంజీవయ్య, టీడీపీ నాయకులు దారివేముల శరణ్‌కుమార్, చల్లగాలి విద్యాసాగర్ ఉన్నారు.

వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి

మార్కాపురం డివిజన్ కేంద్రంలో బీసీ బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ సుమారు 150 మందికిపైగా బీసీ బాలికలు ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వ హాస్టల్‌లేని కారణంగా ఇంటికి పరిమితమవుతున్నారని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే వసతి గృహాన్ని ఏర్పాటుచేసి బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పేద బీసీ బాలికలకు హాస్టల్ ఏర్పాటు చేసేలా ప్రయత్నిస్తానన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కార్యవర్గ సభ్యులు రంగస్వామి గౌడ్, అబ్రహం రాజ్‌కుమార్, శంకర్‌గౌడ్, వెంకటేష్, నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఎస్ఐపై దౌర్జన్యం

(5వ పేజీ తరువాయి)

చేస్తానని బెదిరించడంపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఘటన జరిగిందలా... గతనెల 26వతేదీ పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెం, 28న కొండపి మండలంలోని పెట్లూరులో, అదేరోజు జరుగుమల్లి మండలం ఎస్ఎస్.కండ్రిగ గ్రామాల్లోని పలు దేవాలయాల్లో చోరీలు జరిగాయి. దొంగలను పట్టుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మర్రిపూడి ఎస్ఐ రమేష్ నేర పరిశోధన ప్రారంభించారు. అందులో భాగంగా ఆయా గ్రామాల నుంచి వెళ్లే రోడ్లలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఎస్ఎస్.కండ్రిగ, పెట్లూరు గ్రామాలకు మధ్యలో ఉండే జాళ్లపాలెంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా జాళ్లపాలెంలోని బ్రహ్మంగారి మఠం సమీపంలో ప్రధాన కూడలిలో కొండలరావు గృహం, అందులోనే వాటర్‌ప్లాంట్, చిల్లరకొట్టు ఉంది. దుకాణం ముందుభాగంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. నేర పరిశోధనలో భాగంగా గతనెల 28వతేదీ ఉదయం ఎస్ఐ రమేష్ దుకాణంలో ఉన్న కొండలరావు చెల్లెలు బండి చంద్రమ్మను సీసీ ఫుటేజ్ చూపించాలని, తాము పోలీసులమని, నేరపరిశోధనలో సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా చంద్రమ్మ కొండలరావుకు తెలిపింది. ఫోన్‌లోనే కొండలరావు పోలీసులకు తాను సహకరించనని తేల్చిచెప్పినట్లు సమాచారం. సీసీ కెమెరా ఫుటేజీ ఇవ్వబోనని, సమాచారం ఉన్నా డిలీట్ చేస్తానని, డీవీఆర్‌ని, మానిటర్‌ని తగులబెడతానని తెలిపాడు. ఎస్ఐ దుకాణంలోకి వెళ్లి ఫుటేజ్ చూస్తానని ప్రవేశించబోగా, చంద్రమ్మ బయటకు నెట్టేసింది. ఎస్ఐ, సిబ్బంది తమకు అడ్డుగా వస్తున్న చంద్రమ్మ, ఇతర సభ్యులను పక్కకు నెట్టారు. ఈ ఘటన కూడా సీసీ కెమెరాలలో రికార్డయింది. కాగా దాన్ని పోలీసులు తమ కుటుంబసభ్యులపై దౌర్జన్యం చేశారని సామాజిక మాధ్యమాల్లో కొండలరావు ప్రచారం చేశారు. వైసీపీ కార్యకర్తలపై పోలీసుల జులుం అంటూ కొన్ని యూట్యూబ్ చానళ్లు, వైసీపీ అనుకూల మీడియా, సోషల్ మీడియాలో కొండలరావు ఓ పథకం ప్రకారం తప్పుడు ప్రచారం చేశారు. ఈ ఘటనపై ఎస్పీ సీరియస్ అయ్యారు. పోలీసుల విధి నిర్వహణను అడ్డుకున్న కొండలరావు, కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు.

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు : జేసీ

అవీఇవీ


రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో వృద్ధులు, దివ్యాంగులకు రేషన్‌షాపుల ద్వారా ఉచితంగా బియ్యం, చెక్కరను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ డోర్ డెలివరీ చేశారు. మంగళవారం రాత్రి ఒంగోలులోని 32 రేషన్‌షాపు పరిధిలోని వృద్ధులు, దివ్యాంగులకు రేషన్‌షాపు ద్వారా వారి ఇంటికి చేర్చారు. ప్రభుత్వం ఈనెల నుంచి రేషన్‌షాపుల ద్వారా రేషన్‌సరుకుల పంపిణీని పునః ప్రారంభించింది. ఈనేపథ్యంలో 65 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్లు వారి నివాసాలకే వెళ్ళి సరుకులు ఇవ్వాలని ఆదేశించడంతో తదనుగుణంగా జేసీ గోపాలకృష్ణ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

12న 'బ్రిలియంట్' ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎ1 క న్వెన్షన్ హాలులో ఈనెల 12వ తేదీన జరగనున్న బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్-25 పోస్టర్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఈ పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ వివరాలను ఆ సంస్థ అధినేత డాక్టర్ షేక్ న్యామత్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత 21 ఏళ్ళుగా బ్రిలియంట్ సంస్థ జిల్లాలోని విద్యార్థుల కోసం ప్రతిఏటా ఉచితంగా మెగాఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ఎంతో మంది విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ కాలేజీల్లో చేరే విద్యార్థులకు వెబ్ కౌన్సెలింగ్‌తో పాటు కెరీర్ గైడెన్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్‌కు ముఖ్యఅతిథులుగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, రిటైర్డ్ డీజీపీ కేఆర్‌ఎం.కిషోర్‌కుమార్, యూనవర్శిటీల వైస్ చాన్స్‌లర్లు, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు హాజరవుతారన్నారు. ఆరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు జరుగుతుందని, జిల్లాలోని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 8019479999 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బ్రిలియంట్ సంస్థ ఎండీ డాక్టర్ తోహరా పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ ర్యాంకర్‌కు ఎన్టీఆర్ ట్రస్ట్ సాయం


చాతుర్యకు ఉత్తర్వులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్

కంభం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : 2025 మార్చి ఇంటర్ ఫలితాల్లో హెచ్‌ఈసీ గ్రూపులో 980/1000 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కంభం ప్రభుత్వ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్య రాష్ట్ర షైనింగ్ స్టార్ అవార్డు పొందిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 15న జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో మంత్రి నారా లోకేష్ తమ్మినేని చాతుర్య ప్రతిభను, కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమె అభ్యర్థన మేరకు చాతుర్య లక్ష్యాన్ని అధిగమించేందుకు వీలుగా సివిల్ సర్వీస్‌తో కూడిన డిగ్రీ విద్యను ఉచితంగా అభ్యసించేందుకు ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ గండిపేట ఎన్టీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో చదువుకునేందుకు అవకాశం కలిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్‌కు సమాచారం అందింది. మానవ వనరుల శాఖ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఉత్తర్వులను చాతుర్యకు మంగళవారం జిల్లా ఆర్ఐవో సైమన్‌విక్టర్ అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు తిరుమలయ్య, శిరీష కుమారి, శివలక్ష్మమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

అతి వేగం, రాంగ్‌రూటే ప్రమాదానికి కారణం

జిల్లా రోడ్డు భద్రతా కమిటీ పరిశీలన


ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న అధికారులు

కొమరోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అతివేగం, రాంగ్‌రూటే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని జిల్లా స్థాయి రోడ్డు సేఫ్టీ అధికారులు గుర్తించారు. మండలంలోని తాటిచర్ల మోటులో గత నెల 23న జరిగిన కారు - లారీ ప్రమాదం జరిగిన ఘటన ప్రదేశాన్ని మంగళవారం జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ అధికారులు పరిశీలించారు. మండలంలోని తాటిచర్ల మోటులో గత నెల 23న జరిగిన కారు-లారీ ప్రమాదంలో బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. దీనిని సుమోటోగా తీసుకుని ఘటనపై విచారణ కమిటీ వేసి ఈనెల 30లోపు నివేదిక పంపాలని సుప్రీంకోర్టు రోడ్డు సేఫ్టీ విభాగం సెక్రటరీ సంజయ్ మిట్టల్‌ను ఆదేశించింది. ఈమేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి సుశీల, ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ పర్వతేశం, మార్కాపురం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, గిద్దలూరు సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు, ఆర్ అండ్‌బీ ఏఈ సుధాకర్ అధికారులు కలసి విచారణ చేపట్టారు. ప్రమాద తీరుతెన్నులను గుర్తించారు. అతివేగం, రాంగ్‌రూటులో ప్రయాణించడం, నిద్రమత్తులో ఉండడం వంటివి ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు.

నాన్‌క్యాడర్ ఎస్పీగా అశోక్‌బాబు

ఒంగోలు క్రైం, జూన్3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగంలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఎంఎస్ఎస్.అశోక్‌బాబు నాన్‌క్యాడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు మంగళవారం ఒంగోలులో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌బాబును ఎస్పీ అభినందించారు. షోల్డర్ ప్యాడ్‌కు స్టార్ చిహ్నాలను అలంకరించారు. పోలీస్‌శాఖలో అశోక్‌బాబు సేవలను ఆయన కొనియాడారు.

యోగాంధ్రపై అవగాహన

ఎరగొండపాలెం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని మురారిపల్లి గ్రామ వార్డు సచివాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలకు యోగాంధ్రపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ యోగా చేయడం వలన ఆరోగ్యంతో పాటు మనసు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు భాష్యం లక్ష్మీరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బి.బ్రహ్మారెడ్డి, చిన్న రాజయ్యతో పాటు సచివాలయ సిబ్బంది విజయలక్ష్మి, రాజశేఖర్, రవి ప్రజలు పాల్గొన్నారు.

అరాచకాల అనకొండలరావు

ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న రౌడీషీటర్ దురాగతాలు

- వైసీపీ హయాంలో రెచ్చిపోయిన వైనం
- అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి వేధింపులు
- జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు
- కొండపి స్టేషన్‌లోనూ గతంలో పలు ఫిర్యాదులు



విద్యుత్‌శాఖ సిబ్బంది తనిఖీకి ఇంట్లోకి రాకుండా అడ్డుకుంటున్న కొండలరావు కుటుంబ సభ్యులు (ఫైల్)

కొండపి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాళ్లపాలెం గ్రామానికి చెందిన మారంరెడ్డి కొండలరావు నేర చరిత్ర వెలుగులోకి వస్తోంది. గత వైసీపీ పాలనలో రాజకీయ అండతో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులను ఆయన బెదిరించినట్లు బహిర్గతమవుతోంది. గ్రామంలో వాటర్‌ప్లాంట్, కిరాణా దుకాణం, మీసేవ సెంటర్‌ను నడిపే కొండలరావు అధికారులను బ్లాక్‌మెయిల్ చేసిన అనేక ఉదంతాలను స్థానికులు ఉదహరిస్తున్నారు. గ్రామానికి చెందిన వీఆర్వోను గతంలో బెదిరించి ఇబ్బందులకు గురి చేశాడని చెప్తున్నారు. కొండలరావు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండగా తనిఖీకి వెళ్లిన విజిలెన్స్ అధికారులు.. కొండపి, జరుగుమల్లి మండలాలకు చెందిన విద్యుత్‌శాఖ ఏఈలు, సిబ్బందిపై తిరగబడ్డాడు. వారి వాహనాన్ని రెండు రోజులు తన ఇంటిలోనే ఉంచుకున్నాడు. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బంది అప్పట్లో జరుగుమల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అప్పటి ఎస్సై కేసు నమోదు చేయలేదు. దీంతో చేసేది లేక ఏఈగా పనిచేస్తున్న హర్షీద్ కేసును ఉపసంహరించుకున్నారు. తమ విద్యుత్ సిబ్బంది వాహనాన్ని బతిమిలాడుకుని తెచ్చుకోవాల్సి వచ్చిందని ఏఈ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కొండలరావు గ్రామస్థులతో విద్యుత్ బిల్లులు కట్టకుండా చేస్తుంటాడని ప్రచారం ఉంది. మీసేవ ద్వారా కరెంటు బిల్లు చెల్లించా లని డబ్బులు ఇచ్చినా కట్టకుండా స్వాహా చేశాడని గ్రామస్థులు తెలి పారు. తన పేరున, తన అక్క, బావల పేరున విద్యుత్ మీటర్లు తీసుకుని బిల్లులు చెల్లించకుండా... తాను సోలార్ విద్యుత్ వాడుకుంటున్నానని, అక్రమంగా విద్యుత్ బిల్లులు అధికంగా వేస్తున్నారని తమతో గొడవకు దిగేవాడని విద్యుత్ సిబ్బంది తెలిపారు. మీటర్ల రీడింగ్ చూస్తామని వెళ్లినా అడ్డుకొని దూషించేవాడని తెలిపారు. తాజాగా నేర పరిశోధనలో భాగంగా పోలీసులకు కూడా సీసీ ఫుటేజీ ఇవ్వకుండా తన కుటుంబానికి చెందిన మహిళలతో మఫ్రిహూడి ఎస్సైని, సిబ్బందిని అటకాయించాడు. తిరిగి ఎస్సైపైనే మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని గ్రామస్థులు అంటున్నారు. రౌడీషీటర్ కొండలరావు గ్రామంలోకి వచ్చే అన్నిశాఖల అధికారులను బ్లాక్‌మెయిలింగ్ చేసి దందాలు సాగించాడని ఇప్పుడు పలువురు బాధితులు వాపోతున్నారు.

విద్యుత్ అధికారులకు అపరాధ రుసుం, బిల్లులు చెల్లించని వైనం

కొండలరావు అనేక రకాలుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని వివిధ కోణాల్లో నిర్ధారించుకున్న ఆశాఖ అధికారులు ఆయనకు రూ.50వేలు అపరాధ రుసుం విధించారు. కానీ ఇప్పటి వరకూ ఆ మొత్తాన్ని చెల్లించలేదని ఆశాఖ సిబ్బంది చెప్తున్నారు. విద్యుత్ వినియోగానికి సంబంధించి నెలవారీ బిల్లులు రూ.20వేల వరకూ బకాయిలు ఉన్నాయి. దీంతో విద్యుత్ అధికారులు కనెక్షన్‌ను తొలగించారు. కొండలరావు తాను, తన అక్క, బావ పేర్లతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తు చేసుకోగా విద్యుత్ అధికారులు నిరాకరించారు. బకాయిలు చెల్లించిన తర్వాతనే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. జరుగుమల్లి పోలీసుస్టేషన్‌లో కొండలరావుపై ఎనిమిది కేసులు ఉన్నాయి. ఆయనపై రౌడీషీటర్-14గా నమోదై ఉంది. గతంలో ఆర్టీసీ కండక్టర్ కొండలరావు పనిచేశాడు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న కారణంగా ఆయన్ను 2014లో సస్పెండ్ చేశారు.

ఎస్‌ఐపై దౌర్జన్యం దారుణం

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

కొండపి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉన్న దళిత ఎస్‌ఐపై రౌడీషీటర్ కుటుంబసభ్యులు దౌర్జన్యం చేయడం దారుణమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలను వైసీపీ, ఆ పార్టీ మీడియా వారికి అనుకూలంగా ప్రచారం చేసుకోవడం హేయమన్నారు. మంగళవారం ఆయన తాడేపల్లి నుంచి మాట్లాడారు. రౌడీషీటర్‌కు, అతని కుటుంబసభ్యులకు వత్తాసు పలుకుతూ అసత్య ప్రచారాలు చేయడం వైసీపీ నాయకులకే చెల్లిందని మంత్రి విమర్శించారు. దళిత ఎస్‌ఐకు మద్దతుగా నిలవాల్సిన వైసీపీ అనుకూల మీడియా అందుకు భిన్నంగా విషం చిమ్మడం సిగ్గుచేటన్నారు. నిజాయితీగా పనిచేస్తున్న పోలీసులపై వైసీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

అతని ఇల్లే ఒక డెన్

జాళ్లపాలెం-పీరాపురం మధ్య కొండలరావు మూడంతస్తుల గృహాన్ని నిర్మించుకున్నాడని, అందులో ఏమి ఉంటాయో తెలియదని గ్రామస్థులు చెప్తున్నారు. ఇంటిలోకి గ్రామస్థులెవ్వరినీ రానివ్వకపోవడంపై కూడా వారు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. జాళ్లపాలెంలోని బ్రహ్మంగారి మఠం ఎదురు ఉన్న తన దుకాణం ముందు సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకుని ఆదారిన వెళ్లే వాహనదారులను బ్లాక్‌మెయిలింగ్ చేస్తుంటాడని గ్రామస్థులు తెలిపారు.

అధికారులపైనే ఫిర్యాదులు

మండల, గ్రామస్థాయి అధికారులు తనకు అనుకూలంగా పనులు చేయాలని కొండలరావు బ్లాక్‌మెయిల్ చేస్తుంటాడని గ్రామస్థులు తెలిపారు. తాను చెప్పినట్లు చేయని వారిపై ఉన్నతాధికారులకు గ్రీవెన్స్‌లోనూ, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తుంటాడని ప్రజలు చెప్పారు. గత వైసీపీ హయాంలో కొండలరావు టార్చర్‌ను తట్టుకోలేక పలువురు బదిలీ చేయించుకుని వెళ్లిపోయినట్లు సమాచారం. కొండపి మండలంలోని జాళ్లపాలెం, జరుగుమల్లి మండలంలోని పీరాపురం గ్రామాల్లో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందిని కొండలరావు గత వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులకు గురిచేశారని గ్రామస్థులు చెప్తున్నారు. ఇప్పటికైనా ఆయనపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.

ఎస్సై విధులను ఆటంకపరిచినందుకు కేసు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ
- బాధితుడు మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



ఎస్సైని అటకాయిస్తున్న మహిళ వీడియోను చూపుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దేవాలయంలో జరిగిన చోరీకి సంబంధించి సీసీ ఫుటేజీ సేకరణలో భాగంగా వెళ్లిన ఎస్సై పట్ల దురుసుగా వ్యవహరించి, విధులను ఆటంకపరిచినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో పొన్నలూరు, కొండపి, జరుగుమల్లి మండలాల్లో వరుసగా దేవాలయాల్లో దొంగతనాలు జరిగాయి. వీటిపై ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టాయి. అందులో భాగంగా గతనెల 28న కొండపి మండలం జాళ్లపాలెంలో మారంరెడ్డి కొండలరావుకు చెందిన దుకాణంలో మఫ్రిహూడి ఎస్సై టి.రమేష్ బాబు తన సిబ్బందితో సీసీ ఫుటేజీ కోసం వెళ్లారు. అక్కడ మహిళలు అడ్డుకున్నారు. 'ఫుటేజీని మా అన్న ఇవ్వద్దు అన్నాడు, అవసరమైతే ధ్వంసం చేస్తాను కాని పోలీసులకు ఫుటేజీ ఇవ్వను' అంటూ కొండలరావు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో ప్రజా ప్రయోజనార్థం విలువైన సమాచారం ధ్వంసం చేస్తారని ఎస్ఐ దుకాణంలోకి వెళ్లి మానిటర్ చెక్ చేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో కొండలరావు చెల్లెలు చంద్రమ్మ, వదిన కుమార్తె ఆదిలక్ష్మి అడ్డుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి విధులను ఆటంకపరచడం, పోలీసు ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వారి చర్యలు ఉండటంతో కేసు నమోదు చేశారు. మారంరెడ్డి కొండలరావు ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ సస్పెన్షన్ అయ్యాడు. అతనిపై 8 కేసులు ఉన్నాయి. జరుగుమల్లి పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉంది.

● మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

గతనెల 28న జాళ్లపాలెంలో జరిగిన ఘటనపై మారంరెడ్డి కొండలరావు మంగళవారం జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సై రమేష్‌బాబు తన సిబ్బందితో ఇంట్లోకి ప్రవేశించి తన రక్తసంబంధీకులైన మహిళలు, పిల్లలపై దాడి చేసి అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీటీవీ పరికరాలను దౌర్జన్యంగా తీసుకెళ్లాడని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఎస్ఎఫ్ జవాన్ మృతి

- ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని సెలవుపై ఇంటికి
- స్నేహితులను కలిసేందుకు వెళ్తుండగా ప్రమాదం
- స్వగ్రామమైన పాకలకు చేరిన భౌతికకాయం
- గ్రామస్థుల అశ్రునివాళి



ప్రదీప్‌కుమార్ (ఫైల్)

సింగరాయకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న బీఎస్ఎఫ్ జవాను పాండూరి ప్రదీప్‌కుమార్ (28) మంగళవారం మృతిచెందారు. పాకలకు చెందిన ప్రదీప్‌కుమార్ ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. అనంతరం సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. ఈనెల 21న ఒంగోలులో ఉన్న స్నేహితులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. అక్కడి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలో ఆయన బైక్ అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన ప్రదీప్‌కుమార్‌ను ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయం రాత్రికి పాకలకు చేరింది. సింగరాయకొండలో ఉన్న పాకలగేటు వద్ద నుంచి భారీ సంఖ్యలో యువకులు, గ్రామస్థులు ర్యాలీగా మృతదేహాన్ని గ్రామానికి తీసుకువెళ్లారు. దేశ సరిహద్దులో సేవలు అందించిన చెట్టంత కుమారుడు మృతిచెందడంతో ప్రదీప్‌కుమార్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

హరిత శోభిత జిల్లా లక్ష్యంగా మొక్కలు నాటాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : హరిత శోభిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా జిల్లాలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో వివిధ వర్గాలను ఇందులో భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈనెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనం-మనం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు జిల్లాలో ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో పలుశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అంతకు ముందు పీఎఫ్‌వో రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 5వతేదీన 4.10 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టిందన్నారు. జూన్ నుంచి నవంబరు వరకు ఆరు నెలల వ్యవధిలో జిల్లాలో 35.76 లక్షలకుపైగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 36శాతం అటవీ విస్తీర్ణం ఉందని, దీనిని 50 శాతానికి పెంచేలా ఈ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ గ్లోబల్లీ అనే ఇతివృత్తంతో ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వనం-మనం కార్యక్రమ వాస్తవ స్ఫూర్తితో వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలు, కాలేజీలు, విద్యా సంస్థల్లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటేలా చూడాలన్నారు. సంబంధిత శాఖలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను నాటేలా సరఫరా చేయాలని ఉద్యానవన, అటవీ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఉత్సాహంగా ఎస్పీ ట్రోఫీ క్రికెట్ పోటీలు

- ప్రారంభించిన ఎస్పీ దామోదర్
- విజేతగా హెడ్‌క్వార్టర్ టీమ్
- ఎస్పీని భుజాలపై ఊరేగించిన సిబ్బంది



విజేత జట్టుతో ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం మానసిక వత్తిడితో విధులు నిర్వర్తించే పోలీసుల ఆటవిడుపు కోసం క్రికెట్ పోటీలను నిర్వహించారు. మంగళవారం ఒంగోలులోని పోలీస్ పరేడ్ మైదానంలో ఎస్పీ ట్రోఫీ క్రికెట్ పోటీలను ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తం ఏడు టీములు పోటీలలో పాల్గొన్నాయి. 10 ఓవర్ల మ్యాచ్ ఆడారు. నాలుగు సబ్‌డివిజన్ల నుంచి ఒక్కో టీమ్, హెడ్‌క్వార్టర్ టీమ్, ఏఆర్ టీమ్, స్వాట్ టీమ్‌లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో హెడ్‌క్వార్టర్ టీమ్, సబ్ డివిజన్ పోలీస్ టీమ్‌లు తలబడ్డాయి. హెడ్ క్వార్టర్ టీమ్‌కు ఎస్పీ దామోదర్ సారథ్యం వహించారు. ఫైనల్స్‌కు జిల్లా సబ్‌డివిజన్ పోలీస్ జట్టు, హెడ్ క్వార్టర్ జట్టు చేరుకోగా అనంతరం బెస్ట్ ఆఫ్ త్రీ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలిమ్యాచ్‌లో నిర్ణీత 10 ఓవర్లలో జిల్లా సబ్‌డివిజన్ పోలీస్ జట్టు 3 వికెట్లను కోల్పోయి 94 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హెడ్ క్వార్టర్ జట్టు 9 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. మరో మ్యాచ్‌లో సబ్‌డివిజన్ పోలీస్ జట్టు 9.5 ఓవర్లలో 53పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం హెడ్‌క్వార్టర్ జట్టు 54 పరుగులు 6.5 ఓవర్లలో ఛేదించారు. దీంతో విజేతగా హెడ్‌క్వార్టర్ టీమ్ నిలిచింది. అనంతరం జట్టు సభ్యులు మైదానంలో కేరింతలు కొడుతూ ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను భుజాలపై ఎక్కించుకొని కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు లక్ష్మీనారాయణ, సాయిఈశ్వర్‌యశ్వంత్, నాగరాజు, శ్రీనివాసరావు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేస్తే చర్యలు

- జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసేవారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. స్పౌజ్ పాయింట్లు వినియోగించుకొనేందుకు బదిలీల్లో తప్పనిసరిగా తన జీవిత భాగస్వామి పనిచేస్తున్న స్థానానికి దగ్గరగా బదిలీల ఆప్షన్లు పెట్టుకోవాలి. స్పౌజ్ స్టేట్, జోనల్ క్యాడర్ పోస్టుల్లో పనిచేస్తున్నవారికి ఆప్షన్లు పెట్టుకోవడంలో మినహాయింపు ఇచ్చారు. స్పౌజ్ పనిచేస్తున్న వారికి దగ్గరగా ఆప్షన్లు పెట్టారా లేదా భిన్నంగా ఆప్షన్లు పెట్టరా అన్న విషయం పరిశీలిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు పెట్టిన టీచర్లపై శాఖపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

మెగా డీఎస్సీకి 8 పరీక్షా కేంద్రాలు

ఒంగోలు విద్య, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలకు ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు మెగా డీఎస్సీకి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. పోస్టుల ప్రకటన, భర్తీ ప్రక్రియ మొత్తం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతుండగా పరీక్షా కేంద్రాలు మాత్రం విభజిత జిల్లాల ప్రాతిపదికన కేటాయించారు. విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒంగోలులో ఆరు, మార్కాపురంలో రెండు పరీక్షా కేంద్రాలను ఇంజనీరింగ్ కళాశాలలు, కంప్యూటర్ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేశారు. ఒంగోలులో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, రైజ్ కృష్ణసాయి గాంధీ, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల, పేస్ ఇంజనీరింగ్ కళాశాల, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్, నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషల్ యాక్టివ్ ఇండియా సంస్థలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్కాపురంలో కృష్ణ చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ, డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరుగుతాయి.

డీఆర్పీల శిక్షణ ప్రారంభం

ఒంగోలు విద్య, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూలులో మంగళవారం జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్స్ (డీఆర్పీ) శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 150 మంది టీచర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ (ఎస్ఆర్‌జీ) వీరికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ కేంద్రాన్ని డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు సందర్శించారు.



యోగా చేస్తున్న గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

యోగా దేశ సంస్కృతిలో భాగం

- జేసీ గోపాలకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యోగా అనేది భారతీయ సంస్కృతిలో భాగమని ప్రజల్లో యోగాపై అవగాహన రావాలని జేసీ గోపాలకృష్ణ, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున రాష్ట్రంలో 2 కోట్ల మందితో ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం త్రిపురాంతకంలోని బాలత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎరిక్షన్‌బాబుతో కలిసి జేసీ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యోగాంధ్ర దినోత్సవం రోజున వైజాగ్‌లో సీఎం చంద్రబాబు పాల్గొనే ప్రభుత్వ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల మంది హాజరుకావాలని లక్ష్యంగా నిర్దేశించటం జరిగిందన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ, పాకల వంటి పర్యాటక ప్రాంతాల్లో త్రిపురాంతకం కూడా ఎంపిక చేసి ఇక్కడ కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు.



ఆసనాలు వేస్తున్న ఎరిక్షన్‌బాబు

జిల్లాలో ఇప్పటివరకు యోగాంధ్ర క్యాంపెయిన్‌ల ద్వారా 9.66 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 100 మందికి మాస్టర్ ట్రైనర్స్‌గా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ దాదాపు 2వేల మంది యోగాలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగా గురువు బాలసుబ్రహ్మణ్యం, దేవస్థానం చైర్మన్ ఐవి సుబ్బారావు, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీరు వచ్చే వేళ.. నిర్లక్ష్యం ఏలా?

● జమ్ముతో నిండిపోయిన సాగర్ కాలువ

వేసవి ఎండలకు నగర ప్రజలు నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్న తరుణంలో సాగర్ జలాలు విడుదల ఊరటనిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోకి ప్రవేశించిన సాగర్ నీరు మరోవారం రోజుల్లో ఒంగోలులోని వేసవి చెరువులకు చేరనుంది. అయితే నగర పరిధిలోని సాగర్ కాలువ పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఒంగోలు పరిధిలోని సాగర్ కాలువల్లో కనీసం పూడికతీత పనులు పక్కన పెడితే జమ్ము కూడా తొలగించే పరిస్థితి కనిపించడం లేదు. ఒంగోలులోకి ప్రవహించే సుమారు పది కిలో మీటర్లలో కాలువలో గడ్డి, జమ్ము పేరుకుపోయాయి. ఇరిగేషన్ అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరించగా, తాగునీరు సక్రమంగా ఎస్ఎస్ ట్యాంకులకు చేరేలా చూడాల్సిన కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు సైతం మౌనం వహించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సాగర్ కాలువల్లో పెరిగిన జమ్ము, గడ్డిని తొలగించి సాగర్ నీరు సక్రమంగా చెరువులకు చేరేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



కొత్త మామిడిపాలెం వెళ్ళే మార్గంలో జమ్ముతో నిండిపోయిన సాగర్ కాలువ

టంగుటూరులో ఆగి సాగిన వేలం

లోగ్రేడ్ ధరలపై పొందూరు రైతుల అసంతృప్తి

కొనుగోళ్లను నిలిపివేసి కొద్దిసేపు నిరసన

కొండపి (టంగుటూరు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కొంతసేపు కొనుగోళ్లు ఆగిసాగాయి. లోగ్రేడ్ రకం పొగాకు ధరను వ్యాపారులు ఒక్కసారిగా తగ్గించడంతో రైతులు వేలాన్ని నిలిపివేశారు. లోగ్రేడ్ పొగాకును సోమవారం వరకూ కిలో రూ.200కు కొనుగోలు చేశారు. మంగళవారం ఆ ధర ఇవ్వకపోవడంతో రైతులు నిరసన తెలిపారు. దీంతో వేలం కేంద్రం సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తాము నిరసన మాత్రమే తెలియజేస్తున్నామని చెప్పడంతో వెళ్లిపోయారు. అనంతరం వేలం కేంద్రం అధికారి రైతులు, పొగాకు వ్యాపారులతో చర్చించారు. అదేసమయంలో ఉన్నతాధికారుల దృష్టికి కూడా విషయాన్ని తీసుకెళ్లారు. వారి సూచన మేరకు కనిష్ఠ ధర రూ.10 తగ్గించి కిలో రూ.190కు లోగ్రేడ్‌ను వేలానికి ఉంచారు. దీంతో తిరిగి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పెట్లూరు పీహెచ్‌సీ సిబ్బంది

కొండపి, జూన్3 (ఆంధ్రజ్యోతి) : మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా పెట్లూరులో పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు పి. అనూష, ఐ.ప్రియాంక ప్రజలకు అవగాహన కలిగించారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల బారిన పడకుండా నెట్‌లు ఏర్పాటు చేసుకోవాలని, మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ఆరోగ్య సిబ్బందిని కలిసి వైద్య సాయం పొందాలని సూచించారు.

పొగాకు గ్రేడింగ్‌తో అనుకూల ధరలు

● ఆర్ఎం లక్ష్మణరావు



వేలం నిర్వహణను పరిశీలిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

పొదిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పొగాకు గ్రేడింగ్‌ను మంచిగా చేయడం వలన అధిక ధరలు వస్తాయని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి వేలం ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు ఎంత నాణ్యత ఉంటే అంత మంచి ధర వస్తుందని తెలిపారు. లోగ్రేడ్ వచ్చినా గ్రేడింగ్ చేయడంలో మెలకువలు పాటిస్తే అనుకున్న ధర వస్తుందని సూచించారు. అనంతరం కంపెనీ బయ్యర్లతో మాట్లాడుతూ పొగాకు కొనుగోలులలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని ఆర్ఎం అన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి గిరిరాజ్‌కుమార్, 11 కంపెనీల బయ్యర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు జగన్ సైకో పాలనకు తద్దినం

● టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

పొదిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం చేయనున్న వెన్నుపోటు దినాన్ని జగన్‌రెడ్డి సైకో పాలనకు గుర్తుగా తద్దినంగా పాటించుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ మంగళవారం విమర్శించారు. 2019 ఎన్నికలప్పుడు బాబాయి వివేకానందారెడ్డిని హత్య చేసిన వారిని పక్కన పెట్టుకొని 2019 నుంచి 2024 వరకు పాలన సాగించారన్నారు. తల్లి విజయమ్మను, చెల్లి షర్మిలకు వెన్నుపోటు పొడిచి మోసగించింది జగన్‌రెడ్డి కారా అని ప్రశ్నించారు. బాబాయి హత్య కేసులో నిందితుడిగా ఉన్న అవినాష్‌రెడ్డిని కాపాడుకుంటూ వచ్చి, సునీతారెడ్డికి అన్యాయం చేసిందెవరన్నారు. యువత జీవితాలను గంజాయి మత్తులోకి నెట్టి, రౌడీషీటర్లను పెంచిపోషిస్తున్న వ్యక్తి జగన్‌రెడ్డి కాదా అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో అధోగతిపాలైన అమరావతిని మళ్లీ అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదోవపట్టించేందుకు వైసీపీ రాజకీయాలు చేస్తోందని ఘాటుగా విమర్శించారు.

అనారోగ్యంతో రిటైర్డ్ కెప్టెన్ మృతి



చెన్నయ్య (ఫైల్)

గిద్దలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ చెన్నయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చెన్నయ్యను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం మరింత క్షీణించి మంగళవారం మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన యడవల్లి తరలించే ఏర్పాట్లను కుటుంబ సభ్యులు చేస్తున్నారు. గిద్దలూరులోని ఆర్మీ సీఎస్‌డీ క్యాంటీన్‌కు చెన్నయ్య కొన్నాళ్లపాటు మేనేజర్‌గా కూడా పని చేశారు. చెన్నయ్య మృతిపట్ల రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

తర్లుపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కేతగుడిపి రైల్వే బ్రిడ్జి వద్ద జరిగింది. మంగళవారం రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని రైతులు గమనించి సమాచారాన్ని రైల్వే పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి మార్కాపురం రైల్వే పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మార్కాపురం పట్టణ వాసిగా స్థానికులు తెలిపారు. ఇటీవల మతి స్థిమితం లేక తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ఎర్రగొండపాలెం. జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలోని గాయత్రి సినిమా హాల్ వద్ద మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయని ఇంటి యజమాని పోలేపల్లి వెంకటేష్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి వంట పాత్రలు, దుస్తులు కాలిపోయాయి. బాధితుడు వెంకటేష్‌కు పలువురు ఆర్థిక సాయం అందజేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి ● డివిజన్ ఈఈ హరిబాబు ● సమస్యలపై వినియోగదారుల సదస్సులో ఏకరువు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ హరిబాబు

చీమకుర్తి, జూన్3(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు ఇరవైనాలుగు గంటలు పాటు లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా కరెంటు సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ ఒంగోలు డివిజన్ ఈఈ మాకినేని హరిబాబు తెలిపారు. చీమకుర్తి సబ్‌స్టేషన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చీమకుర్తి పట్టణంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వినియోగదారులు పాల్గొని వారి కరెంట్ కష్టాలను ఏకరవు పెట్టారు. గ్రానైట్ ఫ్యాక్టరీలకు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు కలుగుతున్నాయని, రామతీర్థం ఫీడర్ నుంచి సరఫరా చేయాలని ఫ్యాక్టరీ ఓనర్ కాట్రగడ్డ రమణయ్య కోరారు. సిబ్బందిని కూడా పెంచితేనే కరెంట్ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని కోరారు. చీమకుర్తి పట్టణ హోదా గ్రేడ్-2 మున్సిపాలిటీకి పెరిగినా పంచాయతీ నాటి కరెంట్ స్తంభాలే ఇప్పటికీ ఉండటంతో సమస్యగా ఉందని గొల్లపూడి కోటేశ్వరరావు తెలిపారు. కరెంట్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు పట్టణంలో వార్డులవారీగా నెలకొన్న విద్యుత్ సమస్యలను రాతపూర్వకంగా అధికారులకు అందజేశారు. కూనంనేనివారిపాలెం, మువ్వావారిపాలెం గ్రామాల్లో నెలకొన్ని కరెంట్ సమస్యల గురించి ప్రజాప్రతినిధులు తెలిపారు. బండ్లమూడి, నేకునంబాదు గ్రామాల్లో ఇన్సులేటర్ల సమస్యతో చిన్నపాటి వర్షానికే కరెంట్ నిలిచిపోయి జాగారం చేయాల్సి వస్తుందని, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలపై ఈఈ హరిబాబు స్పందిస్తూ వీలైనంత త్వరలోనే వాటిని పరిష్కరిస్తామన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవటం ద్వారా కరెంట్ బిల్లులు చాలామేరకు తగ్గించుకోవచ్చని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం బీసీ, ఎస్సీలకు భారీగా సబ్సిడీ ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో 10వేల మంది వినియోగదారులు సోలార్ విద్యుత్ వైపు అడుగులు వేసేలా లక్ష్యంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఈ మోహనరావు, ఏఈలు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, వినియోగదారులు కందిమళ్ల గంగాధరరావు, కూరాకుల కరుణాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల తయారీ నిలిపివేత తగదు

● దివ్యాంగ సంఘాల నాయకుల ధ్వజం

● ఏడీ తీరుపై విమర్శలు

ఒంగోలు నగరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన నిర్లక్ష్యం, అవినీతి కారణంగా జిల్లాలోని దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రకాశంభవనంలో వారు తమ ఆవేదనను వెళ్లబుచ్చారు. ప్రభుత్వం నుంచి తగినన్ని నిధులు విడుదలై సిద్ధంగా ఉన్నప్పటికీ ట్రైసైకిళ్ల తయారీని నిలిపివేసి దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ట్రై సైకిళ్ల తయారీని నిలిపివేయటానికి ఏడీకి కాంట్రాక్టర్‌కు మధ్య తలెత్తిన ఆర్థిక విభేదాలే కారణమని విమర్శించారు. పాత కాంట్రాక్టును రద్దు చేసి కొత్త కాంట్రాక్టును పిలిచి ట్రైసైకిళ్ల తయారీని పునఃప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించినా ఏడీ పట్టీనట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంతపేటలోని దివ్యాంగ విద్యార్థుల వసతిగృహం ఇన్‌చార్జి వార్డెన్ రవితేజ కూడా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వసతిగృహంలో కేవలం 25 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా 40 మంది ఉన్నట్లు బిల్లులు డ్రా చేసుకుని తింటున్నారని వారు చెప్పారు. దివ్యాంగుల వసతులు సమకూర్చేందుకు దాతల నుంచి పొందిన విరాళాలు కూడా నమోదు చేయకుండా దుర్వినియోగం చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషావలి, మదర్‌థెరిసా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌హంజా, నాయకులు రాజేష్ పసుమర్తి, రాపూరి రాంబాబు, ధనావత్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్విస్‌లో ఘనంగా ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

● 928 మందికి క్యాంపస్ ఉద్యోగాలు

● విద్యార్థులకు సన్మానం



ఉద్యోగం సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

ఒంగోలు విద్య, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 928 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ సాధించడం గర్వంగా ఉందని క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. వీరికి కళాశాలలోకి ఘనంగా ఆహ్వానించి అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ట్రైనె టీజీ సీఈ కార్పొరేట్ కంపెనీ ప్రతినిధి అరుణ్‌కుమార్ శుభనవీన్ మాట్లాడుతూ ఇంత మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ సాధించడం ఒక రికార్డు అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉద్యోగాలు సాధించడం కష్టంగా ఉన్నప్పటికీ విద్యార్థులకు మొదటి నుంచి ఇస్తున్న ప్రత్యేక శిక్షణ వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. క్విస్ విద్యా సంస్థల అధినేత సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శ్రీగాయత్రిలు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రత్యేక కోర్సులు, విజన్‌తో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణతో విద్యార్థులు ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డీన్ జగదీష్, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలను అందజేశారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

● ఏఎస్పీ అశోక్‌బాబు



క్రీడాకారులకు ప్రోత్సాహక సర్టిఫికెట్‌లను అందజేసిన నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా బెల్ట్ గ్రేడింగ్ పోటీలు ఘనంగా జరిగాయి. మంగళవారం స్థానిక హైదరీ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఏఎస్పీ అశోక్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే కరాటే నేర్చుకోవడం ద్వారా శరీరక దృఢత్వం, ఆత్మ విశ్వాసం, ఆత్మరక్షణకు మరింత దోహదపడతాయన్నారు. చీఫ్ కోచ్, క్యాంప్ నిర్వాహకులు నల్లూరి మోహన్‌రావు మాట్లాడుతూ నెల రోజులపాటు చిన్నారులకు వేసవి శిక్షణ అందించినట్లు చెప్పారు. వివిధ విభాగాల్లో వారికి శిక్షణ అందించి అవసరమైన మెలకువలు నేర్పినట్లు తెలిపారు. కాగా వారికి చివరి రోజు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్‌లు మంజూరు చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ చదువుతోపాటు కరాటేలోకూడా నైపుణ్యం సాధించాలన్నారు. తద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గుండవరపు రాఘవ, కుర్రా భాస్కర్‌రావు, కోచ్‌లు అట్లూరి శ్రీధర్, మల్లవరపు వెంకటేశ్వర్లు, పీవీ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఒంగోలులో రౌడీషీటర్‌తో మాట్లాడుతున్న సీఐ విజయకృష్ణ



మద్దిపాడులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శివరామయ్య

● తాలుకా సీఐ విజయకృష్ణ

ఒంగోలు క్రైం, జూన్3(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తాలుకా సీఐ విజయకృష్ణ హెచ్చరించారు. మంగళవారం ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, పాతనేరస్థుల ఇళ్ళ వద్దకు వెళ్ళి ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. అదే సమయంలో రౌడీషీటర్లు, పాతనేరస్థుల జీవన స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. సత్ ప్రవర్తన కలిగి ఉంటే సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు వస్తుదని హితవు పలికారు. అయిన వెంట తాలుకా ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

మద్దిపాడు: రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్ఐ శివరామయ్య హెచ్చరించారు. మంగళవారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జన జీవన స్రవంతిలో కలవాలని సూచించారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తపట్నం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఈతముక్కల సూరారెడ్డిపాలెం రహదారిలో మంగళవారం జరిగింది. ఈతముక్కల నుంచి సంకువానిగుంట వైపు రోడ్డు పక్కనే నడిచివెళుతున్న గుర్తుతెలియని వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం పేరంటాళ్ల కుంట సమీపంలో ఢీ కొట్టింది. దీంతో రోడ్డు పక్కనే పడిపోయి ప్రాణపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికులు గుర్తించి 108 వాహనం ద్వారా ఒంగోలులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతిచెందాడు. మృతుని వివరాలు కూడా తెలియలేదు. కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న బైక్

మద్దిపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన మంగళవారం వెల్లంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, బసవన్నపాలెంకు చెందిన నల్లూరి కృష్ణారావు వెల్లంపల్లి సమీపంలో రోడ్డును దాటుతుండగా గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే కారు అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణారావుకు కుడికాలు విరిగింది. బాధితుడిని 108వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మద్దిపాడు పోలీసులు కారును సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సభలు, సమావేశాలకు అనుమతి లేదు

● డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కొండపి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో సెక్షన్ 30 అమల్లో ఉందని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా సభలు, సమావేశాలు, జనం గుంపులుగా చేరడానికి వీల్లేదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కె.ఉప్పలపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని వెన్నూరు, చోడవరం, ముప్పవరం గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హర్షీష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడుతున్నదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రామచంద్రయాదవ్‌పై దురుసుగా ప్రవర్తించడం తగదు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలపై విజయవాడలో జరిగిన ధర్నాలో మాట్లాడి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించేందుకు వెళ్తున్న భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. ఒక బీసీ నాయకుడిపై దురుసుగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల వైఖరిని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహించేందుకు వెనుకాడేది లేదని ఆయన హెచ్చరించారు.

సీపీఐ నగర కార్యదర్శిగా శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శిగా శ్రీరామ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన నగర మహాసభలో పార్టీ నగర కమిటీని ఎన్నుకున్నారు. 33మంది సభ్యులతో నగర సమితిని, ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆహ్వానితులుగా మరో తొమ్మిది మంది, గౌరవ ఆహ్వానితులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు. మహాసభలో చేసిన తీర్మాణాలను మంగళవారం విడుదల చేశారు. నగరానికి రోజు మంచినీరు ఇవ్వాలని, గత ప్రభుత్వం ఇచ్చిన ఒక సెంటు ఇళ్ళస్థలాలను రెండు సెంట్లుగా మార్చిఇవ్వడంతో పాటు గృహ నిర్మాణాలు చేయాలని, రిమ్స్ వైద్యశాలలో డాక్టర్ల కొరతను తీర్చడంతో పాటు మందుల కొరతను తీర్చాలని తీర్మానించారు. టిడ్కో ఇండ్ల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ప్రభుత్వమే చెల్లించి ఇళ్ళు స్వాధీనం చేయాలని, నగరంలో విద్యారంగాన్ని సంస్కరించి ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు.

క్షయను నిరోధించడానికి పాటుపడాలి



ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవాణి, వైద్యసిబ్బంది

మద్దిపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): క్షయను నిరోధించడానికి అందరూ పాటుపడాలని జిల్లా టీబీ యూనిట్ అధికారి డాక్టర్ శ్రీవాణి కోరారు. మంగళవారం దొడ్డవరంలో వందరోజుల టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ క్షయను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుందన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో 60 ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తిని పరీక్షిస్తారన్నారు. వారిలో వారం రోజులు పాటు దగ్గుతో బాధపడుతున్న వారిని గుర్తించి కళ్లె పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలవ్యాప్తంగా నిర్వహించాలని చెప్పారు. ఇదే క్రమంలో మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను గ్రామానికి తీసుకువచ్చి పలువురికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్వేష్, లలితమ్మ, రజితకుమారి, బాలకోటయ్య, నాగరాజు, సీతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పీఠాధిపతులకు పట్టువస్త్రాల సమర్పణ



పీఠాధిపతులకు వస్త్రాలను సమర్పిస్తున్న దేవస్థాన ప్రతినిధులు

ఒంగోలు కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కుర్తాళం పీఠాధిపతులకు ఒంగోలులోని శ్రీగిరి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. కుర్తాళంలో జరుగుతున్న మహా శంఖాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగిరి దేవస్థాన కార్యవర్గ ప్రతినిధులు ఆలూరు జైశంకర్, కుమార ఆత్రేయలు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, ఉత్తర పీఠాధిపతి శ్రీ దత్తేశ్వరానంద భారతీ స్వామి వార్లకు వస్త్రాలను సమర్పించి వారి నుంచి ఆశీస్సులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామీజీలు మాట్లాడుతూ బుధవారం నుంచి శ్రీగిరిలో ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, విజయవంతం కావాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


వంకర పాదాలకు శస్త్ర చికిత్స

మార్కాపురం రూరల్, జూన్3 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పుట్టుకతో వస్తున్న వంకర పాదాలకు శస్త్ర చికిత్స చేయడం ద్వారా నయం చేయవచ్చని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ రామచంద్రరావు తెలిపారు. మంగళవారం మార్కాపురం ఆసుపత్రిలో డీఈఐసీ ఆర్బియస్‌కే సెంటర్‌లో ప్రపంచ క్లబ్ ఫుట్ దినోత్సవం సందర్భంగా వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. క్లబ్ ఫుట్ అనేది పుట్టుకతో వచ్చే రుగ్మతని, దీనికి సరైన వైద్యం అందిస్తే సరిచేయవచ్చని రామచంద్రరావు తెలిపారు.

ఘాట్ రోడ్డు విస్తరణ జరిగేనా..?

- నిత్యం ఏదో ఒక ప్రమాదం
- స్తంభిస్తున్న ట్రాఫిక్
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

గిద్దలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు - నంద్యాల మధ్య గల నల్లమల ఘాట్ రోడ్డు విస్తరణ కోసం వాహన చోదకులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. అదిగో పులి.. ఇదిగో మేక అంటూ పాలకులు ఘాట్ రోడ్డు విస్తరణపై రోజుకో మాట చెప్తున్నారే తప్ప వాస్తవానికి ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. దాంతో ఈ రోడ్డులో రోజుకో ప్రమాదం జరిగి గంటల సమయం ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. రాష్ట్ర విభజన తరువాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అనంతపురం నుంచి గిద్దలూరు మీదుగా అమరావతి వరకు రోడ్డు విస్తరణ చేయాలని తలపెట్టింది. ఈ రోడ్డు విస్తరణతోపాటు అమరావతి నుంచి అనంతపురం వరకు కొత్తగా ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డును కూడా చేపట్టాలని ప్రతిపాదించింది. ముందుగా ఉన్న రోడ్డును విస్తరించాలన్న తలంపుతో అనంతపురం నుంచి గిద్దలూరు వరకు, గిద్దలూరు నుంచి గుంటూరు వరకు రోడ్డు విస్తరణ కోసం టెండర్లు పిలిచింది. రాజకీయ కారణాలతో అనంతపురం నుంచి గిద్దలూరు వరకు టెండర్లు రెండుసార్లు పిలిచినప్పటికీ రద్దవుతూ వచ్చాయి. పదేళ్లు గడిచినా విస్తరణ పనులు మొదలు కాలేదు. గిద్దలూరు నుంచి గుంటూరు వరకు రూ.3500కోట్లతో గత టీడీపీ హయాంలోనే రోడ్డు పనులు మొదలు కావడం, వినుకొండ వరకు విస్తరణ పూర్తి కావడం జరిగింది. ప్రభుత్వం మారడంతో వినుకొండ నుంచి గుంటూరు వరకు విస్తరణ జరుగలేదు. అయితే అనంతపురం నుంచి గిద్దలూరు వరకు ఉన్న టెండర్‌లో నంద్యాల - గిద్దలూరు మధ్య గల ఘాట్ రోడ్డు విస్తరణ కూడా ఉన్నది. మొత్తం టెండర్ ఆగిపోవడంతో ఘాట్ రోడ్డు విస్తరణ పనులు కూడా ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన అనంతరం రెండవ పర్యాయం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ విస్తరణ పనులపై ప్రజలు, వాహన చోదకులు ఆశలు చిగురించాయి. గత వైసీపీ పాలకులు గిద్దలూరు మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ హైవేను పులివెందుల మీదుగా మార్చుకోవడంతో ఇక అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల ప్రజలు గిద్దలూరు వరకు పాత రోడ్డుపైనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకుంది. మిగతా రోడ్డు విషయం అటుంచితే గిద్దలూరు-నంద్యాల మధ్య గల నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఘాట్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రెండు పట్టణాల మధ్య 60 కిలోమీటర్లు ఉండగా, ఇందులో దిగువమెట్ట నుంచి గాజులపల్లె మధ్య 25 కిలోమీటర్ల మేర దట్టమైన నల్లమల అడవిలో అనేక కీలకమైన మలుపులతో రోడ్డు ఉన్నది. కొన్ని చోట్ల ఒక వాహనం మాత్రమే పట్టేంత ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఘాట్ రోడ్డులో చాలా భాగం అటు ఎత్తుగానో, ఇటు తగ్గుగానో ఉంటుండడంతో తరచూ వాహనాలకు బ్రేకులు ఫెయిల్ అయి రక్షణ గోడలను, బ్రిడ్జిల భాగాలను గుద్దుకుని ప్రమాదాలకు గురవుతూ రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిచిపోవడమో, పడిపోవడమో జరుగుతున్నాయి. దాంతో తరచూ ట్రాఫిక్ స్తంభించి పోతున్నది. ప్రమాదాలకు పగలు, రాత్రి తేడా ఉండదు. ఈ రూటులో ఎప్పుడు టాఫ్రిక్ స్తంభించిపోతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంటున్నది. దానికితోడు ప్రకాశం, నంద్యాల జిల్లాల సరిహద్దులో ఈ ఘాట్ రోడ్డు ఉండడం, కొంతభాగం గిద్దలూరు పోలీసుస్టేషన్ పరిధిలో, మరికొంత భాగం నంద్యాల జిల్లాలోని సిరివెళ్ల, మహానంది పోలీసు స్టేషన్ల పరిధిలో ఉంది. ప్రమాదం జరిగిన స్థలం ఎవరిదో తెలుసుకోవడానికి గంటల సమయం పడుతున్నది. దానికితోడు ఈ ఘాట్ రోడ్డులో సెల్ సిగ్నల్స్ అందవు. ప్రమాదం జరిగిందంటే కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రమాదం జరిగిన విషయం కూడా పోలీసులకు చాలా ఆలస్యంగా తెలుస్తున్నది. పోలీసులు క్రెయిన్లను తీసుకుని వెళ్లి రోడ్డుకు అడ్డంగా పడిన వాహనాలను పక్కకు తీసుకుని పోయే వరకూ గంటల తరబడి ఘాట్ రోడ్డులో బిక్కుబిక్కుమంటూ వాహనచోదకులు, ప్రయాణికులు గడపాల్సిందే. తాగేందుకు కనీసం మంచినీరు కూడా దొరకదు. ఈ ప్రాంతం టైగర్ జోన్ కింద ఉండడంతో పులులు, ఇతర అటవీ జంతువులు వస్తాయేమోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనంతపురం - గిద్దలూరు వరకు 4 లైన్ల రోడ్డు మంజూరైనట్లు, ఇందుకు కేంద్రం సుముఖంగా ఉన్నట్లు రోజుకో వార్త వస్తుందేతప్ప ఇందుకు సంబంధించిన టెండర్లు వేయడం గానీ, ఇతరత్రా పనులు జరుగకపోవడంతో రోడ్డు విస్తరణ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా నంద్యాల-గిద్దలూరు మధ్య గల ఘాట్ రోడ్డునైనా తొలివిడతగా విస్తరిస్తే ఈ జాతీయ హైవేపై ప్రమాదాలు తగ్గుతాయని, ట్రాఫిక్ స్తంభించి పోయే అవకాశం ఉండదని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు. పాలకులు రోడ్డు విస్తరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




నల్లమల ఘాట్ రోడ్డులో మలుపు వద్ద ప్రమాదానికి గురైన లారీ (ఫైల్), ఘాట్‌లో నిలిచిన వాహనాలు



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

డబుల్ ఓటర్లు, తొలగింపులపై సమావేశం

గిద్దలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఓటర్లు, తొలగింపులు, చేర్పులపై రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎం.వెంకటశివరామిరెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గిద్దలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం - పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ కేఎస్‌పల్లె గ్రామంలో అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛభారత్ - స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో రమణారెడ్డి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, కాటన్ సంచులను వాడాలని ప్రజలకు సూచించారు. దీని వలన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, పంచాయతీ కార్యదర్శి రాఘవరావు, సర్పంచ్ ఎలిజబెత్‌అబ్రహం పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన కల్పించాలి



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిశోర్ కుమార్

తర్లుపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులందరూ కౌలు కార్డులు తీసుకునేలా వ్యవసాయాధికారులు, వీఆర్‌వోలు అవగాహన కల్పించాలని తహసీల్దార్ కిశోర్ కుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, వ్యవసాయ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 990 మందికి కౌలు కార్డులు ఇచ్చేందుకు టార్గెట్ ఇచ్చినట్లు చెప్పారు. భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని, వారికి కూడా తెలియపరచాలని సూచించారు. కౌలు కార్డులు తీసుకున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాలపై నష్ట పరిహారం, సబ్సిడీ పథకాలు వర్తిస్థాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పంట సాగు హక్కు పత్రం ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. మంగళవారం వీఆర్వోలు, ఏవోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రంజీవి మాట్లాడుతూ కౌలు రైతులకు సాగుకోసం బ్యాంకు రుణాలు కూడా అందిస్తుందని తెలిపారు. గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులను అందించాలని సూచించారు. సమావేశంలో ఏవో శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌వోలు, గ్రామ ఆర్‌ఎ్‌ెకే సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ కమిషనర్‌ను కలిసిన హజ్ కమిటీ డైరెక్టర్

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మైలవరపు వీఆర్ కృష్ణతేజను మంగళవారం ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మిర్జా ఆబిద్ హుస్సేన్ బేగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు ప్రకాశం జిల్లా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్ ఉన్నారు.



పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసిన అబిద్ హుస్సేన్, సాదిక్

వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే రేషన్

- పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



వృద్ధురాలికి రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకుల పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ డీలర్లు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందిస్తారని తెలిపారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు చౌక డిపోల్లో సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్డుదారులు వీలునుబట్టి వెళ్లి సరుకులు పొందాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, పిడతల రవి కుమార్, పాల్గొన్నారు.



పుల్లలచెరువులో సరుకులను అందిస్తున్న తహసీల్దార్

గిద్దలూరు : వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే బియ్యం, పంచదార సరుకులను అందిస్తారని తహసీల్దార్ ఎం. ఆంజనేయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులతోపాటు 65 ఏళ్లు పైబడిన వృద్ధులు రేషన్ దుకాణాల వద్దకు రావల్సిన అవసరం లేదని, వీరందరికీ డీలర్ల ద్వారా నేరుగా వారి ఇళ్లకే రేషన్ సరుకులు పంపిణీ జరిగే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో 23472 రేషన్‌కార్డులు ఉండగా వీరిలో 2210 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికీ ఈనెల 5వ తేదిలోగా వారి ఇళ్ల వద్దకు డీలర్లు వెళ్లి రేషన్ సరుకులు అందిస్తారని పేర్కొన్నారు. రేషన్ విషయంలో దివ్యాంగులు, వృద్ధులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రేషన్ సరుకులు అందకపోతే తమకు ఫిర్యాదు చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పుల్లలచెరువు : ఇకపై వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందించాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు డీలర్లను ఆదేశించారు. మంగళవారం ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు రేషన్‌ను పంపిణీ చేశారు.

జగన్ సైకో పాలనకు తద్దినం

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్

పొదిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం చేయనున్న వెన్నుపోటు దినాన్ని జగన్‌రెడ్డి సైకో పాలనకు గుర్తుగా తద్దినంగా పాటించుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ మంగళవారం విమర్శించారు. 2019 ఎన్నికలప్పుడు బాబాయి వివేకానందారెడ్డిని హత్య చేసిన వారిని పక్కన పెట్టుకొని 2019 నుంచి 2024 వరకు పాలన సాగించారన్నారు. తల్లి విజయమ్మను, చెల్లి షర్మిలకు వెన్నుపోటు పొడిచి మోసగించింది జగన్‌రెడ్డి కారా అని ప్రశ్నించారు. బాబాయి హత్య కేసులో నిందితుడిగా ఉన్న అవినాష్‌రెడ్డిని కాపాడుకుంటూ వచ్చి, సునీతారెడ్డికి అన్యాయం చేసిందెవరన్నారు. యువత జీవితాలను గంజాయి మత్తులోకి నెట్టి, రౌడీషీటర్లను పెంచిపోషిస్తున్న వ్యక్తి జగన్‌రెడ్డి కాదా అన్నారు. జగన్ రెడ్డి పాలనలో అధోగతిపాలైన అమరావతిని మళ్లీ అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ శ్రమిస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదోవపట్టించేందుకు వైసీపీ రాజకీయాలు చేస్తోందని ఘాటుగా విమర్శించారు.

యోగా మండల స్థాయి పోటీలు

మార్కాపురం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర మండల స్థాయి పోటీలను మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో భాగ్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. యువతీయువకులకు వేర్వేరుగా జరిగిన పోటీలను యోగా గురువు పర్యవేక్షించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో భాగ్యవతి మాట్లాడుతూ ఈ నెల 7 వతేదీ వరకు పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యోగా పోటీదారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసులు

చదువుతోపాటు ఆరోగ్యం

గిద్దలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకునే చర్యలు చేపట్టాలని రిటైర్డ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ చదువుతోపాటు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉంటే చదువులో కూడా బాగా రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, వివిధ సంఘాల ప్రతినిధులు ఫరూఖ్, కార్తికేయ, సాయి, రామిరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : విద్యార్థులు చదువుతోపాటు పోటీ పరీక్షలలో పాల్గొని విజ్ఞానం పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు శివారెడ్డి అన్నారు. శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చని శివారెడ్డి అన్నారు. గ్రంథాలయాకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చదరంగంపై శిక్షణ ఇచ్చారు.

పొగాకు గ్రేడింగ్‌తో అనుకూల ధరలు

ఆర్ఎం లక్ష్మణరావు

పొదిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పొగాకు గ్రేడింగ్‌ను మంచిగా చేయడం వలన అధిక ధరలు వస్తాయని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి వేలం ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు ఎంత నాణ్యత ఉంటే అంత మంచి ధర వస్తుందని తెలిపారు. లోగ్రేడ్ వచ్చినా గ్రేడింగ్ చేయడంలో మెళకువలు పాటిస్తే అనుకున్న ధర వస్తుందని సూచించారు. అనంతరం కంపెనీ బయ్యర్లతో మాట్లాడుతూ పొగాకు కొనుగోలులలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని ఆర్ఎం అన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి గిరిరాజ్‌కుమార్, 11 కంపెనీల బయ్యర్లు, రైతులు పాల్గొన్నారు.



వేలం నిర్వహణను పరిశీలిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు



రైతుకు డ్రోన్‌ను అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

రైతులకు సబ్సిడీపై డ్రోన్‌ల అందజేత

త్రిపురాంతకం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు ఇచ్చి వారికి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు, మంగళవారం త్రిపురాంతకం మండలం మేడపిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని వ్యవసాయశాఖ ద్వారా మంజూరైన డ్రోన్ పరికరాన్ని రైతులకు అందజేశారు. ఇప్పటివరకు రూ.27లక్షల విలువైన పరికరాలను సబ్సిడీపై ఇక్కడి రైతులకు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అందజేయడం జరిగిందన్నారు. రైతులు వాటిని వినియోగించుకోవాలని ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు.

వాసవీ జాగృతి ప్రతినిధి హరికృష్ణకు సన్మానం

గిద్దలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో ఉచితంగా చల్లని పానియాలను, తినుబండారాలను నెల రోజులపాటు పాదచారులకు ఉచితంగా అందేందుకు ఏర్పాట్లు చేసిన వాసవీ జాగృతి సేవా సంస్థ పట్టణ శాఖ అధ్యక్షుడు శివపురం హరికృష్ణను పలువురు సన్మానించారు. మే మొత్తం ప్రతి రోజు చల్లని పానియాలను, పండ్లు పాదచారులకు అందించి వేసవితాపం తీర్చారని పలువురు కొనియాడి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, జిల్లా మేధో కమిటీ సభ్యులు రెడ్డి మల్లారెడ్డి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎం.పుల్లయ్య, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ, కాసులు, జయప్రకాశ్, వాసవి జాగృతి సంస్థ ప్రతినిధులు బాదం వెంకటేశ్వర్లు, సూరె చెంచయ్య పాల్గొన్నారు.

వైద్యశాలలో డీఎంహెచ్‌వో విచారణ

పుల్లలచెరువు,జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఇక్కడ పనిచేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ నాగార్జునపై డీఎంహెచ్‌వో డీ వెంకటేశ్వరరావు మంగళవారం విచారణ జరిపారు. పుల్లలచెరువు వైద్యశాలకు వచ్చిన ఆయన నేరుగా ఆఫీస్ రూంలో కూర్చొని గతంలో పనిచేసిన డాక్టర్‌పై ఆరా తీశారు. ఏఎన్ఎంలు, సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిచి డాక్టర్‌పై వచ్చిన ఆరోపణలపై వివరాలను సేకరించారు. విచారణ నివేదికను ఉన్నాతాధికారులకు ఇస్తామని ఆయన తెలిపారు.

అనారోగ్యంతో రిటైర్డ్ కెప్టెన్ మృతి



చెన్నయ్య (ఫైల్)

గిద్దలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ చెన్నయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చెన్నయ్యను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం మరింత క్షీణించి మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన యడవల్లి తరలించే ఏర్పాట్లను కుటుంబ సభ్యులు చేస్తున్నారు. గిద్దలూరులోని ఆర్మీ సీఎస్‌డీ క్యాంటీన్‌కు చెన్నయ్య కొన్నాళ్లపాటు మేనేజర్‌గా కూడా పని చేశారు. చెన్నయ్య మృతిపట్ల రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

తర్లుపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కేతగుడిపి రైల్వే బ్రిడ్జి వద్ద జరిగింది. మంగళవారం రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని రైతులు గమనించి సమాచారాన్ని రైల్వే పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి మార్కాపురం రైల్వే పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మార్కాపురం పట్టణ వాసిగా స్థానికులు తెలిపారు. ఇటీవల మతి స్థిమితం లేక తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

పేకాట ఆడుతున్న నలుగురు అరెస్టు

కొమరోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.4200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో అక్రమంగా పేకాటాడుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్ఐ నాగరాజు తన సిబ్బదితో కలిసి దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4200 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాడితే 9121102190కి కాల్‌చేసి చెప్పాలని కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

రూ.2లక్షల మేర ఆస్తి నష్టం

ఎర్రగొండపాలెం. జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలోని గాయత్రి సినిమా హాల్ వద్ద మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయని ఇంటి యజమాని పోలేపల్లి వెంకటేష్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసినప్పటికీ వాహనం వచ్చేసరికి వంట పాత్రలు, దుస్తులు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలను సిబ్బంది ఆర్పివేశారని తెలిపారు. బాధితుడు వెంకటేష్‌కు చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ రూ.5వేలు, ఎంఈవో ఆంజనేయులు రూ.1000, ఉపాధ్యాయులు అడిపి నాగయ్య రూ.500, అన్నంరాజు మురళీకృష్ణ రూ.1000, బాబుల్‌నాయక్ రూ.500 మొత్తం రూ.8,500 అందజేశారు.

వంకర పాదాలకు శస్త్ర చికిత్స

మార్కాపురం రూరల్, జూన్3 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పుట్టుకతో వస్తున్న వంకర పాదాలకు శస్త్ర చికిత్స చేయడం ద్వారా నయం చేయవచ్చని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ రామచంద్రరావు తెలిపారు. ఆసుపత్రిలో డీఈఐసీ ఆర్బియస్‌కే సెంటర్‌లో ప్రపంచ క్లబ్ ఫుట్ దినోత్సవం సందర్భంగా వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్లబ్ ఫుట్ అనేది పుట్టుకతో వస్తున్న రుగ్మత అని దీనికి సరైన వైద్యం అందిస్తే సరిచేయవచ్చని రామచంద్రరావు తెలిపారు. పాన్ శెట్టి మెథడ్ ద్వారా కాళ్ల వంకరను నయంచేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ ప్రిన్సిపాల్ మారుతి, ఎముకల వైద్యులు, నాయక్, ఆర్ఎంవో శ్రీనివాస్, తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పెద్ద దోర్నాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మలేరియా సీహెచ్‌వో మంత్రునాయక్ ఆధ్వర్యంలో మలేరి యా మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజన్‌లో దోమల వృద్ధి ఎక్కువై మలేరియా, డెంగ్యూ, గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. నీటి గుంటలు, మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. తద్వారా గుంతలు పూడ్చించడమో లేదా కీటకనాశని మందులను పిచికారీ వంటి చర్యలను చేపట్టాలన్నారు. ఆశావర్కర్లు రోజుకు 25 ఇళ్లను పరిశీలించి లార్వాలను అరికట్టాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సూర్యకుమారి, పద్మావతి, జీ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రేపు సీఎస్‌పురంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలో జరుగుతున్న శ్రీరాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల వేడుకల్లో భాగంగా కాపు నాయుడుల ఆధ్వర్యంలో ఈనెల 5న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కదిరి ప్రకాష్‌రావు, పార్థసారథి మంగళవారం ఆవిష్కరించారు. మొదటి బహుమతిగా రూ.1,00,116, రెండో బహుమతిగా రూ.75,116, మూడో బహుమతిగా 50,116, నాలుగో బహుమతిగా రూ.30,116 అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మన్నేపల్లి పెద్దన్న, రవికుమార్, మూరం కాశిరెడ్డి, మునగల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో యోగా పోటీలు

దొనకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర 2025 పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగా పోటీలు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నుంచి ఈనెల 7 వరకు మండలస్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. యోగా ఆసనాలు, సూర్య నమస్కారం, ప్రాణామాయం, ధ్యానపోటీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తిగలవారు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

ఎస్‌ఐ నాయక్‌కు సన్మానం

సీఎస్‌పురం(పామూరు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం ఎస్‌ఐగా ఎం.వెంకటేశ్వరనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు టీడీపీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌ఐని కలిసినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, మాజీ ఎంపీపీ తోడేటి చిన అల్లురయ్య, ఎన్‌సీ మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, షేక్ రజ్జబ్‌బాషా, బత్తుల వెంకటాద్రి, సర్పంచ్ పద్మావతి, ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, అట్లూరి కృష్ణంరాజు, మన్నేపల్లి శ్రీను, వెంకటకొండయ్య, గురుకృష్ణ, ప్రసాద్, వెంకటస్వామి ఉన్నారు.

మల్లేశ్వరమ్మ మృతిపట్ల సంతాపం

పామూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నట్టుమడుగు గ్రామానికి చెందిన గుర్రం శేషయ్య సతీమణి మల్లేశ్వరమ్మ(60) మంగళవారం మృతిచెందారు. ఆమె అకాల మృతి పట్ల ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఇరిగినేని రవీంద్రబాబు, దారపనేని చంద్రశేఖర్, బైరెడ్డి జయరామిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కుమారులు రామసుబ్బారావు, రమేష్‌లకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మృతిపట్ల యర్రశింగు మునలయ్య, పచ్చవ పేరయ్య, దేవరపు మాల్యాద్రి, చావా సుబ్బారావు, యర్రశింగు వెంకటేశ్వర్లు, అల్లు శ్రీనివాసులు, నూతంగి నారాయణ, డాక్టర్ కోటపాటి శ్రీచరణ్, తదితరులు సంతాపం తెలిపారు.

హెచ్‌ఎంగా కోటిరెడ్డి బాధ్యతల స్వీకరణ

పామూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన హెచ్‌ఎంగా పి. కోటిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీస్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదోన్నతిపై పామూరు హైస్కూల్‌కు హెచ్‌ఎంగా వచ్చారు. ఈసందర్భంగా విద్యాకమిటీ ఛైర్మన్ గుత్తి కొండలరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.రామస్వామి, ప్రిన్సిపాల్ రాజశేఖర్, తదితరులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్‌ల అందజేత

త్రిపురాంతకం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు ఇచ్చి వారికి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు, మంగళవారం త్రిపురాంతకం మండలం మేడపిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని వ్యవసాయ శాఖ ద్వారా మంజూరైన డ్రోన్ పరికరాన్ని రైతులకు అందజేశారు. ఇప్పటివరకు రూ. 27లక్షల విలువైన పరికరాలను సబ్సిడీపై ఇక్కడి రైతులకు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అందజేయడం జరిగిందన్నారు. రైతులు వాటిని వినియోగించుకోవాలని ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

తర్లుపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కేతగుడిపి రైల్వే బ్రిడ్జి వద్ద జరిగింది. మంగళవారం రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని రైతులు గమనించి సమాచారాన్ని రైల్వే పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి మార్కాపురం రైల్వే పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మార్కాపురం పట్టణ వాసిగా స్థానికులు తెలిపారు.

ఇటీవల మతి స్థిమితం లేక తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

శిథిలావస్థలో దోర్నపువాగు చప్టా

» రాకపోకలకు ఇబ్బందులు



తాళ్లూరు-కుంకుపాడు వెళ్లే మార్గంలో శిథిలావస్థకు చేరిన దోర్నపువాగు చప్టా

తాళ్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-కుంకుపాడు మార్గంలో గల దోర్నపువాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన చప్టా శిథిలావస్థకు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 1980లో దోర్నపు వాగుపై సింగిల్‌వే చప్టాను నిర్మించారు. ఈమార్గం అద్దంకికి దగ్గరగా ఉండటంతో అధికసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. సింగిల్‌చప్టా కావటంతో వాహనాలు ఎదురు పడితే పక్కకు వెళ్లలేక తీవ్రఇబ్బందిగా ఉంది. ఇటీవల తాళ్లూరు ప్రాంతంలో గ్రీన్‌హైవే రోడ్డు నిర్మాణం చేస్తుండటంతో నిత్యం మట్టి తోలకం కోసం అధిక సంఖ్యలో టిప్పర్లు ఈ చప్టాపై తిరుగుతుండటంతో శిథిలావస్థకు చేరింది. అధిక బరువుతో టిప్పర్లు చప్టాపై వెళుతున్నప్పుడు చప్టా కంపిస్తున్నది. ఈచప్టా గుండా తాళ్లూరు, చీమకుర్తి, మద్దిపాడు మండలాలతోపాటు బాపట్ల జిల్లా అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, కొరిశపాడు తదితర మండలాల్లోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. తాళ్లూరు ప్రాంత భూములు వాగుకు ఆవలివైపు ఉండటంతో వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

చప్టాకు ఉత్తరం వైపు మధ్య భాగంలో కాంక్రీట్ కోతకు గురైంది. చప్టాపై పెద్ద గాడి ఏర్పడి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాగు ఉధృతికి చప్టాపై ఉన్న పిల్లర్లు పూర్తిగా కొట్టుకుపోవటంతో వాగు ప్రవహించే సమయంలో చప్టా కన్పించక ప్రమాదాలు జరుతున్నాయి. వాగు ప్రవహిస్తే చప్టాపై వెళ్లే అవకాశం లేక రాకపోకలు నిలిచి పోతున్నాయి. గత వైసీపీ పాలనలో ఈచప్టా మరమ్మతుల గురించి చర్యలు తీసుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా శిథిలమైన చప్టాస్థానే కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి బ్యాచ్‌కు జగన్ అండగా నిలవటం సిగ్గుచేటు

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజం



డాక్టర్ లక్ష్మి

దర్శి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ గంజాయి బ్యాచ్‌కు అండగా నిలవటం సిగ్గుచేటని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. ఈమేరకు మంగళవారం ఓప్రకటన విడుదలచేశారు. తెనాలిలో పోలీసులపై దాడిచేసిన రౌడీషీటర్లు, గంజాయి స్మగ్లర్లను పరామర్శించటం ఆయన నేర ప్రవృత్తికి నిదర్శనమన్నారు. సైకోలను ప్రోత్సహించి ప్రజావ్యతిరేఖ విధానాలను నిర్వహించేందుకు ప్రజలపై ఉసిగొల్పుతున్నారని విమర్శించారు.

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు విపరీతంగా పెరిగాయన్నారు. వైసీపీ నాయకుల అండతో మాఫియా సంఘవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి రాష్ట్రాన్ని దోచుకున్నార న్నారు. కళాశాలల్లోనూ గంజాయి విక్రయాలు చేసి యువత, విద్యార్థులను చెడగొట్టే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కుటిల రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం గతంలో ఎన్నడూలేని విధంగా జరుగుతుందన్నారు. ప్రజారంజక పాలన చూసి ఏమిచేయాలో పాలుపోక వైసీపీ నాయకులు వెన్నుపోటు రాజకీయాలకు తెరతీశారని విమర్శించారు. ఇప్పటికైనా జగన్ తన వక్రబుద్ధిని మార్చుకోకుంటే ప్రజలు మరోసారి గుణపాఠం చెబుతారని డాక్టర్ లక్ష్మి హెచ్చరించారు.

గొడ్డలిపోటు దినం నిర్వహించుకోండి

» వైసీపీ నాయకులకు మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచన




మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, టీడీపీ నాయకులు

దర్శి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు వెన్నుపోటు దినంకు బదులు గొడ్డలిపోటు దినం నిర్వహించుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దర్శిలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెన్నుపోటు రాజకీయాలకు జగన్ పేటెంట్ అని చెప్పారు. బాబాయిని గొడ్డలి పోటుతో చంపించి గుండెపోటని డ్రామాలాడిన వైసీపీ నాయకులకు ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా ఇంకా బుద్ధిరాలేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంతప్పకుండా పింఛన్లు, జీతాలు ఇవ్వటంతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజాసంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వెన్నుపోటు దినం నిర్వహణకు పిలుపునివ్వటం శోచనీయమన్నారు. దర్శి నియోజకవర్గంలో వైసీపీ పాలనలో నిలిచిన అభివృద్ధి పథకాలు శరవేగంతో సాగుతున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, దారం సుబ్బారావు, శ్రీనాథ్, రూపినేని వెంకటరావు, ఊరిబిండి మధు పాల్గొన్నారు.

మదనవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

» రేపటి నుంచి పామూరులో నిర్వహణ



వేణుగోపాలస్వామి ఆలయ గాలిగోపురం

పామూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పామూరులో చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన రుక్మిణి సత్యభామ శ్రీమదనవేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఈనెల 13 వరకు జరగనున్నాయి. ఈ దేవస్థానానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆలయ ప్రాంగణంలో ఉన్న శిల్పాలు భారతీయ సాంస్కృతిక కళా నైపుణ్యానికి అద్దం పడుతాయి. ఈప్రాంతాన్ని తొలుత సీతారామపురం ఎస్టేట్‌గా పిలిచేవారు. ఈప్రాంతం మొదట కర్నాటక నవాబు పాలనలో, ఆతర్వాత శ్రీకాళహస్తి రాజా ఏలుబడిలో ఉన్నట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తుంది. పూర్వం ఈప్రాంతమంతా దట్టమైన అరణ్యంగా ఉండేది. అప్పటిలో రాజవారు విరువూరు వెళ్లి కోటలో బస చేసేవారు.

ఒక రోజు రాజు ఈప్రాంతానికి వేటకు వచ్చిన సందర్భంలో ఓసంఘటన చోటు చేసుకొంది. అడవిలో పుట్టపై డేగ వాలినప్పుడు పుట్టలో నుంచి పాము వచ్చి డేగను పుట్టలోకి లాగుతున్న దృశ్యాన్ని రాజు



స్వామివార్ల విగ్రహాలు

తిలకించారు. వెంటనే విల్లంబుతో డేగను కొట్టగా ఆ డేగను పాము తన పుట్టలోకి తీసుకెళ్లింది. ఆరోజు కోటలో విశ్రమించిన రాజకు స్వప్నం యందు వేణుగోపాలస్వామి కన్పించి పుట్టను తవ్వించి తనకు ఆలయం నిర్మించే ఏర్పాటు చేయమని చెప్పినట్టు స్థలపురాణం చెబుతుంది. పుట్టను తవ్వగా అందులో మదనవేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ విగ్రహాలు బయటపడ్డాయి. ఈస్థలంలో ఆలయం కట్టించి ఆలయ నిర్వహణకు వసతులు, భూములు కల్పించి తగిన సిబ్బందిని నియమించారు. ఆలయ ఉత్తర భాగాన వరదరాజుల స్వామి, తూర్పు భాగాన శ్రీపార్వతి సమేత వల్లీ భుజంగేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

మొదట్లో సర్పపురిగా పిలువబడే ఈగ్రామం కాలక్రమంలో పామూరుగా మారింది. ఆలయ నిర్వహణకు ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప జిల్లాలో వందల ఎకరాల భూములు ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని భూములు ఆక్రమణ చెరలో ఉండగా, మరికొన్ని భూములు అన్యక్రాంతమయ్యాయి. ఈ ఏడాది జేష్టశుద్ధ ఏకాదశిన పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు గురువారం వేద పండితులచే వేద సభ, శుక్రవారం శేషవాహన సేవ, శనివారం హనుమంతసేవ జరుగుతుంది. ఈనెల 12న అశ్వవాహన సేవ, 13న ఏకాంత సేవా కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతిరోజు సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు, గ్రామోత్సవం జరుగుతుందని ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం సత్యంబాబు తెలిపారు.

18 సంవత్సరాల అనంతరం జరగనున్న బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ సారధ్యంలో సీఐ భీమానాయక్ ఆధ్వర్యంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్‌ఐల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. రథోత్సవాల సందర్భంగా పట్టణంలో విద్యుత్ తీగలు తగలకుండా విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు శ్రీనివాసనగర్‌లో దేవతామూర్తుల ప్రతిష్ఠ

ముండ్లమూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో నాలుగు దేవాలయాలు ప్రతిష్ఠకు ముస్తాబయ్యాయి. బుధవారం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన కోదండ రామాలయం, రూ.10 లక్షలతో నిర్మించిన అంకాలమ్మ దేవాలయం, రూ.7 లక్షలతో నిర్మించిన పోలేరమ్మ ఆలయం, రూ.5 లక్షలతో నిర్మించిన బ్రహ్మంగారి దేవాలయం ప్రతిష్ఠకు సిద్ధమయ్యాయి. ఒకేరోజు నాలుగు దేవాలయాల్లో దేవతామూర్తులు కొలువుతీరనున్నారు. గత నెల 31 నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.



ముస్తాబైన శ్రీనివాసనగర్‌లోని రామాలయం

ఘనంగా పెద్దమ్మతల్లి తిరునాళ్ల

సీఎస్‌పురం(పామూరు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీఎస్‌పురంలో గత మూడు రోజుల నుంచి శ్రీ రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల వైభవంగా జరుగుతుంది. మంగళవారం అమ్మవారికి జలధి ఉత్సహంను భక్తులు ఘనంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకరశర్మ

ఉపాధిలో అవినీతికి పాల్పడితే కఠినచర్యలు

పీసీపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు సంబంధించి పలు ప్రాంతాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నిబంధనల మేరకు పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. పని చేసిన కూలీలకు త్వరితగతిన వేతనాలు చెల్లించేలా పేఆర్డర్ తీయించాలన్నారు. కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అలాగే కూలీలు సమయపాలన పాటించేలా వారికి అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఈనెల 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీవో జహంగీర్ బాషా, టీఏలు, ఎఫ్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల లేక విద్యార్థుల అవస్థలు

దొనకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని ఒబ్బాపురంలో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎయిడెడ్ పాఠశాలను గత వైసీపీ ప్రభుత్వం అనేక ఆంక్షల కారణంగా రెండేళ్ళ క్రితం మూసేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారులు ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు నాడు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఒబ్బాపురంలో ప్రభుత్వ పాఠశాల లేకపోవటంతో ఒబ్బాపురం, గుట్టమీదపల్లి ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సుదూర ప్రాంతంలో ఉన్న బ్రహ్మారావుపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. బ్రహ్మారావుపేటలోని ప్రాథమిక పాఠశాలలకు ఈప్రాంత విద్యార్థులు వెళ్లాలంటే రైల్వే ట్రాక్ అవతల సుమారు కిలోమీటర్ దూరం వెళ్లాల్సి ఉంది.

ఒబ్బాపురం ఎస్సీ కాలనీ సమీపంలోని అరబస్తాన్ వీధిలో మూతబడి న ప్రభుత్వ పాఠశాలను తిరిగి ఏర్పాటుచేయాలని అప్పటి అధికారులకు, పాలకులకు వినతిపత్రం అందించినా ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

పామూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో కరణాకుమారి, కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పి.సరోజ పేర్కొన్నారు. కిశోరి వికాసం, వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా పామూరు సెక్టార్ పరిధిలోని విరాట్‌నగర్, తూర్పుకోడిగుడ్లపాడు అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరపరాదన్నారు. విరాట్ నగర్ అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో ఆరుగురు డ్రాపవుట్ బాలికలను గుర్తించారు. కస్తూర్భా విద్యాలయంలో చేరి చదువుకోవాలన్నారు. అనంతరం కిశోరి బాలికలతో బాల్య వివాహం చట్టరీత్యా నేరమని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ జి.పద్మజ, సచివాలయ సిబ్బంది, కస్తూర్భా విద్యాలయం ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో తొలగిన విద్యుత్ కష్టాలు

పామూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పామూరులోని 33/11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 5ఎంవీఏ మెగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మూడు రోజల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో గత మూడు రోజుల నుండి రాత్రి వేళల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయంపై ఇన్‌చార్జ్ ఏఈ షేక్ జిలానిబాషా మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో ఉంటే రెండు ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్‌లలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో విద్యుత్ సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారుల సహకారంతో కాలిపోయిన స్థానంలో నూతన 5 ఎంవీఏ మెగా ట్రాన్స్‌ఫార్మర్‌ను మూడు రోజులు సిబ్బంది కష్టపడి ఏర్పాటుచేశారన్నారు. దీంతో విద్యుత్ సమస్య పరిష్కారమైందన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ముండ్లమూరు విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ముండ్లమూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన కంచుమాటి ఏడుకొండలు, సుభాషిణిల కుమారుడు అజయ్‌కుమార్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో 75వ ర్యాంకు సాధించాడు. అజయ్‌కుమార్ 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో చదివారు. అలాగే, చింతలపూడి గ్రామానికి చెందిన కోయ సుబ్బారావు, రమాదేవిల కుమారుడు రె.రెశ్వంత్ ఆల్ ఇండియా స్థాయిలో ఈడబ్ల్యూఎస్ కోటాలో 205వ ర్యాంకు సాధించారు. 7 నుంచి ఇంటర్ వరకు విజయవాడ శ్రీ చైతన్య చదివాడు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు అభినందించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తాము కంప్యూటర్ సైన్స్ చేస్తామన్నారు.

నాగంబొట్లపాలెంలో అన్నిపార్టీల నేతలతో ఫ్లెక్సీ ఏర్పాటు



నాగంబొట్లపాలెంలో అన్నిపార్టీల నేతలతో వెలసిన ఫ్లెక్సీ

తాళ్లూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో యర్రబోలు పేరిరెడ్డి అనే యువకుడు గ్రామకూడలిలో అన్ని పార్టీల నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మాజీముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎంఐఎం నేత అసరుద్దీన్ ఓవైసీ చిత్రాలతో ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. అందరూ కలిసిమెలిసి ఉండాలంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

ముండ్లమూరులో ర్యాలీ



ముండ్లమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ జాస్మిన్, సిబ్బంది

ముండ్లమూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి ఎం.జాస్మిన్ మాట్లాడుతూ మనందరిలో మార్పుతో మలేరియా నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నారాయణరావు, నాగార్జున, సూపర్‌వైజర్ సుబ్బారావు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

4-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	39	28
బాపట్ల	39	29
రెంటచింతల	40	29
చీరాల	39	29



రేపు వనమహోత్సవం

- అనంతవరానికి రానున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్
- పార్కులో రెండు వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కలెక్టర్ భార్గవతేజ

తుళ్లూరు (అనంతవరం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజధాని అమరావతి పరిధిలోని అనంతవరంలో గురువారం నిర్వహించే వనమహోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కులో రెండు వేల మొక్కలు నాటనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంతో అనంతవరం ఎన్-15, ఈ-6 రోడ్డు జంక్షన్‌లోని పార్కులో ఏడీసీ, సీఆర్డీఏ, అటవీశాఖ అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకటపాలెం సెంట్రల్ పార్కు, పేరేచర్ల నర్సరీల నుంచి అనంతవరానికి మొక్కలను తెప్పిస్తున్నారు. ఆయా ఏర్పాట్లను మంగళవారం తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజ పరిశీలించారు.



మొక్కలు నాటే ప్రాంతంలో పనులు చేస్తున్న యంత్రాలు

జీడీసీసీబీకి త్వరలో సభాసంఘం

- రికార్డులు అందుబాటులో ఉంచాలని ఆదేశం
- విచారణకు రానుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

గుంటూరు సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) అక్రమాలపై విచారణకు సభా సంఘం త్వరలో రానున్నది. రికార్డులు అందుబాటులో ఉంచాలని బ్యాంకు అధికారులకు సమాచారం కూడా అందింది. వారం, పది రోజులలోపే సభా సంఘం వచ్చే అవకాశం ఉందని ఉన్నతస్థాయి అధికారులు కూడా ధ్రువీకరించారు. వైసీపీ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జీడీసీసీబీలో బోలెడు అక్రమాలు జరిగాయి. 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాల్లో సుమారు రూ.420 కోట్లు గల్లంతైనట్లు ఆరో పణలు ఉన్నాయి. 17 సహకార సంఘాల్లో జరిగిన అవినీతిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. వీటిపై విచారణ చేపట్టాలని సహకార అధికారులు ఉన్నత అధికారులకు లేఖలు రాసినా ప్రయోజనం లేకుండా పోయింది. జీడీసీసీ అక్రమాలపై సభా సంఘం వేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో పొన్నూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సభా సంఘం వేస్తున్నట్లు మార్చి 20న ప్రకటించింది. ఈ సభా సంఘం ప్రస్తుతం విచారణకు రానుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి.



క్రిమినల్ కేసులకు ఉపక్రమించిన సహకార శాఖ

ఇదిలా ఉంటే సహకార శాఖ కూడా జీడీసీసీ అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమించింది. 17 సహకార సంఘాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయటం కలకలం రేపుతుంది. అప్పట్లో వైసీపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తిన కొందరు ఇప్పుడు ఏమి తెలియదు అన్నట్లుగా ఉద్యమాలు చేస్తుండటం చర్చకు దారితీస్తుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ముఖ్యమంత్రి హామీలను పూర్తిచేయాలి

- కొత్తగొల్లపాలెం అభివృద్ధి పనులపై సమీక్షలో కలెక్టర్

బాపట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏప్రిల్ 1న చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం పర్యటనలో ఇచ్చిన హామీలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రిని గ్రామస్థులు కోరిన సదుపాయాలు, వాటి పురోగతిపై కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. కొత్తగొల్లపాలెంలో అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. 43 మందికి గృహ, 13 మందికి ఇళ్ల స్థలాలకు సంబంధించి పొజిషన్‌తో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు అందజేసినట్లు తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. 17 మరుగుదొడ్లకి ప్రతిపాదనలు రాగా రెండు పూర్తి చేసినట్లు తెలిపారు. 304 కుళాయి కనెక్షన్ల పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామానికి మంజూరైన 131 నీటిగుంటల పనులు జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తెలిపారు. 4.48 కిలోమీటర్ల అంతర్గత సిమెంట్‌రోడ్లు, బీటీ రోడ్ల పనులను త్వరలో ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. పర్చూరు నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ట్రాన్స్‌కో ఈఈ తెలిపారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, గృహనిర్మాణసంస్థ పీడీ వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, విద్యుత్‌శాఖ ఏఈ మల్లికార్జునరావు, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి ఈబీ విలియమ్స్, సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, సమగ్రశిక్షాభియాన్ ఏపీడీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.82 కోట్లు దుర్వినియోగం

- తేల్చిన పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్
- భట్టిప్రోలులో నలుగురు కార్యదర్శులపై వేటు

బాపట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలు గ్రామ పంచా యతీ పరిధిలో 2020 నుంచి 2024 మధ్య రూ.1.82 కోట్లు దుర్వి నియోగం జరిగినట్లు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ విచా రణలో తేలింది. నలుగురు కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేస్తూ మంగళవారం పంచాయతీరాజ్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. వెంకటేశ్వర్లు, ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే శ్రీనివాసరావు, సతీష్‌బాబు లను సస్పెండ్ చేయగా ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లపై చర్యల కు రంగం సిద్ధమైనట్లు సమాచారం. గత ప్రభుత్వంలో పంచా యతీ పరిధిలో వైసీపీ నేతల అండతో నిధులు దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులతో గుంటూరు జడ్పీ సీఈవోను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. విచారణలో నిధులు దుర్వినియోగం వాస్తవమేనని జడ్పీ సీఈవో తేల్చారు.

దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్

- రేషన్‌షాపులను సందర్శించిన ఆర్డీవో గ్లోరియా

బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ లబ్ధిదారులకు వారిళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందజేస్తామని ఆర్డీవో గ్లోరియా తెలిపారు. బాపట్లలోని బేతనీకాలనీలో, పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలో మంగళవారం రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన అనంతరం ఆర్డీవో దివ్యాంగ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిత్యావసర వస్తువులు అందజేశారు. కర్లపాలెంలోని పాలకేంద్రం వద్ద ఉన్న రేషన్ దుకాణంలోనూ ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో బాపట్ల తహసీల్దార్ షేక్.సలీమా, సివిల్ సప్లై డీటీ ఫణికుమార్, పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, కర్లపాలెం తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



బేతనీకాలనీలో దివ్యాంగుల ఇంటికే వెళ్లి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు

ట్రేడర్ల ఉచ్చులో బర్లీ రైతు!



ప్రభుత్వ ఆదేశాలు భేఖాతరు..



తీసికట్టు ధరలకు పర్చూరులో పొగాకు కొనుగోలు చేస్తున్న కంపెనీలు

- తక్కువ ధరలకు రైతుల నుంచి కొనుగోలు
- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలది అదే వైఖరి
- అయినకాడికి అమ్ముకుంటున్న కర్షకులు
- ప్రభుత్వ విభాగాల పర్యవేక్షణ కరువు
- రెండో వారంలో రంగంలోకి మార్క్‌ఫెడ్

(బాపట్ల, పర్చూరు- ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు వ్యవసాయశాఖ మంత్రి ఆదేశాలను ప్రతిబింబించక పోగా ట్రేడర్స్ ఉచ్చులో చిక్కుకుని బర్లీ రైతు విలవిల్లాడిపోతున్నాడు. ఈ పదిరోజుల వ్యవధిలోనే దాదాపు 60 వేల క్వింటాలు బర్లీ పొగాకు ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు క్షేత్రస్థాయి గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. రూ.3 వేలు మొదలుకుని గరిష్ఠంగా రూ.8 వేలు ధర చెల్లించే ఈ కొనుగోళ్లు జరిగినట్లు రైతులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ మంత్రి దాదాపు 20 కంపెనీలతో సమావేశం నిర్వహిస్తే 15 కంపెనీలు ఇప్పటికీ ఫీల్డ్ లెవెల్లో ఒక్క క్వింటా కొన్న దాఖలాలు లేవు. జీపీఐ, ఐటీసీ, కార్డెల్ టుబాకోస్ వంటివి మాత్రం అరకొరగా కొనుగోళ్లు జరుపుతున్నా ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రం (మిగతా 6వ పేజీలో)

'గ్రేడ్ల పేరిట బర్లీ పొగాకు రైతులను ఇబ్బంది పెట్టవద్దు. రెండే రకాలు.. లోగ్రేడ్ పొగాకు రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ఇవ్వాలి. మీడియం, హై క్వాలిటీ రకానికి రూ.12 వేలు ధర ఇవ్వాలి. ఈ ఆదేశాల ను పొగాకు కంపెనీలు తప్పనిసరిగా పాటించాల్సిందే. అరకొరగా కొనుగోలు చేసి చేతులు దులుపుకుంటామంటే కుదరదు. చివరి ఆకు వరకు కంపెనీలు కొనుగోలు చేయాల్సిందే.' వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సరిగ్గా పదిరోజుల కిత్రం మార్టూరులో పొగాకు కంపెనీలతో జరిపిన సమావేశంలో జారీ చేసిన ఆదేశాలివి. కానీ, ఇప్పటి వరకు 60 వేల క్వింటాల బర్లీ పొగాకు ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు క్షేత్రస్థాయి గణాం కాలు ధ్రువీకరిస్తున్నాయి. అది కూడా రూ.3 వేలు మొదలుకుని గరిష్ఠంగా రూ.8 వేలు ధర చెల్లించే ఈ కొను గోళ్లు జరిగినట్లు రైతులు చెబుతున్నారు.



గేట్లు పెట్టడంతో నిండుగా ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్

గేట్లు పూర్తిచేసి.. నీటిని నిల్వచేసి

- గొట్టిపాటి చొరవతో గుండ్లకమ్మకు గేట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

మేదరమెట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పట్టించుకోకుండా పక్కన పడేసిన గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రస్తుతం జలసందడి చేస్తోంది. కనీస మరమ్మతులపై కూడా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించగా కూటమి ప్రభుత్వంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని నూతనంగా 15 గేట్ల నిర్మాణం చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి రవికుమార్‌కు రైతులు, తాగునీటి అందుకునే ఒంగోలువాసులు, 100 గ్రామాలకు పైగా ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తాగు, సాగు నీటికి ప్రధాన వనరైన గుండ్లకమ్మ రిజర్వాయర్ గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో నీరులేక ఎండిపోయింది. 2022 ఆగస్టులో 3వ నంబరు గేటు, 2023 డిసెంబరులో 2వ నంబరు గేటు కొట్టుకుపోయింది. దీంతో రిజర్వాయర్‌లోని నీటితోపాటు రూ.కోట్ల మత్స్య సంపద సముద్రంపాలైంది. గేట్లకు సరైన మరమ్మతులు చేయకపోవడం వల్లే గేట్లు కొట్టుకుపోయినట్లు నిపుణులు తేల్చగా మరమ్మతులకు టెండర్ పిలిచి నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఆయకట్టు రైతులు రెండేళ్లు పంటలు నష్టపోయారు. అయినా గత ప్రభుత్వం నీటిని ఆపేందుకు కనీస చర్యలు కూడా తీసుకోలేదు. రిజర్వాయర్‌లోని ఇసుకను దోచుకోవడానికే గేట్ల నిర్మాణం చేపట్టలేదని అప్పట్లో ఆయకట్టు రైతులు ఆరోపించారు. తమ్మవరం, అనమనమూరు, మణికేశ్వరం తదితర గ్రామాల పరిధిలో రిజర్వాయర్‌లోని ఇసుకను డ్రెజ్జర్లతో తోడుకువెళ్లడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి గొట్టిపాటి రవికుమార్ రిజర్వాయర్‌పై ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. రిజర్వాయర్‌లోని 15 గేట్ల నిర్మాణానికి రూ.9.17 కోట్లు అంచనాలతో టెండర్లు పిలవగా రూ.6.56 కోట్లతో పనులు చేయడానికి కాంట్రాక్టరు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో వారం, వారం పనుల పురోగతిని తెలుసుకుని పనులు ఆగకుండా ఎప్పటికప్పుడు బిల్లులు నిధులు మంజూరు చేయించి గేట్లు త్వరగా పూర్తి కావడానికి మంత్రి గొట్టిపాటి కృషి చేశారు. గేట్లను అమర్చడంతో రిజర్వాయర్‌లో 3.8 టీఎంసీల నీటిని నిల్వచేశారు. ఆయకట్టులోని రైతులకు సాగునీటిని డిసెంబరు నుంచే విడుదల చేశారు. ప్రస్తుతం జూన్ మాసం చివరిలోనూ గుండ్లకమ్మలో పుష్కలంగా నీరు ఉంది. దీంతో అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని తాగునీటి చెరువులకు ఇబ్బంది లేకుండా పోయింది.

రూ.100 కోట్లు భూమి అన్యాక్రాంతం

- ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రభుత్వం దృష్టి
- స్వాధీనం చేసుకోవాలని ఆర్డీవోకు మంత్రి గొట్టిపాటి సూచన

అద్దంకి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో సుమారు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు పరాధీనమయ్యాయి. రెండు దశాబ్దాల కు పూర్వం సింగరకొండ రోడ్డులోని 15 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. నామ్ రోడ్డు ఏర్పాటు తర్వాత వీటి విలువ భారీగా పెరిగింది. ఈ భూముల్లో భారీ నిర్మాణాలు జరిగాయి. ఈ క్రమంలో భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు స్థలాలు అందుబాటులో లేని విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గుర్తించారు. ప్రభుత్వ స్థలాలపై మంగళవారం చీరాల ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడుతో మంత్రి సమీక్షించారు. అద్దంకి పట్టణంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుతో సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఆధార్ నవీకరణకు అగచాట్లు!



చంటి పాపతో వచ్చిన మహిళ

- ప్రైవేట్ కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ
- ఇష్టారాజ్యంగా డబ్బు వసూలు
- చిన్నపిల్లలతో తల్లిదండ్రుల పడిగాపులు
- చేతులెత్తేసిన ప్రభుత్వ యంత్రాంగం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఆధార్ తప్పని సరి. ఆధార్ నవీకరణకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రైవేట్ ఆధార్ కేంద్రాల వద్ద బాలింతలు చంటి పిల్లలతో పడిగాపులు కాస్తు న్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నవీకరించాల్సి ఉండగా యంత్రాంగం చేతులెత్తేసింది. గతంలో పోస్టాఫీసుల్లో ఆధార్ నవీకరణ కేంద్రాలు ఉండేవి. వీటిని కూడా (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేటలోని ప్రైవేట్ ఆధార్ కేంద్రంలో చిన్నారులతో తల్లిదండ్రుల పడిగాపులు

ప్రయాసగా మారిన ఫాం పాండ్ల నిర్మాణం

అవగాహన లేక నిరాకరిస్తున్నరైతులు

లక్ష్యసాధనలో చీమకుర్తి మండలం వెనుకబాటు

రాష్ట్ర అధికారి ఆగ్రహం వ్యక్తం చేసినా ముందుకు కదలని అధికారులు

చీమకుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉదాత్త ఆశయంతో తలపెట్టిన ఫాం పాండ్ల నిర్మాణపనులు చీమకుర్తి మండలంలో మందకొడిగా సాగుతున్నాయి. రైతుల్లో అవగాహన లేమి, వారికి అవగాహన కల్పించటంలో అధికారుల వైఫల్యం వెరసి లక్ష్యసాధనలో వెనుకబాటుతనం వెంటాడుతోంది. రాష్ట్ర స్థాయి అధికారి ప్రత్యేకంగా మండలాన్ని విజిట్ చేసి పొలాల్లో నీటి కుంటల నిర్మాణం నత్తనడకన సాగుతుండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవటం గమనార్హం.

చీమకుర్తి మండలానికి 314 ఫారం పాండ్లను మంజూరయ్యాయి. వాటిల్లో ఇప్పటివరకు కేవలం 36 మాత్రమే పూర్తయ్యాయి. మరో 61 నిర్మాణదశలో ఉన్నాయి. మిగతా వాటి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వాటిని నిర్ణీత కాలంలోపు పూర్తిచేయటం దుర్లభంగా మారింది. నిర్మాణాలలో వెనుకబాటుతనానికి ప్రధాన కారణం రైతులు నిరాసక్తత ప్రదర్శించటమే కనిపిస్తోంది. ఐదెకరాలలోపు పొలం ఉన్న రైతుల పొలాల్లో మాత్రమే కుంటల నిర్మాణం చేపట్టాలని నిబంధన ఉండటం, తమకున్న కొద్దిపాటి పొలంలో కుంటలు నిర్మిస్తే ఎలా అంటూ వారు వెనకడుగు వేస్తున్నారు. రైతుల ఇష్టం లేకుండా నిర్మాణం చేపట్టలేని పరిస్థితి. ఫాం పాండ్స్ నిర్మాణం వలన కలిగే ప్రయోజనాలతో పోలిస్తే పంట సాగు విస్తీర్ణం తగ్గినా నష్టం లేదన్న విషయాన్ని రైతులకు కూలంకషంగా అవగాహన కల్పించి నిర్మాణాల లక్ష్యసాధన వైపు అధికారులు అడుగులు వేయాల్సి ఉంది.

మండలంలోని బూదవాడ తదితర ప్రాంతాల్లో కొంతమేర తవ్వకాలు చేశాక రాయి తగిలి నిర్దేశించిన లోతు కూలీలు తవ్వలేకపోతుండలేకపోవటం కూడా సమస్యగా మారింది. దీంతో నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. ఉపాధి కూలీలు కూడా కుంటల తవ్వకాలకు పెద్దగా ఆసక్తి చూపకపోవటం కూడా మరో కారణం. ఇటీవల రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీనాథ్, డ్వామా పీడీ, ఏపీడీ, మండల అధికారులతో కలిసి మండలంలోని మంచికలపాడు, మువ్వావారిపాలెం గ్రామాల్లో ఫారం పాండ్ల నిర్మాణాలను పరిశీలించారు. లక్ష్యసాధనలో బాగా వెనుకబడి ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్ణీత సమయంలో లక్ష్యం విధించిన నిర్మాణాలను పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో కుంటల నిర్మాణాల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి లక్ష్యసాధనవైపు అడుగులు వేగంగా వేయాల్సిన అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పూర్తిస్థాయిలో కార్యాచరణ రూపొందించి, గ్రామాల్లో రైతులకు నచ్చచెప్పి, కుంటల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.


బూదవాడలో అర్ధంతరంగా నిలిచిన ఫాం ఫాండ్


పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

అవరోధాలను అధిగమిస్తున్నాం

రాఘవ, ఏపీవో, చీమకుర్తి

మండలంలో ఫాం పాండ్ల నిర్మాణంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయటంలో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. చాలా గ్రామాల్లో రాయి పడి తవ్వకాలు ముందుకుపోక అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి. ఉన్నతాధికారుల మార్గ నిర్దేశకత్వంలో నిర్మాణాలను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తపట్నం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఈతముక్కల సూరారెడ్డిపాలెం రహదారిలో మంగళవారం జరిగింది. ఈతముక్కల నుంచి సంకువానిగుంట వైపు రోడ్డు పక్కనే నడిచివెళుతున్న గుర్తుతెలియని వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం పేరంటాళ్ల కుంట సమీపంలో ఢీ కొట్టింది. దీంతో రోడ్డు పక్కనే పడిపోయి ప్రాణపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికులు గుర్తించి 108 వాహనం ద్వారా ఒంగోలులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతిచెందాడు. మృతుని వివరాలు కూడా తెలియలేదు. కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శవ, కుల రాజకీయాల్లో జగన్‌రెడ్డి దిట్ట

● బాబాయ్ మృతిపై రెండు మాటలు చెప్పు ● డోర్ డెలివరీలు, సజీవ దహనాలపై పరామర్శలు ఏమయ్యాయి జగన్ ?

జగన్ ప్రభుత్వంలో ఘోర హత్యలపై ఎందుకు నోరు మెదపలేదు ?

తెనాలి పర్యటనపై లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్యరావు ఆగ్రహం

చీరాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : 'జగన్‌రెడ్డి అధికారంలోకి రావాలంటే తండ్రి మరణించాలి. బంధువులను తృప్తి పరచాలంటే బాబాయ్ చావాలి. అదృష్టవంతులు కాబట్టే తల్లీ, చెల్లీ దూరంగా ఉండి బతికి బట్టకట్టారు. లేకుంటే వారికీ ఎప్పుడో ఫొటో కట్టేవాడు' అని ఆంధ్రప్రదేశ్ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు తెనాలిలో జగన్ పర్యటనపై విమర్శలు గుప్పించారు. వైసీపీ హయాంలో బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో అక్కను వేధిస్తున్న ఆకతాయిలను తమ్ముడు నిలదీస్తే దుర్మార్గులు బాలుడిని సజీవ దహనం చేసిన విషయం గుర్తు చేశారు. అలాగే అప్పటి ఆ పార్టీ ఎమ్మెల్సీ ఒక దళిత వ్యక్తిని క్రూరంగా చంపి డోర్ డెలివరీ చేస్తే జగన్ నోరు మెదపలేదన్నారు. రాజమండ్రిలో యువతిని పదిరోజులు అత్యాచారం చేసి పోలీస్‌స్టేషన్ ముందే వదిలేస్తే అప్పుడు జగన్ నోరు మూగబోయిందని ఆగ్రహించారు. కృష్ణానదిని వీక్షించేందుకు వచ్చిన నూతన వధువును భర్త ముందే రేప్ చేస్తే రాష్ట్రం నివ్వెర పోయిందన్నారు. కానీ జగన్ ప్యాలెస్ నుంచి బయటకు రాలేదని వివరించారు. డాక్టర్ సుధాకర్‌ను చిత్రహింసలు చేసి చావుకు కారణమయ్యారని మాట్లాడారు. చంద్రయ్యను ఘోరంగా హత్య చేస్తే జగన్ ఎందుకు మాట్లాడలేదని అన్నారు. పలు కేసుల్లో ఉండి, గంజాయి మత్తులో ప్రజలను భయభ్రాంతులుగా చేస్తున్న నేరగాళ్లకు పోలీసులు భయం కలిగించేందుకు బుద్ధి చెబితే జగన్ కొత్త నాటకానికి తెరలేపి, కులం కార్డు బయటకు తీస్తున్నట్లు విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన దళిత, గిరిజన చావులకు సమాధానం చెప్పు జగన్ అంటూ ఆగ్రహించారు. జగన్ పరామర్శించిన వేము నవీన్ అలియాస్ కిల్లర్ 9 కేసులు, చేబ్రోలు జాన్ విక్టర్‌పై 6 కేసులు, దోమ రాకేష్‌పై 7 కేసులు ఉన్నట్లు చెప్పారు. వీరి వలన అమాయక ప్రజలు భీతిల్లుతున్నట్లు చెప్పారు. ఇంతటి సంఘసంస్కర్తలను పరామర్శించిన చరిత్ర జగన్‌కే సాధ్యమని ఎద్దేవ చేశారు. జీర్ణించుకోవడానికి ఆహారం తినాలి గానీ, రక్తపు ముద్దలు కాదని, ఇవి జగన్‌కే సాధ్యమని లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్యరావు ఆగ్రహజ్వాలలు గుప్పించారు.


జగన్‌పై విరుచుకుపడిన లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

పొగాకు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రిన్సిపల్ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి

ఎట్టకేలకు ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి కృషి

నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

జూన్ రెండో వారంలో కొనుగోలు ప్రారంభం

పర్చూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. జూన్ రెండో వారం నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్‌తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ అయ్యారు. పొగాకు సమస్య తీవ్రతరంగా ఉందని తక్షణమే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రిన్సిపల్ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. పొగాకు కొనుగోలుకు శ్రీకారం చుట్టాలని కోరారు. రేపు క్యాబినేట్‌లో సైతం పొగాకు కొనుగోలుపై చర్చిస్తామన్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం జూన్ రెండో వారంలో కొనుగోలు చేసేవిధంగా రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సుముఖత చూపింది. ఇప్పటికే రాష్ట్ర మార్కెటింగ్ శాఖ క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందించామన్నారు. పర్చూరు, మార్టూరు, ఇంకొల్లు మార్కెట్ యార్డులలో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.


వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడుతున్న ఏలూరి

గోడౌన్‌లను పరిశీలించిన మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ

పర్చూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు పండించిన పంటను కంపెనీలు కొనుగోలు జరగక రైతులు తీవ్రఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. రైతులను ఆదుకోవాలన్న సంకల్పంతో అడుగులు వేస్తోంది. అందులో భాగంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకును కొనుగోలు చేయాలని అందుకు సంబంధించి గౌడౌన్‌లను పరిశీలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పర్చూరులోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లోని గోడౌన్లను బాపట్ల జిల్లా డీఎం కె. కరుణశ్రీ అధికారులతో కలిసి పరిశీలించారు. గౌడోన్‌లోని వసతులు, ఇన్‌ఫ్రాస్టక్చర్, సిబ్బంది, సామర్థ్యం తదితర అంశాలను స్థానిక ఏఎంసీ ప్రత్యేక కార్యదర్శి దేవరకొండ తిరుపతిరాయుడును అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.మోహనరావు, ఏవో రామమ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ కార్యదర్శి ప్రసాద్, స్థానిక రైతులు కొల్లా శ్రీనివాసరావు, పోట్రు శోభన్, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, అడ్డగడ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ

ఇంటర్ స్టేట్ ర్యాంకర్‌కు ఎన్టీఆర్ ట్రస్ట్ సాయం

కంభం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : 2025 మార్చి ఇంటర్ ఫలితాల్లో హెచ్ఈసీ గ్రూపులో 980/1000 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కంభం ప్రభుత్వ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్య రాష్ట్ర షైనింగ్ స్టార్ అవార్డు పొందిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 15న జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో మంత్రి నారా లోకేష్ తమ్మినేని చాతుర్య ప్రతిభను, కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమె అభ్యర్థన మేరకు చాతుర్య లక్ష్యాన్ని అధిగమించేందుకు వీలుగా సివిల్ సర్వీస్‌తో కూడిన డిగ్రీ విద్యను ఉచితంగా అభ్యసించేందుకు ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ గండిపేట ఎన్టీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో చదువుకునేందుకు అవకాశం కలిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్‌కు సమాచారం అందింది. మానవ వనరుల శాఖ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఉత్తర్వులను చాతుర్యకు మంగళవారం జిల్లా ఆర్ఐవో సైమన్‌విక్టర్ అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు తిరుమలయ్య, శిరీష కుమారి, శివలక్ష్మమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.


చాతుర్యకు ఉత్తర్వులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు

● జేసీ గోపాలకృష్ణ


రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో వృద్ధులు, దివ్యాంగులకు రేషన్‌షాపుల ద్వారా ఉచితంగా బియ్యం, చెక్కరను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ డోర్ డెలివరీ చేశారు. మంగళవారం రాత్రి ఒంగోలులోని 32 రేషన్‌షాపు పరిధిలోని వృద్ధులు, దివ్యాంగులకు రేషన్‌షాపు ద్వారా వారి ఇంటికి చేర్చారు. ప్రభుత్వం ఈనెల నుంచి రేషన్‌షాపుల ద్వారా రేషన్‌సరుకుల పంపిణీని పునఃప్రారంభించింది. ఈనేపథ్యంలో 65 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్లు వారి నివాసాలకే వెళ్లి సరుకులు ఇవ్వాలని ఆదేశించడంతో తదనుగుణంగా జేసీ గోపాలకృష్ణ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

అతి వేగం, రాంగ్‌రూటే ప్రమాదానికి కారణం

స్టూవర్టుపురం మృతుల ఘటనపై జిల్లా రోడ్డు భద్రతా కమిటీ పరిశీలన


ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న అధికారులు

కొమరోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అతివేగం, రాంగ్‌రూటే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని జిల్లా స్థాయి రోడ్డు సేఫ్టీ అధికారులు గుర్తించారు. మండలంలోని తాటిచర్ల మోటులో గత నెల 23న జరిగిన కారు - లారీ ప్రమాదం జరిగిన ఘటన ప్రదేశాన్ని మంగళవారం జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ అధికారులు పరిశీలించారు. మండలంలోని తాటిచర్ల మోటులో గత నెల 23న జరిగిన కారు-లారీ ప్రమాదంలో బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. దీనిని సుమోటోగా తీసుకుని ఘటనపై విచారణ కమిటీ వేసి ఈనెల 30లోపు నివేదిక పంపాలని సుప్రీంకోర్టు రోడ్డు సేఫ్టీ విభాగం సెక్రటరీ సంజయ్ మిట్టల్‌ను ఆదేశించింది. ఈమేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి సుశీల, ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ పర్వతేశం, మార్కాపురం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, గిద్దలూరు సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ సుధాకర్ అధికారులు కలసి విచారణ చేపట్టారు. ప్రమాద తీరుతెన్నులను గుర్తించారు. అతివేగం, రాంగ్‌రూటులో ప్రయాణించడం, నిద్రమత్తులో ఉండడం వంటివి ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. నివేదికను ప్రభుత్వానికి పంపనున్నామని తెలిపారు.

అపీఇపీ

ఆధార్ నవీకరణకు అగచాట్లు!

(5వ పేజీ తరువాయి)

మూసి వేశారు. వేలాది మంది చిన్నారుల ఆధార్ నవీకరించాల్సి ఉంది.

ప్రభుత్వం సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో ఆధార్ నవీకరణ లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. వేలిముద్రలు, చిరునామా, వ్యక్తిగత చిత్రం, మొబైల్ నంబరు, ఇతర దోషాల సవరణకు సంబంధిత ప్రైవేట్ ఆధార్ కేంద్రాల వద్ద తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొత్తగా పెళ్లి అయినవారు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేం దుకు ఆధార్‌లో చిరునామా మార్చుకొవాలి.

పిల్లలకు నవీకరణ తప్పనిసరి..

పిల్లలకు ఆధార్ నవీకరణ తప్పనిసరి. ఆధార్ తీసుకున్న 15 ఏళ్లలోపు వారి వేలి ముద్రలను నవీకరించుకోవాలి. 16 నుంచి 18 ఏళ్ల మధ్యలో వేలి ముద్రలు, కనుపాపల పునర్‌స్వీరణ తప్పనిసరి. ఇలా చేసుకుంటేనే విద్యార్థులకు వివిధ పరీక్షలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. తగిన ధ్రువ పత్రాలను అప్‌లోడ్ చేస్తేనే నవీకరణ ప్రక్రియ సజావుగా సాగుతుంది. గతంలో సబంధిత పత్రాల నమోదు కాకపోవడం ఇతర సాంకేతిక కారణాలతో చాలా వరకు తిరస్కరణకు గురయ్యాయి.

నవీకరణకు అధిక వసూళ్లు..

గతంలో ఆధార్ నవీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. ఇటువంటి పరిస్థితి ప్రస్తుతం లేదు. దీంతో ఆధార్‌లో మార్పులు చేసేందుకు కొన్ని ప్రైవేటు కేంద్రాల్లో రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. వీటిపై అధికారులు పర్యవేక్షణలేదు. ఇప్ప టికైనా అధికారులు ఆధార్ నవీకరణ కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహిం చాలని బాధితులు కోరతున్నారు. నవీకరణ కాకపోతే పథకాలను కోల్పోతామన్న ఆందోళన సర్వాత్రా నెలకొంది.

ట్రేడర్ల ఉచ్చులో బర్లీ రైతు!

(5వ పేజీ తరువాయి)


ఉప్పుటూరులో నిల్వ ఉంచిన పొగాకు

అమలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ధర విషయంలో కంపెనీలు న్యాయం చేస్తాయనే ఆశ తమకు చచ్చిపోయిందని అందుకే ప్రైవేట్ ట్రేడర్స్‌కు అయినకాడికి అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు. నిజానికి ట్రేడర్స్ కొనే ఈ పొగాకు కూడా అంతిమంగా పొగాకు కంపెనీల వద్దకు చేర్చవల్సిందే. ప్రభుత్వం వైపు నుంచి కంపెనీలపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో సాధ్యమైనంత పొగాకు నిల్వలను ముందు గ్రామాల నుంచి ఖాళీ చేయించే ఎత్తుగడలో భాగంగానే పెద్ద ఎత్తున ట్రేడర్స్‌ను కంపెనీలే రంగ ప్రవేశం చేయించాయన్న ఆరోపణ కూడా రైతులు చేస్తున్నారు.

కనిపించని పర్యవేక్షణ

మరో వైపు కంపెనీలు జరిపే పొగాకు కొనుగోళ్లలో పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత వ్యవసాయశాఖతో పాటు మార్క్‌ఫెడ్‌దేనని ప్రభుత్వం తెలిపింది. ధరల అమలుతో పాటు రోజువారీ కొనుగోళ్లకు సంబంధించి నివేదికలను కూడా ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేయాలనే ఆదేశాలను కూడా జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పొగాకు కొనుగోళ్లను మానిటర్ చేసే వ్యవస్థల జాడే కరువైంది. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కంపెనీలు బర్లీ పొగాకును కంపెనీలు కొనడం లేదని నిర్ణయానికి వచ్చిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఈ నెల రెండోవారం నుంచి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి పొగాకు కొనుగోళ్లను జరపడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

తీసికట్టుగానే కొనుగోళ్లు...

బాపట్ల, పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 5.10 లక్షల క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నట్లు రెండు వారాల క్రితం ప్రభుత్వం గుర్తించింది. ఇందులో బాపట్ల జిల్లా వాటానే 3.88 క్వింటాళ్లుగా ఉంది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మే 24న మార్టూరులో పొగాకు కంపెనీలతో నిర్వహించిన సమీక్షలో చివరి ఆకు వరకు కొనాలనే ఆదేశాలను జారీ చేశారు. ఈ పది రోజుల వ్యవధిలో జీపీఐ కంపెనీ 2,500 మెట్రిక్ టన్నుల బర్లీని రైతుల వద్ద కొనుగోలు చేయగా, ఐటీసీ 600 టన్నులను కొనుగోలు చేసింది. కార్వెల్ టుబాకోస్ 1,900 టన్నులను కొనుగోలు చేయగా, మహమ్మద్ ఎంటర్‌ప్రైజెస్ 865 టన్నులు బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. దాదాపు 15 కంపెనీల జాడే క్షేత్రస్థాయిలో కనబడడం లేదు. రూ.6 వేలు, రూ.12 వేలు ధర చెల్లించాలనే ప్రభుత్వ ఆదేశాలను కంపెనీలు బేఖాతరు చేస్తూ సగటున రూ.8 వేలు చెల్లించే విధంగా రైతులతో బేరసారాలకు దిగారు. పైగా గ్రేడింగ్ పేరిట రైతులను ఇబ్బంది పెట్టవద్దనే ఆదేశాలు కూడా అమలుకు నోచుకోలేదు. ఇదే అదనుగా పెద్ద ఎత్తున ట్రేడర్స్ రంగంలోకి దిగి తీసికట్టు ధరలకు పొగాకు కొనుగోలు చేస్తూ రైతులను వంచించే కార్యక్రమానికి దిగారు.

రంగంలోకి మార్క్‌ఫెడ్

బర్లీ పొగాకు కొనుగోళ్ల విషయంలో కంపెనీల మీద వదిలేస్తే రైతులకు న్యాయం జరగదనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు సమాచారం. ఈ నెల రెండో వారంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి పూర్తి స్థాయిలో కొనుగోళ్లు జరిపేలా కార్యాచరణను రూపొందిస్తోంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై నేడో, రేపో మార్క్‌ఫెడ్ జిల్లా విభాగానికి ఆదేశాలు రానున్నాయి. మరో వైపు క్షేత్రస్థాయిలో ట్రేడర్స్ కదలికలపై కూడా ప్రభుత్వం దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. పదేపదే మొత్తుకున్నా పట్టించుకోకుండా అరకొర కొనుగోళ్లు జరిపి మమ అనిపిద్దామన్న కంపెనీల వైఖరిని కూడా నిశితంగా గమనిస్తోంది. ముఖ్యంగా బర్లీ సాగు చేసేలా రైతులను పెద్ద సంఖ్యలో పురిగొల్పి ఇప్పుడు ముఖం చాటేస్తున్న కంపెనీల వైఖరిని కూడా ప్రభుత్వం తీవ్రంగానే పరిగణించనున్నట్లు సమాచారం. పొగాకు కొనుగోళ్లపై కంపెనీల వైఖరిని తప్పుబడుతూ గురువారం గుంటూరులోని జీపీఐ కంపెనీ ముందు రైతు సంఘాలు నిరసన కార్యక్రమానికి పిలుపివ్వడం వంటి వన్నీ కూడా సమస్య తీవ్రతకు అద్దం పట్టేలా ఉన్నాయి

80 బస్తాల మొక్కజొన్నలు చోరీ

బల్లికురవ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో కల్లంలో ఉంచిన 80 బస్తాల మొక్కజొన్నలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీ చేశారు. గ్రామానికి చెందిన లావు వేణు అనే రైతు తన పొలంలో పండించిన మొక్కజొన్నల్లో నెమ్ము శాతం తగ్గించేందుకు గ్రామానికి తూర్పు వైపున ఆటస్థలంలో ఉంచారు. ఇది గమనించిన దొంగలు రాత్రి సమయంలో కల్లంలో ఉంచిన సుమారు 80 బస్తాల మొక్క జొన్నలను అపహరించుకు వెళ్లారు. మంగళవారం ఉదయం కల్లం వద్దకు వెళ్లగా మొక్కజొన్నలు లేక పోవడంతో చోరీ జరిగిన విషయం గుర్తించి లబోదిబోమంటు గ్రామంలోని రైతులకు విషయం చెప్పి అనంతరం బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ అయిన మొక్కజొన్నల విలువ రూ.90 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.


మొక్కజొన్నలు చోరీ జరిగిన ప్రదేశం

అవీ..ఇవీ..

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

● యువతకు సీఐ సుబ్బారావు సూచన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ సుబ్బారావు

అద్దంకిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని అద్దంకి పట్టణ సీఐ సుబ్బారావు సూచించారు. మంగళవారం అద్దంకిలోని బంగ్లారోడ్డులో బాపట్లకు చెందిన ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వినియోగం, వాటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ సుబ్బారాజు హజరై మత్తుపదార్థాలకు యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనలను గమనిస్తూ దురలవాట్లకు బానిసలు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ క్లబ్ ప్రతినిధులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించండి

అద్దంకిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యకర్తలు అందరు క్షేత్ర స్థాయిలో ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని ఫ్లోరోసిస్ ప్రోగ్రం ఆఫీసర్ డాక్టర్ అనీల్‌కుమార్ సూచించారు. మంగళవారం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, గాజులపాలెం యూపీహెచ్‌పీలో జరిగిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్లోరోసిస్ లక్షణాలు, వాటి వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎముకలలో సంభవించే వ్యాధుల గురించి అ వగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ గొట్టిపాటి జయసింహ, డాక్టర్ యం.హేమమాధురి, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పంగులూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని పంచాయతీ కార్యదర్శి కల్యాణి అన్నారు. మండలంలోని చందలూరు సచివాలయం వద్ద గ్రామ పంచాయతీలో నిర్వహించిన యోగా కార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతి నిధులు, ప్రభుత్వ సిబ్బం ది పాల్గొని యోగాభ్యాసనం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, టీడీపీ నాయకులు మురకొండ సుబ్బారావు, అంగన్ వాడీలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



తాము గీసిన చిత్రాలను చూపుతున్న బాలబాలికలు

చినగంజాం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకులు ఏ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు అన్నారు. స్థానిక గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పచ్చదనం పర్యావరణం అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకులు తెలిపారు. తదనంతరం విద్యార్థులకు యోగాశిక్షణ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ వై.రామాంజనేయులు పాదహస్తాసనం, వృక్షాసనం, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. యోగా జీవితంలో భాగంకావాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ పి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ మాటలు జనం నమ్మే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న యువనాయకుడు గౌరీఅమర్నాథ్

చీరాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జగన్‌రెడ్డి మాటలు జనం నమ్మే పరిస్థితి లేదని యువనాయకుడు గౌరీ అమర్నాథ్ అన్నారు. బుధవారం వైసీపీ తలపెట్టిన వెన్నుపోటుదినంపై క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లలో ప్రజలకు వెన్నుపోటు పొడిచిందేగాక, దానిని మభ్యపెట్టేందుకు కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ప్రజలు మాత్రం రాష్ట్రానికి పట్టిన పీడ విరగడయ్యిందని భావిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీని ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు మృతి



మృతిచెందిన శ్రీనివాసరావు

పంగులూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలం లోని 16వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు అద్దంకికి చెందిన గుంటూరు శ్రీనివాసరావు (60) మార్టూరు నుంచి మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై అద్దంకికి బయలుదేరాడు. పంగులూరు మండలం జాగర్లమూడి వారిపాలెం ఫ్లైఓవర్‌పై ఒంగోలు వైపు వెళుతున్న లారీ నిలిచి ఉంది. ఈ క్రమంలో ద్విచక్రవాహనం లారీని ఢీకొని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ. వినోద్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనపై ఎస్ఐ వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏరువాక సాగేదెట్టా..?

● కష్టపడ్డ రైతులకు నష్టాలే మిగులు ● శీతలగిడ్డంగులకే పరిమితమైన నిల్వలు ● ల్వలు



గిడ్డంగుల్లో నిల్వ ఉన్న శనగలు

ఇంకొల్లు, జూన్ 3,(ఆంధ్రజ్యోతి): మరో ఐదు రోజుల్లో ఏరువాక. అంటే రైతాంగానికి పెద్దపండుగ. ఈ ఏడాది ముందుగానే తొలకరి చినుకులు పలకరించినా, రైతాంగం కాడి భుజానికెత్తుకోలేక కన్నీరు పెడుతున్నారు. నాగలిక్రలను సరిచేయించేందుకు కూడా చేతిలో చిల్లిగవ్వలేక బేలచూపులు చూస్తున్నాడు. గతేడాది పంటే ముంగిళ్లను దాటకపోగా, ఈ ఏడాది సాగుచేసేదెట్టా..? అయోమయ స్థితిలో ఉన్నాడు.

వ్యవసాయ ప్రధానమైన పర్చూరు సబ్‌డివిజన్ పరిధిలో ప్రధానంగా మిర్చి, శనగ, బర్లీ పొగాకు ఈ ఏడాది సాగైంది. నికరంగా దిగుబడులు, ఆదాయం ఉంటుందన్న ఆశతో రైతులు ఈ పంటలను సాగుచేశారు. ఆరుగాలం కష్టించి పంటలనైతే పండిచారు కానీ, అమ్ముకోలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో 'విస్తరిలో ఉన్న అన్నం నోటిలోనికి పోని' చందంగా రైతుల పరిస్థితి తయారైంది. ప్రభుత్వ చొరవ తీసుకొని తమ పంట ఉత్పత్తులను కొనుగోలు చేయించక పోతుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

ఏ పంట ధర చూసినా అంతే...

ఈ ఏడాది ఏ పంట సాగచేసినా రైతు లాభాలు పొందేపరిస్థితి లేకుండా పోయింది. పొగాకు పంటలో నల్లబర్లి ఈ ఏడాది అధికంగా సాగయ్యింది. వేలకు వేలు వెచ్చించి ఈ ప్రాంతం రైతులు పొగాకును సాగుచేశారు. పొగాకు కంపెనీలు కూడా రైతులను ముందుగా ప్రోత్సహించాయి. తీరా పంట పండిన తర్వాత అసలు కొనేనాథుడే లేకుండా పోయాడు. దీంతో కొంత మంది రైతులు అసలు పొగాకును చెట్టు నుంచి తెంపకుండానే చేలో వదిలేశారు. ఇక ఇప్పటికే ఇంటికి పొగాకు తెచ్చుకున్న రైతులు ఇంటిముందు మండె వేసుకొని ఎప్పుడు అమ్ముడు పోద్దా అని ఎదురు చూస్తున్నారు. గిట్టుబాట ధర కల్పిస్తామని ప్రభుత్వం రైతుల వివరాలు సేకరిస్తున్నా, ఫలితం అంతంతమాత్రంగానే ఉంటోంది. ఇక శనగలు గతేడాది మంచి ధరలను పలికాయి. ప్రధానం తెల్లశనగలు (కాక్-2 రకం) రూ.10 వేల వరకు పలికాయి. ఈ ప్రధానంగా ఇది ఎగుమతి రాకం, దేశీయంగా ఉత్తర భారతదేశంలో ఎక్కువగా వినియోగిస్తారు. అయితే దిగుమతులు దేశీయంగా గిరాకీని తగ్గించాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో ప్రస్తుతం క్వింటా ధర రూ.6,400 పలుకుతుండడంతో శీతల గిడ్డంగుల్లోనే శనగలు ఉంచారు. మరో ప్రధాన వాణిజ్య పంట అయిన మిర్చి పరస్థితి అదేవిధంగా ఉంది. నాటురకం రూ.7వేలు నుంచి రూ.10వేల లోపు పలుకుతోంది. తేజ రకం కూడా ప్రస్తుతం కొనేవారు లేకుండా పోయారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు మిర్చి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.

అప్పులపాలైన రైతాంగం

పండించిన ఏ పంటా అమ్ముడుపోక పోవడంతో రైతాంగం అప్పులపాలై పూర్తి నైరాశ్యంలో ఉంది. బర్లిపొగాకు అమ్ముకోలేక ఒకరిద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. గిడ్డంగులలో నిల్వ ఉంచి గిట్టుబాటు ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కనీసం గత ఏడాది కూలీలకు కూలి ఖర్చులు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూలికి వచ్చిన వారికి కూడా కూలి చెల్లించలేక కొంతమంది రైతులు వారికి సర్ధిచెప్పుకొని కొద్దిగొప్పో చేతిలోపెట్టి వారిని పంపించి వేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఆదుకుంటుందని ఆశాభావంతో రైతులు ఎదరు చూస్తున్నారు.

కౌలుకు ముందురాని రైతులు

గత ఏడాది పొగాకు పంట బాగా పండటంతో పాటు మంచి ధర ఉండడంతో ఎక్కువ మంది రైతులు పొగాకు సాగును దృష్టిలో ఉంచుకొని అధిక కౌలు చెల్లించారు. ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. కౌలుకు తీసుకొని సాగు చేయాలంటే కౌలురైతులు వెనుకంజ వేస్తున్నారు. రైతుల్లో పొలం సాగుపై ఆసక్తి కనిపించడం లేదు. దీంతో కౌలు ధరలు కూడా నేలచూపులు చూస్తున్నాయి.

ఒక్క కిలో పొగాకు అమ్మలేదు



ఈ ఏడాది పదిహేను ఎకరాల్లో బర్లి పొగాకు సాగు చేశా. ఇప్పటి వరకు ఒక్క కిలో పొగాకు కూడా అమ్మలేదు. కాడగుచ్చిన కూలీలకు ఇంత వరకు పూర్తిగా కూలి ఖర్చులు ఇవ్వలేక పోయా. ప్రతిరోజూ ఆ పొగాకు చూసి బాధపడాల్సిన పరిస్థితి ఉంది. పొగాకు నిల్వ ఉండాలంటే తరచూ మండె తిరగవేయాలి. దానిని తిరగేసుకోవడం ఆదో పెద్ద పనిగా ఉంది.

కాలువ వెంకటేశ్వర్లు, పొగాకు రైతు

మిర్చిలో ఎకరాకు లక్ష నష్టపోయాను



మిర్చి మూడు ఎకరాలు సాగు చేశాను. ఎకరాకు లక్ష నష్టం వచ్చింది. ఈ ఏడాది మిర్చి పంట లో దిగుబడులు లేవు. దీంతో పాటు ధర పతనమైంది. దీంతో మిర్చి సాగు చేసిన రైతులు నష్టాలు చవిచూశారు. పెట్టిన పెట్టుబడులకు వచ్చిన పంటకు సంబంధం లేదు.దీంతో నష్టపోయాను.

చెన్నుపాటి వెంకటేశ్వర్లు,మిర్చిరైతు

శనగలకు ధర లేక నిల్వ ఉంచాం



ఈ ఏడాది 25 ఎకరాలలో తెల్ల శనగ సాగు చేశాను. పంట చేతి కందిన సమయం నుండి ఇప్పటి వరకు సరైన ధర లేదు. గత ఏడాది క్వింటా రూ.10వేలు పలికిన కాక్-2 రకం తెల్ల శనగలు ప్రస్తుతం రూ.6400లను మించి పలకడం లేదు. ఈ ధరలో అమ్మితే నష్టపోవాల్సిందే. చేసేది లేక శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచాము. **మాదాల శ్రీనివాసరావు, దుద్దుకూరు**

విజయనగర్ కాలనీ వాసులకు తీరిన దారి సమస్య

శ్మశానికి జాతీయ రహదారి కింద నుంచి టన్నెల్ ఏర్పాటు



టన్నెల్ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పిల్లి మాణిక్యరావు

విజయనగర్‌కాలనీ (చీరాల), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విజయ నగర్ కాలనీ వాసుల ప్రధాన సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో నుంచి ఇటీవల వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గ్రామానికి సంబంధించిన శ్మశాన వాటిక భూమి సుమారు నాలుగు ఎకరాలు జాతీయ రహదారిలో కలిసింది. ఈ నేపథ్యం లో ఇటీవల గ్రామంలో ఓ వ్యక్తి మరణించిన ప్పటికీ అంత్యక్రియలకు మిగిలిన 4 ఎకరాల భూమిలో అంతిమ సంస్కారాలు నిర్వహించాలన్నా కూడా సుమారు కిలో మీటరు తిరిగి రావాల్సి వచ్చింది. దీంతో గ్రామస్థులు పలుమార్లు అర్జీలు అందించడంతో రంగంలోకి దిగిన లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు సమస్యను స్థానిక శాసన సభ్యులు ఎంఎం కొండయ్యతో పాటు జిల్లా కలెక్టర్‌కు దృష్టికి తీసుకువెళ్లారు. అప్పటికీ సుమారు 5 అడుగుల ఎత్తులో నిర్మాణాలు జరిగినప్పటికీ అధికారుల కృషితో ఆసమీపంలో రహదారిని పగలకొట్టి అక్కడ టన్నెల్ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో అందుకు సంబంధించిన పనులను మంగళవారం లిడ్ క్యాప్ చైర్మన్, తహసీల్దార్ పరిశీలించారు. అలాగే గ్రామస్థులు అధికారిని ఘనంగా సత్కరించారు. గ్రామస్థులు ఎమ్మెల్యే, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాలను పూర్తిచేయాలి

హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు



లేఅవుట్ పరిసరాలను పరిశీలిస్తున్న పీడీ వెంకటేశ్వరరావు

మార్టూరు, జూన్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ హౌసింగ్ పథకం కింద అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాలను త్వరితంగా పూర్తిచేసే విధంగా అందరూ కృషి చేయాలని హౌసింగ్ జిల్లా పీడీ వై.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మార్టూరులో జగనన్నకాలనీలో అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో పక్కా ఇళ్లు మంజూరైన వారు ఆర్థిక కారణాలతో ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయకపోవడంతో వారికి ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. అ.ంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసి స్టెంట్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఆయన వారితో మాట్లాడుతూ మండలంలో 521 మంది లబ్ధిదారులకు బేస్‌మెంట్ స్థాయి లో ఉన్నవారికి 15 వేలు, శ్లాబు స్థాయిలో ఉన్న వారికి 30 వేలు ను ప్రభుత్వం నగదు రూపేణాసాయం అందించిందన్నారు. మండలంలో వేగవంతంగా గృహాల నిర్మాణాలను పూర్తిచేయించేసే విధంగా కృషిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ఖాదర్‌వలి, ఏఈ రాహుల్ , వర్క్ ఇన్‌స్పెక్టర్ అవ్వారు హరి ప్రసాద్, తదితర ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

● దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు

● నాలుగు రోజుల క్రితం జరిగినట్లు పోలీసుల గుర్తింపు

అద్దంకిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శాంతినగర్ సమీపంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని శాంతినగర్ సమీపంలోని సరుగు కర్ర తోటలో చెట్టుకు తాడుతో మెడకు బిగించుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని పొలానికి పనులకు వెళ్లిన ప్రజలకు దుర్గంధం రావడంతో గమనించి అక్కడ చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బరాజు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం వ్యక్తి ఆత్యహత్య చేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి వి వరాలకు అద్దంకి సీఐ 9121102167 నెంబరును, అద్దంకి పోలీస్ స్టేషన్‌నులోనైన సంప్రదించాలని సీఐ సూచించారు.

మోటర్ సైకిల్‌ను ఢీకొన్న కారు

● ఉపాధ్యాయుడికి గాయాలు

అద్దంకి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ నుంచి శ్రీనగర్ వెళ్లే సర్వీస్‌లో మంగళవారం రాత్రి కారు, మోటర్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయడు రవివర్మకు గాయ్యాలయ్యాయి. అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులో నివాసం ఉండే రవివర్మ శ్రీనగర్ వైపు నుండి రామ్‌నగర్‌కు సర్వీస్ రోడ్డులో వెళ్తాండగా ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవివర్మను అద్దంకిలోని వైద్యశాలకు తరలించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

నేడు పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం


అద్దంకిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అద్దంకి డివిజన్ పరిధిలోని పలు గ్రామాలల్లో బుధవారం ఫీడర్ల మరమ్మతులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఏ ఎం.దామోదరం మంగళ వారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, బస్టాండ్ ఏరియా, బంగ్లారోడ్డు, కాకానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామన్నారు. మండలంలోని కుంకుబాబు 33 కేవీ ఫీడర్‌కు, కొరిశపాడు మండలంలోని సోమవరప్పాడు, జే. పంగులూరు మండలంలోని పంగులూరు పట్టణం, చుట్టుపక్కల పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు: మండల కేంద్రమైన పంగులూరులో మంగళవారం ఉదయం మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనులలో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విజయాంకురార్పణకు ఏడాది

ఎమ్మెల్యే కొండయ్య సుపరిపాలనకు ఏడాది పూర్తి



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

చీరాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలై నేటికి ఏడాదైంది. చీరాల నియోజకవర్గంలో అప్పట్లో ఒకవైపు సీనియర్ నాయకులు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆశీస్సులతో వైసీపీ నుంచి ఆయన కుమారుడు వెంకటేష్, కాంగ్రెస్ నుంచి రేసులో ఆమంచి కృష్ణమోహన్, టీడీపీ నుంచి మద్దులూరి మాలకొండయ్య పోటీలో నిలిచారు. అయితే అంతకుముందు పరిస్థితులు కారణంగా 2019లోనే వైసీపీ నుంచి చీరాల్లో పోటీచేసిన ఆమంచి బలరాం చేతిలో ఓటమి చవిచూశారు. టీడీపీ నుండి ఆమంచిపై పోటీ చేసి గెలుపొందిన అనంతరం బలరామకృష్ణమూర్తి రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీలోనికి వెళ్లారు. అయితే ఆక్రమంలో చీరాల నియోజకవర్గంలో టీడీపీ దాదాపుగా పూర్తిస్థాయిలో స్తబ్దుగా ఉంది. దీంతో టీడీపీ అధిష్ఠానం చక్కనైన ప్రణాళికతో చీరాల ఇన్‌చార్జ్‌గా ఎంఎం కొండయ్యను రంగంలోకి దింపింది.

ఆదిలోనే ఆటంకం

ఆసమయంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకే కొండయ్య నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అంతేకాకుండా పట్టణంలో కనీసం బ్యానర్ కట్టాలన్నా యుద్ధమే చేయాల్సి వచ్చేది. అవకాశం ఉన్న మేరకు కొద్దిమంది తోనే పార్టీ కార్యక్రమాలు చేసుకుంటూ కొండయ్య అందరిలోకి వెళ్లాడు. సమస్యలు తెలుసుకుని అండగా నిలిచారు. అన్ని సామాజిక వర్గాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పాటు చేసుకుని పార్టీ బలోపేతానికి బాటలు వేసి విజయాన్ని రుచిచూశారు.

తెనాలిలో దళిత యువకులపై దాడి చేసిన పోలీసులను అరెస్టు చేయాలి

అద్దంకిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తెనాలి ఘటనలో దళిత యువకులపై దాష్టికం చేసిన పోలీసులను ఎస్సీ, ఎస్టీ ప్రకారం అరెస్టు చేయాలని దళిత నాయకులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెనాలి దళిత యువకులపై ఖాకీ దమనకాండపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెనాలి ఘటనపై హోంమంత్రి అనిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధం అని అన్నారు. సీఐలు రాములునాయక్, రమేష్‌బాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, నియోజవకర్గ అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్, కాకుమాను రవి, యానాది సేవా సమితి నాయకులు పోలా జీవరత్నం, ఆదినారాయణ, ఎంఆర్‌పీఎస్ నాయకులు యోహాన్, అంబేద్కర్ పోరాట వేదిక కన్వీనర్ శ్రీనివాసరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు రోగుల తరలింపు



శంకర్ కంటి వైద్యశాలకు రోగులను తరలిస్తున్న రోటరీ ప్రతినిధులు

పంగులూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు వారి ఆధ్వర్యంలో శుక్లముల శస్త్రచికిత్స కోసం 40 మందిని శంకర్ కంటి వైద్యశాలకు తరలించారు. గత శనివారం పంగులూరులోని రోటరీ ప్రాంగణంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 140 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరం అని గుర్తించారు. వీరిలో ఆదివారం రెండు బస్సులలో కొందరిని తరలించి శస్త్రచికిత్సలు చేయించారు. మిగిలిన 40 మందిని మంగళవారం శంకర్ కంటి వైద్యశాలకు చెందిన ప్రత్యేక వాహనంలో తరలించినట్లు రోటరీ ఐ కేర్ రీజనల్ మేనేజర్ వీరరాఘవయ్య తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షేక్ కాలేషావలి, మాజీ అధ్యక్షులు కరణం హనుమంతరావు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



సూచనలిస్తున్న సుబ్బారెడ్డి

పంగులూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):అల్పపీడన ప్రభావం, రుతుపవనాల ప్రవేశంతో వర్షాలు అనుకూలిస్తున్న తరుణంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యే రైతులు నాణ్యమైన, మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరు, బైట మంజులూరు గ్రామాలలో మంగళవారం ఖరీఫ్ పంటసాగుపై రైతాంగానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు భద్రపరచుకోవాలన్నారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై జీలుగ, జనుము విత్తనాలు రైతుసేవాకేంద్రంలో పేరును రిజిస్ట్రేసన్ చేయించుకొని పొందవచ్చన్నారు. ఖరీఫ్ సాగుకు సాగర్ నీటిని విడుదల చేసిన వెంటనే వరి విత్తనాలతో నారుమళ్లు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పృద్వీసాయి, రైతులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో రేషన్ పంపిణీ చేయాలి

● తహసీల్దార్ సింగారావు



వీఆర్‌వోలు, డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెల ఒకటవ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్ణీత సమయాలలో కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వీఆర్‌వోలు డీలర్లు, కార్యాలయ సిబ్బందితో రేషన్ పంపిణీపై సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు, 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందజేయాలన్నారు. ఈ సమాచారాన్ని కార్డుదారులందరికీ తెలియచేయాలని కోరారు. కార్డుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ శ్వేత, డీటీ. అర్జున్, సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు, వీఆర్‌వోలు డీలర్లు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 4 జూన్ 2025





కడలి తీరం.. యోగా వికాసం

సూర్యోదయాన.. ఉవ్వెత్తున ఎగసిపడే సాగర కెరటాల తీరాన సామూహిక యోగ సాధన ఆకట్టుకుంది. ఇందుకూరుపేట మండలం మైపాడు తీరంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఆర్డీవో పావని తదితర ప్రముఖులతోపాటు ప్రజలు తరలివచ్చి యోగాసనాలు వేశారు. 8

యోగా లక్ష్యాన్ని పూర్తి చేయండి

- టెలికాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్


నెల్లూరు(హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 10 లక్షల మందిని యోగా కోసం రిజిస్ట్రేషన్లు చేయించాలనేది లక్ష్యమని, ఈ లక్ష్యాన్ని వుంటనే పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో యోగాపై పలు సూచనలు చేశారు. గ్రామ స్థాయిలో యోగాకు సంబంధించి గ్రామస్థులతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఎంపిక చేసిన ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మండల స్థాయి యోగా పోటీలను ఈవారం చివరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కాకాణి కస్టడీ పిటిషన్
రేపటికి వాయిదా



నెల్లూరు (లీగల్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కస్టడీ పిటిషన్‌పై తీర్పును గురువారినికి వాయిదా వేస్తూ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి సుమా ఉత్తర్వు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పేలుడు పదార్థాల నిరోధక చట్టం, అక్రమ మైనింగ్ జరిపారన్న అభియోగాలతో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని ఏడు రోజులపాటు విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం వాదప్రతివాదనలు విన్న న్యాయాధికారి ఈ పిటిషన్‌పై తీర్పును 5వ తేదీకి వాయిదా వేశారు. అలాగే బెయిల్ పిటిషన్‌పై విచారణను కూడా 5వ తేదీకే వాయిదా వేస్తూ ఉత్తర్వు చేశారు.

మీరు లేకున్నా.. మీ పాటలు పదిలం



నేడు ఎస్పీ బాలు జయంతి

ఎన్నో భాషల్లో వేల పాటలు పాడి ప్రపంచం గర్తించదగ్గ గాయకుడిగా రసహృదయాల్లో నిలిచిపోయారు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. సంగీత దర్శకుడిగా మంచి సంగీతం వినిపించాలని తపించిన స్వరపుత్రుడు ఆయన. గాత్రధారిగానే కాక చలన చిత్రాల్లో పాత్రధారిగా, బుల్లితెర సంగీత కార్యక్రమాలకు సూత్రధారిగా అత్యున్నత శిఖరాలు అందుకున్న యశస్వి. తన వ్యక్తిత్వంతోనూ స్నేహ పరిమళాలతో వెలుగులు పంచిన పద్మవిభూషణ్ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. సింహపురి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన ఎస్పీ బాలు జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.. 8

- సింహపురి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహోన్నత వ్యక్తి
- ఆయన ఆశయాలను కొనసాగిస్తున్న స్నేహబృందం
- నేడు గాయని రమణకు పురస్కారం

రియల్.. ఢమాల్!

- అమ్ముడుపోని స్థలాలు, ఇళ్లు • భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ ఆదాయం



ఒకప్పుడు ఓ ఊపు ఊపిన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కష్టకాలాన్ని ఎదుర్కొంటోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరుగుతున్న డాక్యుమెంట్ల సంఖ్యను చూస్తేనే ఈ పరిస్థితి అర్థమవుతోంది. ప్రధానంగా నెల్లూరు, కావలి వంటి పెద్ద ప్రాంతాల్లో దాదాపు సగం వరకూ రిజిస్ట్రేషన్లు పడిపోయాయి. అయితే ఆత్మకూరు, అల్లూరు వంటి ప్రాంతాల్లో మాత్రం రిజిస్ట్రేషన్ శాఖ సాధించిన గ్రోత్ ఎక్కువగా ఉండటం విశేషం.

జిల్లాలో రిజిస్ట్రేషన్ల వివరాలు

సంవత్సరం	డాక్యుమెంట్లు	లక్ష్యం(రూ.కోట్లు)	సాధన(రూ.కోట్లు)	శాతం
2023-24	1,88,229	669.75	480.34	71.72
2024-25	93,772	712.38	444.69	62.42

నెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : దాదాపు రెండు దశాబ్దాల క్రితం రియల్ రంగానికి ఊపు ప్రారంభమైంది. అది రాష్ట్ర విభజన తర్వాత తారస్థాయికి చేరుకుంది. భూములు, ఇళ్ల ధరలు అమాంతం పెరుగుతూ వచ్చాయి. కొనుగోలు చేసేవారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఎక్కడపడితే అక్కడ లేఅవుట్లు వెలిశాయి. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఇళ్లు.. ఇలా నిర్మాణ రంగం కూడా జోరందుకుంది. నెల్లూరు నగరంలో అయితే ఒక రోజు చెప్పిన ధర మరుసటి రోజు ఉండేది కాదంటే అతిశయోక్తి కాదని రియల్ ఎస్టేట్ నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం అంకణం విలువ రూ.లక్ష ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు రూ.3 లక్షలకు పెరిగిందంటే రియల్ ఎస్టేట్ వెలుగులు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే అంతస్థాయి నుంచి ఇప్పుడు కొనుగోలు చేసేవారు తక్కువవడంతో ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి.

- తగ్గుతున్న ఆదాయం

జిల్లాలో 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా, వాటి పరిధిలో ఏటా టార్గెట్‌లు పెట్టుకొని పని చేస్తుంటారు. 2023-24లో రిజిస్ట్రేషన్ శాఖ రూ.669.75 కోట్లను లక్ష్యంగా పెట్టుకోగా చివరకు రూ.480.34 కోట్లే సాధించింది. ఇక 2024-25లో రూ.712.38 కోట్లకుగాను కేవలం రూ.444.69 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. అంటే అంతకుముందు ఏడాది సాధించిందే తక్కువ అనుకుంటే ఆ తర్వాత సంవత్సరం మరింత దిగజారింది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచినా ఆదాయం తగ్గడం గమనార్హం. ఇక రిజిస్ట్రేషన్ జరిగిన డాక్యుమెంట్ల సంఖ్య కూడా సగానికి పడిపోయింది. దీనిని బట్టే రియల్ ఎస్టేట్ రంగం ఎంతటి కష్టకాలాన్ని ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్లాట్లు, ఫ్లాట్లు కొనేవారు కరువయ్యారని వ్యాపారులు అంటున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని పెద్ద పెట్టుబడి మార్గంగా భావించేవారు. అలా పెట్టుబడి పెట్టిన వారు ఇప్పుడు స్థలాలు, ఇళ్లు అమ్ముకుందామంటే వీలుగాక ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం అనేక సమస్యలను పరిష్కరించింది. అనధికార లేఅవుట్లకు బ్రేకులు వేయడమేగాక కొత్త లేఅవుట్లలో రోడ్ల వెడల్పును కూడా తగ్గించి వ్యాపారులకు మేలు చేసింది. ఇసుకను ఉచితం చేసినా రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకోవడం అటుంచి మరింత పతనమవుతుండటంతో వ్యాపారులు, ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్న వారు ఆందోళన చెందుతున్నారు. అయితే రియల్ ఎస్టేట్ రంగం కష్టకాలం అనుభవించడానికి మరో ప్రధాన కారణం కూడా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మెట్రో సిటీలు, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండే ధరలు జిల్లాలో ఉంటున్నాయని చెబుతున్నారు. ధరలు అమాంతం పెరిగిపోవడంతో మధ్య తరగతి ప్రజలకు కొనుగోలు శక్తి లేకుండా పోయిందని అభిప్రాయపడుతున్నారు. ఇలా కొనుగోలు చేసే వారి సంఖ్య తగ్గడంతో పెట్టుబడులు పెట్టేవారు కూడా వెనకడుగు వేస్తుండటంతోనే కొత్త లేఅవుట్లు వేయడం గానీ, కొత్తగా అపార్ట్‌మెంట్లు, ఇళ్లు నిర్మించడం ఆశించినంతగా జరగడం లేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

వితంతువులకు 'భరోసా!

- జిల్లాలో 3,492 మందికి పెన్షన్లు • 12న పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వితంతువులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందించింది. పింఛను పొందుతూ భర్త మృతి చెంది ఉంటే ఎన్టీఆర్ భరోసా కింద తక్షణమే భార్యకు సామాజిక పింఛను ఇచ్చి ఆదుకునేలా ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ హయాంలో ఇటువంటి వారు దరఖాస్తు చేసుకున్నా పింఛను మంజూరు అవుతుందో లేదో తెలియని పరిస్థితి. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక 2024, నవంబరు 1వ తేదీ తరువాత మృతి చెందిన వారి భార్యలకు మరుసటి నెల నుంచే పింఛను అందజేస్తోంది. తాజాగా వైసీపీ హయాంలో అంటే 2023, డిసెంబరు 1 తరువాత ఎప్పుడు మృతి చెంది ఉన్నా (2024 అక్టోబరులోపు) అర్హులకు పింఛను ఇవ్వాలని ఆదేశాల జారీ చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అటువంటి వారిలో 3,492 మందికి లబ్ధి చేకూరనుంది. కాగా, ఇప్పటివరకు 74,994 మంది వితంతువులు ఉండగా ఒక్కొక్కరికి రూ.4వేలు చొప్పున అందజేస్తున్నారు. మంజూరైన కొత్త పింఛన్లను ఈ నెల 12న పంపిణీ చేస్తారు.



ఉదయగిరిలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్టీసీ కార్మికుల పోరుబాట

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల గ్యారేజ్ గేట్ల ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టీ మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతనెలలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశం తీర్మానం మేరకు, కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించకపోవడంతో ఐదు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. తొలి రోజు జిల్లాలోని ఏడు డిపోల్లో ఎర్ర రిబ్బన్‌లు ధరించి కార్మికులు నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

సఫాయి కర్మచారీల సంక్షేమాన్ని బాధ్యతగా తీసుకోండి

- సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సఫాయి కర్మచారీల ఆరోగ్య భద్రత, సంక్షేమాన్ని ఒక బాధ్యతగా భావించి పని చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ సమావేశమందిరంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ సఫాయి కార్మచారీలకు ఇళ్లు మంజూరు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి వైద్యశిబిరాలు నిర్వహించాలని, ఈఎస్ఐ హెల్త్ కార్డులు అందించాలన్నారు. అలాగే, యోగాంధ్ర కార్యక్రమాల్లో సఫాయి కర్మచారీలను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కమిటీ సభ్యులు, ఇతర అధికారులుపాల్గొన్నారు.

- వెట్టిచాకిరి కార్మికులను గుర్తించండి

వెట్టి చాకిరి వ్యవస్థలోని కార్మికులను గుర్తించి విముక్తులను చేసేందుకు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. ఇటుక బట్టీలు, పరిశ్రమలు, వ్యాపార దుకాణాలు, రొయ్యలు, చేపల గుంటలు, రైస్‌మిల్లులు, హోటళ్లు తదితర ప్రదేశాల్లో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. కార్మికులకు మెరుగైన ఉపాధి, సంక్షేమం అందించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.



పులి వాహనంపై చాముండేశ్వరి దేవి

ఇందుకూరుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గంగపట్నంలో జరుగుతున్న శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పులివాహనంపై అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉంగరం కోసమే హత్య!

తోపూరి నర సింహం కేసు కొలిక్కి

లింగసముద్రం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సంచలనం రేపిన తోపూరి నరసింహం హత్య కేసు ఓ కొలిక్కి వచ్చింది. కేవలం ఉంగరం కోసమే హత్య చేశానంటూ విచారణలో నిందితుడు పోలీసులకు చెప్పారు. ఈ మేరకు చలంచర్ల బ్రహ్మయ్యను అరెస్ట్ చేసినట్లు గుడ్లూరు సీఐ మంగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆర్‌ఆర్ పాలెం దగ్గర ఉన్న నిమ్మతోటలో నరసింహంను హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా చేసి బోరుబావిలో పడేసి ఉండటాన్ని ఆదివారం వెలుగులోకి వచ్చింది. దీనిపై పలుకోణాల్లో విచారించిన పోలీసులు ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామానికి చెందిన బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు పూర్తిస్థాయిలో విచారించారు. నరసింహం చేతికున్న బంగారు పచ్చరాయి ఉంగరం అమ్ముకొని తన అప్పులు తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే బ్రహ్మయ్య ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని సీఐ తెలిపారు. కాగా, కందుకూరు కోర్టులో బ్రహ్మయ్యను హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

వలంటీర్ల కథ కంచికేనా!?

- ఏడాది అయినా కానరాని నియామకాలు • ఎటూ తేల్చని రాష్ట్ర ప్రభుత్వం

నెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్ల వ్యవస్థ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. ఈ వ్యవస్థ లేకున్నా అన్ని పనులు సవ్యంగా జరిగిపోతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టి ఖజానాపై అదనపు భారం వేసుకుంటుందా!? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ హయాంలో ప్రతి 100 కుటుంబాలకు ఒక వలంటీరు చొప్పున నియమించింది. ఆ కుటుంబాలకు అవసరమైన సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా అందించే ప్రయత్నం చేసింది. అయితే ఈ వ్యవస్థ పూర్తిగా రాజకీయ రంగు పులుముకోవడంతో ఎన్నికల కమిషన్ వలంటీర్లను విధుల నుంచి పక్కన పెట్టాలని ఆదేశించింది. ఆ క్రమంలోనే అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, ఇంకా మెరుగైన జీతం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది.



- ఏడాది గడుస్తున్నా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతోంది. అయినా ఇప్పటివరకు వలంటీర్ల నియామకం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలోని రూరల్ ప్రాంతాల్లో 11వేల మంది, మున్సిపాలిటీల పరిధిలో 5వేలు, మొత్తం 16వేల మంది వలంటీర్లుగా పనిచేసేవారు. పునర్నియామకాలు జరిగితే వీరందరిని విధుల్లోకి తీసుకోవాలి. వీరిలో వైసీపీ నేతల ప్రలోభాలకు లొంగి అప్పట్లో 3వేల మంది వరకు రాజీనామాలు చేసి ఆ పార్టీ ప్రచారంలో పాల్గొన్నారు. వీరి స్థానంలో కొత్త వారిని నియమించినా, చివరి వరకు విధుల్లో కొనసాగిన 13వేల మందికి తిరిగి అవకాశాలు కల్పించాల్సి ఉంది. అయితే, కూటమి ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే వలంటీర్ల వ్యవస్థ లేకున్నా ఈ ఏడాది కాలం సంక్షేమ పథకాల పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ప్రతి నెల 1, 2 తేదీల్లో లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇక రేషన్ పంపిణీ విషయంలోనూ కూటమి ప్రభుత్వం మళ్లీ పాత విధానాన్నే పునరుద్ధరించింది. చౌక దుకాణాల్లోనే సరుకుల పంపిణీ సవ్యంగా సాగుతోంది. గతంలో వలంటీర్లు నిర్వర్తించే పనుల్లో ఈ రెండే ప్రధానమైనవి. మిగిలిన సంక్షేమ పథకాల కోసం ప్రజలే నేరుగా సచివాలయాలకు వెళ్లి సంక్షేమ కార్యదర్శిని కలిసేవారు. ఇప్పుడు అదే జరుగుతోంది. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వలంటీర్ల నియామకం ఖజానాపై అదనపు భారం అవుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. జిల్లా పరిధిలో వలంటీర్ల వేతనం కింద నెలకు రూ.8 కోట్ల భారం రాష్ట్ర ఖజానాపై పడుతుంది. సంవత్సరానికి 96 కోట్ల

- మిగతా 7లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 525

రాష్ట్ర మంత్రి స్వామిని కలిసిన ఇంటూరి

కందుకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతి వెలగపూడి సచివాలయంలో మంగళవారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గం లోని పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు, అదేవిధంగా రాష్ట్ర రాజకీయాలపై చర్చించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



న్యూస్ బాక్స్

నేడు ప్రత్యేక పీజీఆర్ఎస్

లింగసముద్రం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకుని తమ భూ సమస్యలు, ఇతర సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కావలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం బాలకృష్ణారెడ్డినగర్ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1800 స్వాధీనం చేసుకున్నట్లు కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం తెలియగానే సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ తమ సిబ్బందితో దాడులు చేసి వారిని అరెస్ట్ చేశారు. అనంతరం సీఐ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడైనా గ్రామాల్లో పేకాట, కోడి పందాలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియచేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు టౌన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శివాలయం ఫీడర్‌లో 11 కేవీ విద్యుత్ లైన్‌కు అవరోధం కలిగించే చెట్ల కొమ్మలను తొలగించేందుకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నరసింహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని పాలూరు ఫీడర్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగిలే చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు తెలిపారు. దీంతో ఆప్రాంతంలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

అండర్-23 బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అండర్-23 బాలుర బాస్కెట్ బాల్ ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టును మంగళవారం ఎంపిక చేశారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరి తొట్టెంపూడి సుబ్బారావు పర్యవేక్షణలో ప్రతిభ కనపరిచిన యువకులచే జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టు ఈనెల 4, 5 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో ప్రాతనిధ్యం వహిస్తుందని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి జిల్లాకు గుర్తింపు తేవాలని అసోసియేషన్ అధ్యక్షుడు వలేటి రవీంద్ర, సెక్రటరీ సుబ్బారావులు ఆకాంక్షించారు.

వెన్నుపోటు దినం గోడపత్రిక ఆవిష్కరణ

వలేటివారిపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం వైసీపీ కార్యాలయంలో వైసీపీ మండల అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో మంగళవారం వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కందుకూరులో జరగనున్న వెన్నుపోటు దినం ర్యాలీకి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కట్టా హనుమంతరావు, వలేటి మాల్యాద్రి, నల్లమోతు చంద్రమౌళి, చింతలపూడి రవీంద్ర, మర్రి అంజయ్య, పొట్లేళ్ల క్రిష్టయ్య, ఇరపని అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఉప్పు ఉత్పత్తి

● రుతుపవనాల రాకతో చల్లబడ్డ వాతావరణం ● ఉష్ణోగ్రత లేక నిలిచిన తయారీ



ఉప్పు కువ్వలు (ఫైల్)

అల్లూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో ఉప్పు సాగు నిలిచిపోయింది. రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడింది. ఫలితంగా ఉత్పత్తి పూర్తిగా ఆగిపోయి, కయ్యలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రతీ ఏటా మార్చి నుంచి అక్టోబరు వరకు ఉప్పు ఉత్పత్తి చేస్తుంటారు. ఈ సారి రుతుపవనాలు ముందుగానే రావడంతో పరిస్థితి మారింది. కాగా ఈ ఏడాది వేసవిలో ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. ధర క్వింటం కనిష్ఠంగా రూ.300 ఉండగా, గరిష్ఠంగా రూ.450 పలికింది. దీంతో రైతులకు భారీగానే ఆదాయం రావాల్సి ఉంది. కానీ వాతావరణ మార్పులు వారి పాలిట శాపంగా మారాయి. ఈ క్రమంలో ధరలు ఉన్నా ఉప్పు ఉత్పత్తి లేక రైతులకు లాభం లేకుండా పోయింది.

ధరలు బాగానే ఉన్నాయి



ఈ ఏడాది ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. కానీ ఉత్పత్తి లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి. ధరలు ఉంటే ఉత్పత్తి ఉండదు. ఉత్పత్తి ఉంటే ధరలు రావు. ఈ విధంగా ఉప్పు రైతులు జీవితాలు నిలకడలేకుండా పోతున్నాయి.


-పురిణి ఏడుకొండలు, ఉప్పురైతు, తూర్పు గోగులపల్లి, అలూరు మండలం

రుతుపవనాలు మా పాలిట శాపం



ప్రతిఏటా రుతుపవనాలు సమయానికి రాకుండా ఆలస్యమవడం వింటున్నాం. కానీ ఈ ఏడాది ముందుగానే రావడం మా పాలిట శాపంగా మారింది. మేలో ఉప్పు ఉత్పత్తి బాగావచ్చే అవకాశం ఉన్నా, రుతుపవనాలరాకతో నష్టం జరిగింది.

-చెవికల శ్రీనివాసులు, ఉప్పు రైతు, ఇస్కపల్లి, అల్లూరు మండలం



విద్యార్థులకు పంపిణీకి పాఠ్య, నోటుపుస్తకాలు సిద్ధం

● పీపీ నరసింహారావు, ఉపవిద్యాశాఖాధికారి, కందుకూరు

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేదల పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలన్న ప్రభుత్వ నిబంధనను కఠినంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కందుకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పీపీ నరసింహారావు తెలిపారు.

? పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య, నోట్‌బుక్స్, ఇతర మెటీరియల్ పంపిణీ చేస్తారా.

! కందుకూరు డివిజన్‌లోని ఏడు మండలాలకు సంబంధించి పూర్తిస్థాయిలో పాఠ్య, నోట్‌పుస్తకాలు వచ్చేశాయి. ఇప్పటికే 19,636 సెట్లు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను ఆయా పాఠశాలలకు చేర్పించాం. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ పంపిణీ చేస్తాం.

? ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాలన్న నిబంధనకు అమలు చేస్తున్నారా. దరఖాస్తు చేసుకోవడం ఎలా.

! ఈ నిబంధన మేరకు ప్రతి సంవత్సరం 1వ తరగతిలో చేరేవారికి 25 శాతం ఫ్రీ సీట్లు ఇప్పిస్తాం. వారికి 10వ తరగతి వరకు ఉచిత విద్య అందుతోంది. దీనికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి ఏటా ఆ జాబితా ప్రభుత్వం నుంచే మాకు అందుతోంది. ఈ ఏడాది ఇంకా పూర్తిస్థాయిలో వివరాలు అందలేదు.

? ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ చూపిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందన్న విమర్శలు నిజమేనా.

! అలాంటి ఫిర్యాదులేవీ మాదృష్టికి రాలేదు. ఎంఈవోలను విచారించి ఆకస్మిక తనిఖీల ద్వారా కఠిన చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీచేస్తాం. మేము కూడా తనిఖీలు చేసి ఏవైనా ఉదంతాలు బయటపడితే తగు చర్యలు తీసుకుంటాం.

? ఈ ఏడాది కందుకూరు డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ పాస్ పర్సంటేజీ గణనీయంగా తగ్గడంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అకడమిక్ ఇయర్ ప్రారంభం నుంచే ప్రత్యేక దృష్టి సారించి పాస్ పర్సంటేజీ పెరగడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేలా పర్యవేక్షించడం జరుగుతోంది.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు

కొండాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఎస్ అక్బర్‌బాషా పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి స్థానిక బస్టాండు కూడలి వరకు సాగిన ర్యాలీలో మలేరియా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమ తెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రెండు పూరిళ్లు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన పూరిల్లు

బిట్రగుంట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఎస్‌వీపాలెం గిరిజన కాలనీలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన కత్తి శూలమయ్య భార్య రోజులాగే కూలి పనికి వెళ్లి వచ్చి మధ్యాహ్నం వంట చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి పైకప్పుకు అంటుకున్నాయి. అవి పక్కనే ఉన్న కత్తి కోటయ్య ఇంటికి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో రెండు పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు కావలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేయడంతో వారు వచ్చి మంటలను అదు పులోకి తీసుకొచ్చారు. అప్పటికే మంటల్లో ఇళ్లల్లోని దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలిపోయారు. సంఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బంది చేరుకొని వివరాలు సేకరించారు. స్థానిక టీడీపీ నేత ఆదిశేషయ్య రెండు కుటుంబాలకు బియ్యం, పప్పుదినుసులు అందజేశారు.

ప్రతి శ్రామికుడికి పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో పని కావాలన్న ప్రతి శ్రామికుడికి పని కల్పించాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏపీవో దయాసాగర్ అధ్యక్షతన టీఏలు, ఎఫ్ఏలు, కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. ప్రతి శనివారం డిమాండ్ పూర్తి చేసి, మస్టర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకెళ్లాలని తెలిపారు. సోమవారం పని ప్రదేశంలో మస్టరు కార్డులు తీసుకెళ్లి శ్రామికుల మస్టర్లను నమోదు చేయాలన్నారు. మండలంలో ఉద్యానవన పంటల సాగు వైపు రైతులు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మామిడి, నిమ్మ పంటల సాగుకు ఈ పథకంలో అనేక రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే ఫారం పాండ్ల వద్ద కూడా మొక్కలను నాటించాలని తెలిపారు. రైతుల పొలాల్లో, ప్రభుత్వ భూముల్లో కూడా టేకు మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ విజయకుమార్, టీఏలు జి.వీరరాఘవులు, శ్రీకాంత్, జక్రయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మూడోలైన్ అండర్ పాస్ ఏర్పాటు

● పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



అండర్ పాస్ బాక్స్‌టైప్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం ముసునూరు రాఘవేంద్ర కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా మంగళవారం మూడవ లైన్‌కు బ్రిడ్జి (గడ్డర్) ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి బ్రిడ్జి ఏర్పాటు పనులను ఆసక్తిగా తిలకించి రైల్వే అధికారులతో సమీక్షించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని సూచించారు. డీఈ (విజయవాడ) కెడీఎస్ కృష్ణన్, ఏడీఎన్ రాజేంద్రప్రసాద్, ఏడీఎస్‌టీ కార్తికేయకుమార్‌ల పర్యవేక్షణలో దాదాపు 70మంది సిబ్బందితో కలిసి రెండు భారీ క్రేన్‌లతో నూతనంగా నిర్మించిన మూడవ లైన్‌కు ఐరన్ బ్రిడ్జి (గడ్డర్) ఏర్పాటు చేశారు.

చెరువుల మరమ్మతులకు నిధుల మంజూరు

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు, పంట కాలువల మరమ్మతులకు రూ.71 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఇరిగేషన్ డీఈ హజరత్తయ్య తెలిపారు. మంగళవారం అయన తనని కలిసిన విలేకర్లతో మాట్లాడతూ కలవల్ల, పోలినేనిపాలెం, లింగపాలెం, లింగసముద్రం పాతచెరువు, చినపవని, ఎర్రారెడ్డిపాలెం, వీఆర్ కోట చెరువుల మరమ్మతులకు ఒక్కొక్క చెరువుకు రూ.4 లక్షల వంతున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే వీర్‌కోట ఆనకట్ట సిస్టం పరిధిలోని మోపాడు, మాచవరం చెరువుల కింద ప్రధాన పంటకాలువల పూడిక తీత, చిన్నచిన్న నిర్మాణాల పనుల కోసం రూ.43 లక్షల మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులన్నింటిని త్వరలో ప్రారంభించి రానున్న వర్షాల సీజన్ నాటికి పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని 20 మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులకు ఆర్ఆర్ఆర్ కింద ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వలేటివారిపాలెం : చుండి సచివాలయంలో యోగా చేస్తున్న ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది



కలిగిరి ఎంపీడీవో కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

వలేటివారిపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని చుండి గ్రామ సచివాలయంలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో కలిసి యోగాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కలిగిరి : యోగాతో ఫిట్‌నెస్, ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఇటీవల గ్రామాల్లో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ కనపరచిన వారికి మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మేల్ ట్రైనర్ శ్రీకాంత్, ఫిమేల్ ట్రైనర్ లలితకుమారి, పీఈటీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా పగలే వెన్నెల!

● నిరంతరం వెలుగుతున్న వీధిలైట్లు

● పంచాయతీపై ఆర్థిక భారం

● పట్టించుకోని అధికారులు



వలేటివారిపాలెంలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు

వలేటివారిపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం 4వ వార్డులో పగలు రాత్రి అనే తేడా లేకుండా ఆరు నెలలుగా వీధిలైట్లు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీపై అధిక ఆర్థిక భారం పడడంతో పాటు ఎల్ఈడీ లైట్లు త్వరితగతిన మరమ్మతులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. విద్యుత్‌ను వృథా చేయవద్దు విద్యుత్‌ను పొదుపు చేయాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నపట్టికీ పట్టించుకోవడం లేదు. గత ఆరు నెలల క్రితం వీధిలైట్లు మరమ్మతుల చేపట్టే క్రమంలో వీధిలైట్ల కనెక్షన్ నిరంతరం గృహాలకు సరఫరా జరిగే విద్యుత్ లైన్‌కు ఇవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దీంతో వీధిలైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు పగలు వెలగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వలేటివారిపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం బీఎఫ్‌టీ చినమాలకొండయ్య పరిశీలించారు. కూలీల మస్టరను తనిఖీ చేశారు. పనుల వద్ద తాగునీరు, టెంట్, మెడికల్ కిట్టు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పనికి తగ్గ వేతనం లభిస్తుందా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించి కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలీ లభిస్తుందని ఆయన తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ వీరమోసు అంజయ్య ఉన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న చినమాలకొండయ్య

వలంటీర్ల కథ కంచికేనా!?


(5వ పేజీ తరువాయి)

రూపాయలు. రాష్ట్ర వ్యాప్తంగా లెక్కిస్తే సుమారు 1500 కోట్లకు పైగా ఖజానాపై భారం పడుతుంది. వలంటీర్ల వ్యవస్థ లేకున్నా సంక్షేమ పథకాల అమలు సాఫీగా సాగుతున్నప్పుడు ఈ అదనపు భారం ఎందుకు!? అని ప్రభుత్వంలో ఉన్న ఆర్థిక నిపుణులు భావించే అవకాశం లేకపోలేదు. ఆ కారణంగానే అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వలంటీర్ల వ్యవస్థ పునర్నియామకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదనే ప్రచారం నడుస్తోంది.

ఏడాదిగా నిరుపయోగం!



కందుకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైతుల బజారు సమీపంలో పాత లారీ స్టాండ్ ప్రాంగణంలో మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమై 15 నెలలు గడిచినా నేటికీ వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారింది. పాత లారీ స్టాండ్ ప్రాంగణంలో 18 గదులతో షాపింగ్ కాంప్లెక్స్‌ను గత ఏడాది మార్చిలో ప్రారంభించారు. అప్పటికే ఆ గదుల అద్దెల బహిరంగ వేలం పూర్తి చేయడంతోపాటు మున్సిపాల్ అధికారులు పాటదారుల నుంచి అడ్వాన్స్ డిపాజిట్లు కూడా వసూలు చేశారు. 18 గదుల్లో 4 గదులకు అప్పట్లో పాటదారులు రాకపోవడంతో ఇటీవల మున్సిపల్ అధికా రులు రెండుసార్లు అద్దెలకు బహిరంగ వేలం నిర్వహించినా ఫలితం లేదు. 15 నెలల క్రితం పాటలు పాడి అడ్వాన్స్‌లు చెల్లించిన వారికి నేటికీ రూములు స్వాధీనం చేయలేకపోవడం వల్లే ఈ నాలుగు రూములకు పాటలకు ఎవరు ముందుకు రావడం లేదనేది సమాచారం. షాపింగ్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినప్పటికీ ఆ గదులకు విద్యుత్ సదుపాయం కల్పించడంలో విఫలమయ్యారు. విద్యుత్ సౌకర్యం కల్పించి గదులను పాటదారులకు స్వాధీనం చేస్తే అద్దెల రూపంలో ప్రతినెల మున్సిపాటికి రూ.1,50,000 ఆదాయం సమకూరుతుంది. ఈ స్థితిలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే మున్సిపాలిటి రూ.20 లక్షలకు పైగా రాబడి కోల్పోయింది. ఇప్పటికైనా అధికారులు ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను తక్షణం పాటదారులకు స్వాధీనం చేసి మిగిలిన నాలుడు గదులకు వేలం పాట నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



165 ఏళ్ల కిందట ఉదయగిరిలో మెయిన్ బజార్

చారిత్రక స్మృతులు.. చెరగని జ్ఞాపకాలు

మహోన్నత ప్రాచీన చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పల్లవులు, చోళులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబుల పరిపాలించారు. ప్రధానంగా 16వ శతాబ్దంలో విజయనగర రాజుల పాలనలో 365 ఆలయాలు, వాటి ముంగిట కోనేర్లతో ఉదయగిరి దేదీప్యమానంగా విరాజిల్లింది. రతనాలు రాశులుగా పోసి విక్రయించారని ఇప్పటికీ పెద్దలు చెప్పుకుంటున్నారు. విజయనగర రాజ్యానికి



బ్రిటీష్ వారు నిర్మించిన సబ్‌జైల్



బ్రిటీష్ వారు నిర్మించిన భవనంలో తహసీల్దారు కార్యాలయం

ఉదయగిరి సంహా ద్వారంగా ఉన్నట్లు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. అలాగే 17వ శతాబ్దంలో గొల్కొడ నవాబు హైదర్ షుల్‌ముల్కు పాలనలో దుర్గంపై అనేక మసీదులు, దర్గాలు నిర్మించారు. 19వ శతాబ్దంలో బ్రిటీష్ దొర స్టోన్‌హౌస్ వారి పాలనలో నిర్మించిన భవనాలు నేటికీ చెక్కుచెదర లేదు. ప్రస్తుతం వారి నిర్మించిన భవనాల్లోనే తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. అలాగే బ్రిటీష్ వారు నిర్మించిన సబ్ జైలు, రాణి అతిథిగృహం, బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి భవనాలు, 165 ఏళ్ల నాటి ఉదయగిరి మెయిన్ బజార్, ఆంగ్లదొర తన సతీమణితో టాంగాలో సంచరిస్తున్న చిత్రాలు చూపరులను అకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఆ చారిత్రక స్మృతులు చెరగని జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

జిల్లా గ్రంథాలయ సంస్థలో బదిలీలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థలో బదిలీ లు జరిగాయి. నెల్లూరులో డిప్యూటీ లైబ్రేరియన్‌గా ఉన్న ప్రసాద్‌ను గూడూరుకు, కావలిలో పనిచేస్తున్న ఎస్.సునీతను నెల్లూరు డిప్యూటీ లైబ్రేరియన్‌గా బదిలీ చేశారు. ఒంగోలులో పనిచేస్తున్న పీ.కోటేశ్వరిని కావలికి బదిలీ చేశారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆర్.కుమార్‌ను గుంటూరుకు, గుంటూరు నుంచి ఎం.సీతారామయ్యను నెల్లూరుకు బదిలీ చేశారు. వీరితోపాటు మరి కొందరిని రాష్ట్ర పబ్లిక్ గ్రంథాలయ సంచాలకులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం మైపాడు బీచ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. మైపాడు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు బీచ్‌లో యోగా సాధన చేయడం అందరినీ ఆకట్టుకుంది. సూర్యోదయాన... సాగర కెరటాల మధ్య, ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో పావని ముఖ్య అతిథులుగా పాల్గొని సామూహిక యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ఆరోగ్యంగా ఉండాలంటే మన జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు యోగా గొప్ప సాధనమని అన్నారు. యోగాంధ్ర స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఓ భాగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఆరోగ్యంతో కూడిన అందమైన జీవన విధానానికి యోగా మంచి సాధనమన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లాలో ఇప్పటివరకు 8 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. 124 మంది మాస్టర్ ట్రైనీలను గుర్తించామని, అలాగే 7వేల మంది సాధారణ శిక్షకులను గుర్తించామన్నారు. వీరి ఆధ్వర్యంలో గ్రామ, వార్డు స్థాయిల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు కల్యాణిరెడ్డి, వీరేంద్రనాయుడు, కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెంచుకిషోర్‌యాదవ్, ఏకొల్లు పవన్‌కుమార్‌రెడ్డి, పీఎల్‌రావు, ఏడుకొండలు, సుధాకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



చిన్నారుల యోగాసనాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

మైక్రో ఇరిగేషన్ అధికారుల విచారణ

● మోసపోయిన రైతుల వివరాలు సేకరణ

ఉలవపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరాలో చేతివాటంపై మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఈనెల 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'డ్రిప్స్, స్ప్రింక్లర్లు సరఫరా పేరుతో కుచ్చుటోపి' కథనానికి స్పందించిన జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ బీ శ్రీనివాసులు విచారణకు ఆదేశించారు. దీంతో మంగళవారం మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్(ఎంఐఈ) బాలాజిరెడ్డి, డివిజనల్ కోఆర్డినేటర్ రామ్మోహన్‌రెడ్డి మండలంలోని చాగొల్లు, ఉలవపాడు గ్రామాల్లో పర్యటించారు. చాగొల్లులోని తమ్మినేని సుజాత, తమ్మినేని నరసింహనాయుడు, ఊట్ల రామకోటేశ్వరరావు తదితర రైతులను విచారించగా ఉలవపాడు సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఏడుకొండలు, అజయ్‌లు ఇద్దరు చెప్పడంతో మహేంద్ర ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధి నారాయణకు రూ.70,000 చెల్లించామని వారు తెలిపారు. వీఏఏ అజయ్, ఏడుకొండలను ప్రశ్నించగా తొలుత నమ్మకం కుదిరేందుకు రూ.1,50,000 విలువ చేసే డ్రిప్స్ సరఫరా చేశాడని నమ్మి మండలంలోని 22 మంది రైతుల నుంచి అతని అకౌంటుకు సుమారు రూ.4 లక్షలు డబ్బులు చెల్లించినట్లు చెప్పారు. స్ప్రింక్లర్ల కోసం డబ్బులు చెల్లించిన రైతుల వివరాలు తీరుకున్నట్లు విచారణ అధికారులు తెలిపారు. దీనిపై సేకరించిన సమాచార నివేదికను మైక్రో ఇరిగేషన్ పీడీకి అందిస్తామని వారు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెగ్యులేటర్‌కు తాళం కష్టాలు

మనుబోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న రెగ్యులేటర్ మనుబోలు దళితవాడలోనిది. మనుబోలు పెద్దచెరువు నీరు ఇటు కాలువలకు, అటు వాగుకిందకు వెళ్లేందుకు వీలుగా దీన్ని నిర్మించారు. గతేడాది దీనికి రూ.లక్షలతో మరమ్మతులు చేసి కొత్త చెక్కను ఏర్పాటుచేశారు. అయితే చెక్క ఎత్తేందుకు, దించేందుకు వీలుగా చేయడంతోపాటు లాక్ ఏర్పాటు చేయాల్సి ఉంది. లాక్ ఏర్పాటు చేయకపోవడంతో సాగునీటిని రైతులు ఎవరోఒకరు వదిలేస్తున్నారు. దీంతో అవసరంలేని పొలాలకు నీరు పారడంతో ఇబ్బందిగా ఉంటోందని రైతులు చెపుతున్నారు. అంతేగాక కాలువలకు నీరు వదిలినప్పుడు, పూర్తిగా చెక్కదిగక వాగుకు సాగునీరు వృథాగా పోతోంది. కావున తక్షణమే నీటిపారుదల అధికారులు స్పందించి చెక్కకు లాక్ ఏర్పాటుచేయాలని మనుబోలు సాగునీటి సంఘం అధ్యక్షులు పచ్చిపాల రామిరెడ్డి కోరుతున్నారు.



లాకులేని రెగ్యులేటర్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

మద్యం సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన మద్యం సీసాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఆకుతోట సమీపంలో గల పార్థసారథిన గర్‌లోని రాంమోహన్ నివాసంలో మంగళవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వానికి పన్ను చెల్లించని 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాంమో హన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నెల్లూరు-1 ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తమదైన శైలిలో విచారించగా విశ్రాంత మిలటరీ ఉద్యోగుల వద్ద మద్యం సీసాలు సేకరించి, వాటిని రూ.500 అదనంగా అమ్ముకుంటున్నానని రాంమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు ఎస్‌డీ ఖాలేషావలి, సీహెచ్ పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్ కానిస్టేబుళ్లు ఎన్.మునిరాజ్‌కుమార్, కే. రమణయ్య పాల్గొన్నారు.

సేవకు కేరాఫ్ సురేంద్ర

తోటి వారికి సేవ చేయాలంటే డబ్బు ఉండటమే ప్రామాణికం కాదు... దానికి మంచి మనసు, సత్సంకల్పం ఉండాలి. అలాంటి సంకల్ప బలం ఉంటే డబ్బు లేకపోయినా పదుగురి సహకారంతో ఆపన్నులను ఆదుకోవచ్చు. అట్టడుగు వర్గాల వారికి అండగా నిలవొచ్చు. ఇందుకు నిదర్శనం ఆటో డ్రైవర్ గంగపట్నం సురేంద్ర. సొంత ఇల్లు, సొంత ఆటో లేకపోయినా పేదలకు సాయం చేయాలన్న పెద్ద మనసున్నవాడు. తన స్వశక్తికితోడు దాతలను కూడగట్టుకుని సామాజిక సేవలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఆ సేవలే ఈ ఆటోవాలాను అందరివాడిగా మార్చి గౌరవ డాక్టరేట్ పొందే స్థాయికి చేర్చాయి.

- ఆటో నడుపుతూనే అపార సేవలు
- దాతలతోడుతో పేదలకు అండగా..
- ఉచిత ప్రయాణం, అన్నదానం, మొక్కల పెంపకం
- అనాథ శవాలకు అంత్యక్రియలు
- కుట్టు శిక్షణ, కళా సాంస్కృతిక సేవ
- స్ఫూర్తిదాయకంగా సామాన్యుడి జీవనం



గర్భిణిని ఆటోలో ఆసుపత్రికి తీసుకెళుతున్న సురేంద్ర



వర్షంలో నిరుపేదలకు ఆహారం పంపిణీ చేస్తూ..

కావలి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కావలికి చెందిన పేద రైతు గంటపల్లం వెంకటేశ్వర్లు, పుల్ల మ్మ దంపతుల కుమారుడు సురేంద్ర. ఆటో నడుపు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, కుమార్తె ఉన్నారు. ఆటో నడిపితేనే కుటుంబం గడిచే పరిస్థితి ఉన్నప్పటికీ ఎంతో కొంత సామాజిక సేవ చేయాలనే దృక్పథం కలిగి ఉండేవారు. ఈ క్రమంలో గర్భిణిలు, వృద్ధులను తన ఆటోలో ఉచితంగా గమ్యస్థానాలకు చేర్చేవారు. అతని సేవాస్ఫూర్తిని గమనించిన పట్టణ ప్రముఖులు, దాతలు సురేంద్రకు సొంత ఆటో వితరణ చేశారు. చిన్న ఇంటిని కూడా ఏర్పాటు చేశారు. వారిచ్చిన తోడ్పాటుతో సురేంద్ర సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరిచారు. అతను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన మనం ఫౌండేషన్ వారు ప్రముఖ సినీ నటుడు సుమన్, మాజీ మంత్రి వేణుగోపాలాచారి చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.



సంయుక్త కుట్టు కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలతో..

సేవలు ఇలా...

- సురేంద్ర 2012లో సంయుక్త సేవా సంస్థను స్థాపించారు. దాతల సహ కారంతో పేదలకు అన్నదానం చేసేవారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని ఆటోలో తీసుకెళ్లి పేదలకు పంచేవారు.
- మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టి పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికిదాకా పదివేలకు పైగా మొక్కలు నాటి వాటి సంరక్షణ చూస్తున్నారు.
- అనాథ, అభాగ్య పిల్లలకు ప్రతినెల నిత్యావసరాలు, విద్య, వైద్యం తదితర అవసరాలు తీరుస్తున్నారు. దాతల సహకారంతో అనాథల పేరిట పోస్టల్ ఖాతాలు తెరిచి ప్రతి నెలా రూ.వెయ్యి డిపాజిట్ చేయిస్తున్నారు.
- సంయుక్త ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం స్థాపించి ఎంతో మంది మహిళలకు కుట్టు నేర్పించి దాతల సహ కారంతో మిషన్లు అందిస్తున్నారు.
- అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.
- సంయుక్త నృత్య కళానిలయం స్థాపించి ఔత్సాహికులకు భరత నాట్యం, కూచిపూడిలో శిక్షణ ఇప్పించి సాంస్కృతిక కార్యక్రమాల్లో అవకాశం కల్పిస్తున్నారు.



డాక్టరేట్ అందుకుంటూ..

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నెల్లూరు (వైద్యం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 67 నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళ వారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ విలేకరులతో మాట్లాడారు.బద్వేలు నుంచి జిల్లాలోని గురువిందపూడి వరకు 108 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మించనున్నార న్నారు. ఇందుకోసం 6 మండలాల్లోని 38 గ్రామాల్లో 980 ఎకరాల భూమిని అధికారులు సేకరణ చేపట్టారన్నారు. 2013 భూసేకరణ చట్టంప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, పునరావాసం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకటరాజు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నేతలు

వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ జగన్‌దే !

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ హక్కులు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికే ఉన్నాయని ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 85 శాతం హామీలను ఎగనామం పెట్టారని ఎద్దేవా చేశారు. ఆయన పొడిచిన వెన్ను పోటులు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ఎత్తుకుని పెంచిన బాబాయిని కిరాతంగా చంపిన వారి ని కాపాడుతూ రక్త సంబంధానికి విలువ ఇవ్వలేదన్నారు. ఆస్తికో సం తల్లిని, చెల్లిని ఇం టినుంచి బయటకు గెం టేసి వెన్నుపోటు పొడిచారన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సి సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి, సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచార న్నారు. తమ కూటమి ప్రభుత్వంలో 70 శాతం హామీలు అమలు చేశామని ఆయన వివరించారు.

అధ్యాపకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● ఏబీఆర్ఎస్ఎం

వెంకటాచలం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా రంగంలో అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కారించా లని అఖిల భారతీయ రాష్ట్రీయ సైకిక్ మహా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు (ఏబీఆర్ఎస్ఎం) ప్రొఫెసర్ వైపీ. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యాపకుల నియామకం, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, పదవీ విరమణ చేసిన అధ్యాపకులకు రావాల్సిన బకాయిల విడుదల, నూతన పీఆర్‌సీ ఏర్పాటు, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల హోదా మార్పు, బదిలీలు, ఇంటీరియమ్ రిలీఫ్, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డుల చెల్లుబాటు, యూనివర్సిటీల్లో శాశ్వత వీసీల నియామకం మొదలైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభు త్వం కృషి చేయాలని వారు కోరారు. ఇప్పటికే ఏబీఆర్ ఎస్ఎం తరు పున సీఎం, విద్యాశాఖ మంత్రి, ఆర్థిక మంత్రి, ఉన్నత విద్యా విభాగం అధికారులకు వినతిపత్రాలు పంపామని తెలిపారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

65 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దకే రేషన్

● ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అరవై అయిదేళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందచేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులు రేషన్‌షాపు వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. డీలరు వారి ఇళ్లకు 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోగా వెళ్లి సరుకులు అందచేస్తారని తెలిపారు. వారికి ఫోన్ చేసి డీలర్ ముందస్తు సమాచారం ఇస్తారని తెలిపారు. జిల్లాలో 89 వేల మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 55 శాతం మంది వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకులు అందచేశామని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ కడపజిల్లా పుట్టంపల్లిలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కె.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యరులకు సంబంధించిన పూర్తి సమాచారం, సీట్ల వివరాలన్నీ కూడా ఏపీ స్పోర్ట్స్‌స్కూల్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పాటల్లో ఆయన పదిలం!

- సింహపురి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహోన్నత వ్యక్తి
- ఆయన ఆశయాలను కొనసాగిస్తున్న స్నేహబృందం
- నేడు గాయని రమణకు పురస్కారం
- నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి

నెల్లూరు వాసి అయిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విశ్వకళారుడిని అందించిన జిల్లాగా గుర్తింపు పొందింది. పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు 1946లో బాలు జన్మించారు. బాలుకు ఇద్దరు సోదరులు, ఐదుగురు సోదరీమణులు ఉన్నారు. ఊహ తెలిసిన నాటి నుంచి ఎస్పీ బాలుకు సంగీతం పట్ల మక్కువ ఎక్కువే. 1966లో శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంతో సినీ రంగప్రవేశం చేసిన ఆయన తెలుగు, తమిళ చిత్రాలలో ఎన్నో పాత్రల్లో నటించి, మెప్పించారు. తెలుగు, తమిళం, హిందీతోపాటు 8 భాషల్లో 40వేలకుపైగా పాటలను పాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 29సార్లు నంది పురస్కారాలు, 2001లో పద్మశ్రీ, 2011లో పద్మభూషణ్, ఆయన మరణానంతరం 2021లో పద్మవిభూషణ్ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం అందజేసింది. 2020, సెప్టెంబరు 25వ తేదీ ఆయన అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు.

కన్నతల్లిని, జన్మభూమిని మరువకుండా..

సినీ నేపథ్య గాయకుడిగా ఎంత బిజీగా ఉన్నా ఎస్పీ బాలు కన్నతల్లిని, జన్మభూమిని మరిచిపోలేదు. ప్రతి రోజు నెల్లూరులో ఉన్న తల్లి శకుంతలమ్మ ఆరోగ్యం, యోగక్షేమాలను స్నేహితుల ద్వారా తెలుసుకుని ఆమె అవసరాలు తీర్చేవారు. వీలు చూసుకుని నెల్లూరుకు వచ్చి తల్లిని చూసుకునేవారు. అంతేగాక పేద బంధువులకు, స్నేహితులకు ఎంతోమందికి ఆయన నగదు, మాట సాయం చేసి ఆదుకునేవారు. నగరంలోని శ్రీవెంకటేశ్వర కస్తూరిబా కళా క్షేత్రంలో అమరజీవి పద్మశ్రీ ఘంటసాల, తన తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహ ఏర్పాటుకు కృషి చేశారు.



- తన ప్రాణ స్నేహితుడు, నటుడు, రచయిత, దర్శకుడు వై.కామేశ్వరరావు పేరు మీద 14ఏళ్లపాటు జాతీయస్థాయి సాంఘిక నాటక పరిషత్‌లను నెల్లూరులో నిర్వహించారు. ఈ పరిషత్‌ల ద్వారా స్నేహితులు, స్నేహం విలువను అందరికీ తెలియజేశారు.
- ఎస్పీ బాలు పేరిట సినీ రంగంలో కళాకారులకు నెల్లూరులో జాతీయ పురస్కారాలు అందజేస్తున్నారు. 2016లో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఇప్పటికీ కొనసాగుతునే ఉంది. ఈ ఏడాది గాయని బి.రమణకు బాలు జయంతి సందర్భంగా బుధవారం పురస్కారం అందజేయనున్నారు.
- వేద పాఠశాల కోసం నెల్లూరులోని తన ఇంటిని ఎస్పీ బాలు కంచి మఠానికి ఇచ్చారు. తన గానామృతంలో విశ్వఖ్యాతి గడించిన బాలసుబ్రహ్మణ్యంకు స్మారకంగా ప్రభుత్వం నగరంలోని సంగీత పాఠశాలకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పాఠశాలగా నామకరణం చేసింది. బాలాజీనగర్‌లో బాలసుబ్రహ్మణ్యం వీధి, పార్కును ఏర్పాటు చేయడంతోపాటు ఆయన విగ్రహాన్ని నగర పాలక సంస్థ ఏర్పాటు చేసింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

నా అదృష్టం



స్నేహం, స్నేహితులు అంటే బాలు ప్రాణం ఇచ్చేవాడు. ఆయన స్నేహ బృందంలో నాకూ చోటు లభించడం నా అదృష్టం. బ్యాంకు ఉద్యోగి అయిన నాకు సంగీతం, సాహిత్యం, సాంస్కృ తిక రంగాల పట్ల ఆసక్తిని కల్పించారు. బాలు ప్రేరణతోనే చేతన వేదికను ఏర్పాటు చేశాము. బాలు జయంతి, వర్ధంతి రోజున ఎన్నో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

- వై.శేషగిరీశం, చేతన వ్యవస్థాపకుడు

ఆపన్న హస్తం అందించారు!



తెలుగు భాషకు వన్నె తెచ్చింది ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. నందమూరి తారక రామారావు లు. నేను అమెరికన్ కంపెనీకి మెడికల్ రెప్ర జెంటివ్ ఉద్యోగానికి ఎంపికై ముం బాయి పోవాలంటే ఆ రోజు నాకు సహాయం చేశారు. ఇలా నాలాంటి మిత్రులందరికీ ఏదో రూపంలో ఆపన్నహస్తం అందించారు. బాలు మరణించి నాలుగేళ్లు అయినా ప్రపంచమంతా ఆయన్ను ఇంకా గుర్తించుకొని వున్నారు.

- ఎం. ప్రసాదరావు